UNIVERSAL LIBRARY
OU_204938
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T82 V33P Accession No. T4095

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below

# పోతుగడ్డ

(నాటకం)

★

రచన

వాసిరెడ్డి భాస్కరరావు

★

విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ.

ప్రచురణ నెం. 53
ప్రథమ ముద్రణ
డిశంబరు '53.

వెల : 1-8-0

స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు,
విజయవాడ-2.

# పరిచయం

★

ఆంధ్ర ప్రజానీకమంతా చూచి ఆనందించిన 'ముందడుగు' 'మాభూమి' 'అపనింద' నాటక రచయితల్లో ఒకరైన శ్రీ వాసిరెడ్డి భాస్కరరావు గారిచే రచించబడ్డ 'పోతుగడ్డ' నాటకం ఆంధ్రప్రజలకు అందిస్తున్నందుకు సంతోషిస్తున్నాము. శ్రీభాస్కర రావుగారు ఈ నాటకంలో గ్రామీణ ప్రజల జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. ఆంధ్ర ప్రజ లీనాటకాన్ని అభిమానించి ఆదరించుతారని ఆశించుతున్నాం.

—ప్రచురణకర్తలు.

# పాత్రలు

గజపతి : వయస్సు 40, ఒక నిరంకుశ ప్రభువు.

భీమన్న : వయస్సు 35, గజపతికింద సర్దార్.

ప్రసాద్ : వయస్సు 24, అభ్యుదయ భావాలుగల యువకుడు, గ్రామానికి నాయకుడు.

సరోజిని : వయస్సు 18, ప్రసాదుకు కాబోయే భార్య. సరళ హృదయ.

శేషగిరి : వయస్సు 25, సరోజిని అన్న, గజపతి అనుచరుడు. అవకాశవాది.

భద్రయ్య : వయస్సు 50, సరోజిని తండ్రి, పెద్దరైతు.

వీరయ్య : వయస్సు 35, సామాన్య రైతు. రాత్రి పాఠ శాలలో ఒక విద్యార్థి. ముక్కుసూటిగా మాట్లాడే స్వభావం.

నారాయణ : వయస్సు 30, వీరయ్యకు సహపాఠి. మంచివాడే కాని పిరికి స్వభావం.

ముక్కంటి : వయస్సు 25, రాత్రి పాఠశాలలో విద్యార్థి. చాకలి. చదువుకోసం తహతహలాడతాడు. మాజీ సైనికుడు, మంచి సమయస్ఫూర్తి ఉంది.

★

"ఈ నాటకాన్ని ప్రదర్శించేవారు ముందుగా రచయిత నుంచి అనుమతి పత్రాన్ని పొందాలి."

రచయిత

**వాసిరెడ్డి భాస్కరరావు**


C/o విశాలాంధ్ర ప్రచురణాలయం,
బకింగ్ హాం పేట (పోస్టు), విజయవాడ.


★

[ అంటూ ఊడిపోతున్న గోచులు సర్దుకుంటూ మీదిమీదికి వచ్చి రెట్టించుకుంటూ ఉంటారు. చేతిలో పలక, పుస్తకం పుచ్చుకుని ముక్కంటి ప్రవేశం. ]

వీర :
నారా : } [ ముక్కంటిని చూచి ఒకేసారి ] ఆఁ నీది దెబ్బ.

ముక్కంటి : యస్. నాదే దెబ్బ, దెబ్బంటే దెబ్బ, దెబ్బకి దెబ్బ. దెబ్బమీద దెబ్బ; రైఫుల్ దెబ్బ, టామీదెబ్బ, గైడర్ దెబ్బ.

వీరయ్య : [ నారాయణవైపు ఆశ్చర్యంగా చూచి ] ఏందిరోయ్ మనాడు ఇంగిలిపీసు మాట్టాడతన్నాడు !

నారా : యుద్ధంలో కెల్లాడుగా సిరుడు.

ముక్కంటి : సదువు రాదుగాని తస్సాదియ్యా కమాండరు మీద కమాండరునైపోయేవాణ్ణి. ముక్కంటిగాడి దెబ్బంటే ఏందనుకున్నారో, దెబ్బకి బెబ్బులి గింగిరాల్ తిరిగి కింద పడాలి.

[ లెఫ్ట్ రైట్ లెఫ్ట్ రైట్ అంటూ లాంతరు దగ్గరకు వెళ్లి వత్తి ఎక్కించి, మధ్యలో పెట్టి, బాసీపెట్టువేసి పలకమీద వ్రాసియున్న పద్యం చదువుకో బోతాడు.]

వీరయ్య : ఆనిక చదువుకోవచ్చు లేవోయ్. కాసేపు యుద్ధం ముచ్చట్లు చెప్పరా; ఇంకా పంతులుగారు రాలేదుగా !

ముక్కంటి : సద్దిఅన్నం తిన్న అమ్మ మొగుడి ఆకలి ఎరుగ దంట. నీకేం, పాటాలు వచ్చినియిగా బాగానే సెపుతావ్ కబుర్లు. పంతులుగారొస్తే కొప్పడేది నిన్నా నన్నా? తన వల్లు గాకపోతే తాటిపట్టె కెదురుగా డేకమన్నట్టుంది.

వీరయ్య: తస్సాదియ్యా, ఎన్నిమాటలు నేర్చావురా?

ముక్కంటి: [ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ పలక తీసుకొని బిగ్గరగా చదువుతాడు.]

అప్పిచ్చు, వాడు వైద్యుడు
అప్పిచ్చు, వాడు వైద్యుడు

నారా: ఏఁవిటెరా ఈ శ్లోకపీక లేశ్వరుడు? "అప్పిచ్చు — వాడు వైద్యుడు" గాదోయ్. "అప్పిచ్చువాడు, వైద్యుడు" అని చదవాలి.

ముక్కంటి: అప్పిచ్చువాడు, వైద్యుడు
నెప్పుడు నెడతెగక పారు నేరును
నేరును ... నేరును ... ది ది ది ది ది దీ – దెబ్బ

ఏందయ్యా నారాయణా. ఇంతలావుం దీ అచ్చరం నోరు తిరక్కుండా.

నారా: ద్వి. దీ కు వావ త్రిస్తే ద్వి. ద్విజుడున్.

ముక్కంటి: ధిజుడున్.

నారా: [వెక్కిరిస్తూ] ధిజుడున్. దద్దమ్మా. ధిజుడు గాదోయ్, ద్విజుడు.

ముక్కంటి: అదే లేవయ్యా. కాస్తి ఎక్కైతే ఏవుంది. ఇదేం తుపాకి దెబ్బా గురిజూసి సరిగ్గా కొట్టానికి.

వీరయ్య: ఏందిరోయ్! మాటి మాటికి దెబ్బంటున్నావు. నీ దెబ్బ మరీ అంత జోరుగా ఉంటుందా ఏం?

ముక్కంటి: ఉండక దానబ్బగాడికి బాకీయా. నాయనమ్మ లాగా ఇంట్లో కూసునేవాడికి నీకేం తెలుసయ్యా...సరదా

అంటే అదీ సరదా. ఇక్కడేం ఉంది నా పిండాకూడు పచ్చిబద్దలు. నాలుగురోజులు బతికినా అట్టా బతకాలి.

మైఁ బనకే రాజా బన జాఁవూఁ
మైఁ బనకే రాజా బన జాఁవూఁ

[అంటూ హుషారుగా తల ఊపుతూ సుఖ పారవశ్యంతో అర్థ నిమీలిత నేత్రుడై పాడతాడు.]

వీరయ్య: ఆరి నీ ఇల్లు బంగారంగానూ, ఏడాదిలో ఎన్ని విద్యలు నేర్చావురా!

నారా: అరేయ్ ముక్కంటీ! ఈ పిచ్చి పాటలకేమొచ్చెగాని ఒక్క మంచి పాట పాడరా.

ముక్కంటి: ఆ రోజుల్లో తస్సాదియ్యా కదం తొక్కుతా పదం పాడతా ఉంటే వల్లు ఉప్పొంగి పోయేది. ఏం లాబం, ఇప్పు డొక్కటీ గ్యాపకంరాదు. సిన్నప్పుడు నేనేగనక సదువుకోనుంటే ఇప్పుడు సూపెట్టేవాణ్ణి నా మజా.

వీరయ్య: ఈ వెదవ చదువు నీ కెందుకురా. చదువుకున్నాడి కంటే చాకలోడే మేలన్నారు.

ముక్కంటి: ఈ మెట్ట వేదాంతం చెప్పే మొట్టమొదటినుంచి మాకొంప దీశారు. ఈ పప్పులిక మన ముందేఁవీ ఉడకవు. సదువులో ఎంత గొప్పతనం ఉందో మీ కేం తెలుసయ్యా, అనుబగించినాడికి నాకు తెలుసు. ఆ రోజుల్లో–వీరయ్యన్నా! అదే ఆరోజుల్లో–మాకు రాస్యంగా సీటీలొచ్చేయి. సదువు రాదాయె. ఏం జేస్తాం. పరాయాడి దగ్గిరకెళ్ళి సదివించు కుందామాఅంటే గుట్టుకాస్తీ బైటపడిపోద్ది. గుట్టు బయట

బడితే ఆ రోజుల్లో ఇంకేం ఉందే, మన ఆయువుపట్టుకాస్తీ బయటపడ్డట్టే. సదువంటే ఏంటో అప్పుడు తెలిసింది నాకు. సదువు లేకపోయినతరవాత సత్తేం బతికితేం? ... ఇదిగో, ఆరు నెలల్లో బారత బాగవతాలు సదవకపోతే నీ కాలికిందగా దూరిపోతా; ముక్కంటి దెబ్బంటే ఏందనుకున్నావో.

నారా : నువ్వు పట్టుపడితే ఇంకేఉందిరా జలగ పట్టినావె. సరేగాని ముందొకపాట పాడుదూ.

ముక్కంటి : పాట పాట పాట. సరే, వంత పాడండి.

వీరయ్య :<br>నారాయణ : } ఓ కాని ఛ్.

కోరస్ : లేదంటావా<br>ఇది కాదంటావా<br>మరి ఏమంటావో<br>పెత్తనమా దొరతనమా ?

ముక్కంటి : దేశమెల్లా కొల్లగొట్టీ<br>గుల్లచేసిన తెల్ల దొరలే<br>శత్రువులు మనజాతి కంచని<br>నీతులెన్నో చెప్పలేదా ?

వీరయ్య :<br>నారాయణ : } నీతులెన్నో చెప్పలేదా ?

కోరస్ : అవునోయి అవును.

ముక్కంటి : మెత్త మెత్తగ దొరల పొత్తున<br>జేరి పెత్తందారులై, తిన

తిండి అడిగితే గుండెలోన తు
పాకి గుండును గుచ్చినావురా
కోరస్ : లేదంటావా............||
ముక్కంటి : ఎదురు తిరిగిన దిబ్బరాజును
మదమణంచీ దింపివేయగ
గుంపు గుంపుగ మేటి దండును
పంపినానని చెప్ప లేదా ?
వీరయ్య :
నారాయణ : } పంపినానని చెప్పలేదా ?
కోరస్ : అవునోయి అవును.
ముక్కంటి : దిబ్బరాజును దెబ్బగొట్టక
గద్దె దింపక పెద్దజేసీ
కూలిరైతుల గొంతుగోసీ
గొప్ప పుణ్యము కట్టుకుంటివి
కోరస్ : లేదంటావా............||
ముక్కంటి : ఓటు మా పార్టీ కొసంగిన
కూటికేమీ కొదువలేదూ
కోటి లాభాల్ కలుగునంచని
గొప్పలెన్నో చెప్ప లేదా ?
వీరయ్య :
నారాయణ : } గొప్పలెన్నో చెప్పలేదా ?
కోరస్ : అవునోయి అవును.
ముక్కంటి : ఓటుకోసం ప్లాటుఫారము
లెక్కి ఘాటిగ చాటినట్టీ

మాటలన్నిటి మూటగట్టీ
నీటముంచిన మేటివీవూ

కోరస్ : లేదంటావా...............॥

[ పాట అయిపోగానే ముక్కంటి మళ్ళీ పతికిలబడి పలక తీసుకుం టాడు. నారాయణ బైటికివెళ్ళి చూస్తాడు. ]

ముక్కంటి : అప్పిచ్చువాడు – వైద్యుడు
అప్పిచ్చువాడు – వైద్యుడు

వీరయ్య : ఆరి సిన్ను తగలెయ్య, ఊపిరాడనిచ్చేటట్టు లేవే ?

నారా : [ ఆలోచిస్తూనే ప్రవేశించి ] ఏంటి ఇద్యార్థుల ఇంకెవరూ రాలేదు !

వీరయ్య : చాలా పొద్దు పోయింది. పంతులుగారు కూడా రాలేదేంటబ్బా !

నారా : [ హడావిడిగా ] పదరా ముక్కంటి, అసలు ఇద్యార్థుల బడి ఉందో లేదో కనుక్కొద్దాం.

[అంటూ ముక్కంటి చేతిలో ఉన్న పలక లాక్కోబోతాడు.]

ముక్కంటి : [ విసుగ్గా ] ఉండండహె. నేను సదువుకోవాలం టుంటే. మీరెల్లండి, నేను రాను.

[అంటూ మళ్ళీ పలక లాక్కొని తన పనిలో నిమగ్నుడౌతాడు.]

వీరయ్య : [నారాయణతో] వెళ్దాం పదరా, ఈ మొండాడితో మన కేంటి ?

[ఇద్దరూ పక్కకి నాలుగడుగులు వేస్తారు. నారాయణ ముక్కంటిని ఉడికించటానికి మెల్లిగా వచ్చి లాంతరు వత్తి తగ్గిస్తాడు.]

ముక్కంటి : [గబుక్కున లేచి] ఏయ్ నా సంగతి తెలుసా ! నాకు కోపం వచ్చిందంటేనా ?

[అంటూ ఒత్తి ఎక్కించి మళ్ళీ కూర్చొని గుక్కతిరక్కుండా -]

అప్పిచ్చువాడు - వైద్యుడు,
నెప్పుడు. నెడ తెగక పారు నేరును
నేరును ది ది ది దీ - దెబ్బ - తల్లి సిగ దరగ?

మళ్ళీ ఇక్కడే పట్టు అట్టిందే. ఏఁయ్ పజ్జెం, తెలుసా నా సంగతి? ఈసారి రాకపోయావా దెబ్బకి షూట్। చేత్తా.

(భీమన్న ప్రవేశం. కోర తలగుడ్డ, చేతిలో సన్నని ముల్లుగర్ర, కిర్రు చెప్పులు, బుర్రమీసాలు, ఎడమకాలిమీద పంచె చెంగు పైకి దోపుతాడు, కుచ్చెళ్లు వెనక్కితిప్పి గోచీ పెడతాడు. చెవులకు పోగులు, చేతులకు మురుగులు; అంతా తూర్పు కోడె బేరగాళ్ళ కత్తు.)

ముక్కంటి : [భీమన్నను చూచి లేచి నుంచొని సవినయంగా] ఏ ఊరండీ మనది?

భీమన్న : [కృత్రిమంగా తెచ్చిపెట్టుకున్న ఒక రకపు యాసతో) మాది తూరుపండి.

ముక్కంటి : తమపేరు?

భీమన్న : అప్పలరాజంటారు.

ముక్కంటి : [భీమన్నను కొంచెం ఎగాదిగ చూచి] దొరగారేదో పనిమీద బయల్దేరినట్టుంది.

భీమన్న : ఆఁ ఏం లేదు, కోడెలబేరం.

ముక్కంటి : ఓ. గిత్తల బేరగాళ్ళా! నుంచున్నారేం, అట్టా బల్లమీద కూసోండి. [భీమన్న కూర్చుంటాడు]. ఈ ఊళ్లో ఎక్కడెక్కడ నూశారేం గిత్తలు?

భీమన్న : ఇంకెక్కడ; ఇప్పుడేగా వస్తి.

ముక్కంటి : ఎక్కడనుంచి వస్తున్నారు ?

భీమన్న : అమలాపురంనుంచి.

ముక్కంటి : అమలాపురంనుంచా ? ఈ ఊళ్లో జానయ్యగారి గిత్తల్ని సూడలా ?

భీమన్న : పేరు సరిగ్గా గుర్తులేదు. మిట్టమీామంందే, భవంతి...

ముక్కంటి : ఆఁ అఁ. అక్కడే. ఆ వెలపట గిత్త సూశారా అబ్బ ! ఏం గిత్త.' బలే గిత్త !

('వెలపట, దాపట' అంటే తెలియక భీమన్న ముదట కొంచెం కంగారుపడి వెంటనే మళ్ళీ గుక్కతిప్పుకొని )

భీమన్న . అవు నవును.

(అంటూ ముక్కంటికి ఒక సిగరెట్టు తీసి ఇవ్వబోతాడు.)

ముక్కంటి : వద్దులెండి బాబు ! నా మొకానికి సిగరెట్టు కూడానా ?

భీమన్న : మ్చ్. తీసుకోవోయ్, మరేం పర్వాలేదు.

(అంటూ సిగరెట్టు ఇస్తాడు. తానొకటి కాల్చుకోటానికి తీస్తాడు.)

ముక్కంటి : దాపట మాత్రం : (అంటూ లాంతరు దగ్గరకు వెళ్తాడు.)

భీమన్న : అంటే ?

ముక్కంటి : [నవ్వుతూ] దాపట అంటే తెలవదూ ?

[ అంటూ సిగరెట్టు కాల్చుకోమని లాంతరు అందివ్వబోతాడు. ]

భీమన్న : వద్దులే, అగ్గిపెట్టె ఉందిలే.

[ అంటూ తన జేబులోనుంచి అగ్గిపెట్టె తీసి సిగరెట్టు కాల్చుకుంటూ ఉంటాడు. ముక్కంటి అతని ముఖ కవళికలు తేరిపారజూచి - భీమన్న నిజంగా గిత్తల బేరగాడు కాదని గ్రహించి వ్యంగ్యంగా ]

ముక్కంటి : అవున్లెండి. బస్తీలో ఉండేవాళ్ళకి యెలపట దాపట ఏం తెలుసుద్ది ?

[ భీమన్న కంగారు పడతాడు. కాని కంగారును కనపడనీయకుండా వెంటనే ]

భీమన్న : మీ ఊళ్ళో మంచి గిత్తలున్నయ్యా ?

ముక్కంటి : గిత్తలకేం కరువు; సాలా ఉండయి. ఏం లాబం. అన్నీ పోట్ల గిత్తలే.

భీమన్న : పట్టుకోటానిక్కూడా దొరకవా ?

ముక్కంటి : మీకాట్టె పిచ్చినోరల్లాగా ఉండారే. ఈ ఊరి గిత్తలంటే ఏఁవనుకున్నారేం! మీలాంటి కొత్తోళ్ళని ముందే పసి గట్టేత్తయి. ముందుకెత్తే పొడుస్తాయి. ఎనక్కెత్తే తంతయ్. వద్దుబాబూ వద్దు, కొరివితో తల గోక్కోవద్దు.

భీమన్న : [ప్రసంగ ధోరణిని మార్చడంకోసం సిగరెట్టును గట్టిగా పీల్చి నోటినిండా పొగ వదుల్తా]

సరేగాని మీ స్కూలు బాగా సాగుతోందా ?

ముక్కంటి : (అసంతృప్తిగా) ఇస్కూలూ నాబొందా !

భీమన్న : అదేంటి అలా అంటావు ?

ముక్కంటి : (నిట్టూర్చి) ఏముంది బాబూ ! మరీ మా దేశానికే పోయేకాలం వచ్చింది. మీకే బాదర బందీ యేం లేదుగా?

భీమన్న : [ఆశ్చర్యపోయి] ఇప్పుడు మీ కొచ్చిన బాదరబందీ ఏం ఉంది? గజపతిగారు పారిపోయిన తరువాత మీ ఊరంతా హాయిగా ఉందని విన్నాను.

ముక్కంటి : ఇంటానికేం, దూరపు కొండలు నునుపు. మా తిప్పలు దేవుడి కెరుక.

భీమన్న : చాలా చిత్రంగా మాట్లాడతన్నావు.

ముక్కంటి : సిత్రవే, అంతా సిత్రవే. సెప్పుకుంటే మానం బోయె, సెప్పుకోకపోతే పాణంబోయె అన్నట్టుగా ఉంది మా పని.

భీమన్న : ఆఁ, నీ పేరేఁవిటి ?

ముక్కంటి : ముక్కంటి అంటారు దొరా.

భీమన్న : కులం ?

ముక్కంటి : సాకలోణ్ణి బాబు.

భీమన్న : మళ్ళీ గజపతిగారి జాడ ఏఁవన్నా తెలిసిందా ?

ముక్కంటి : పట్ణంలోనే ఉండారంట ! (విచారంగా) సల్లని మారాజు. పిల్లా జెల్లాతో పాపం సాలా కట్టాలు పడతన్నారంట లెండి. ఆ మారాజుండగా మా సాకలి మంగలోళ్ళ పని ఇట్టా ఉండేదా ? (కళ్లు తుడుచుకుంటూ) తలుచుకుంటే ఏడుపు వత్తంది బాబూ !

భీమన్న : మీ రాజాగారు పనివాళ్ళందరినీ అంత బాగా చూసేవా డన్నమాట ?

ముక్కంటి : అడుగుతారా. పెట్టినా ఆ మారాజే, కొట్టినా ఆ మారాజే. దీపం బెట్టి రోజూ ఆయన పేరు తలుసుకుని దణ్ణం పెట్టుకుంటాం. ధర్మరాజంటే ఆయన్నే సెప్పుకోవాలి. లేదనేమాట సత్తె ఆయన నోటినుంచి వచ్చేదా. అడగనోడు పాపాత్ముడనుకోండి. ఆయనగారు ఎప్పుడు ఈ ఊళ్లోనుంచి ఎల్లిపోయ్యారో అప్పుడే మాకు శనిబట్టుకుంది. అయినా నా కెందుకొచ్చిన గొడవ లెండి. గోడకూడా చెవులుంటయ్.

భీమన్న : గ్రామస్థులంతా ఇష్టపడేగా కొత్తరాజ్యం తెచ్చుకుంది ?

ముక్కంటి : కొత్తరాజ్యం. వల్లకాటి రాజ్యం, ఓ సెబ్బో! అడగాలా దాని సుకం. కరిత్తె మెదిత్తె ఈ కొత్తరాజ్యంలో సచ్చిపోయే రోజొచ్చింది. తెలవక అడుగుతా బాబు! మాయదారికాలం కాకపోతే అంటకుండలు గీకే ఆడదాని కుక్కుడా ఓటెందుకండీ ?

భీమన్న : సరేగాని గజపతిగారి పొలం అంతా పంచుకున్నారటగా ! అందులో నీకేం గిట్టుబాటు గాలా ?

ముక్కంటి : అయ్యో రామా ! ఆ గీతే ఉంటే ఈ ఏడుపంతా ఎందుకు ? దున్నేవాడికే పొలంఅంట. "మైలబట్ట లుతికే సాకలోడికి నీకెందుకు పో" మ్మన్నారు.

భీమన్న : పోనీ నీ మిరాసీ ఏఁవన్నా పెంచారా ?

ముక్కంటి : ఏదో కాత్తి పెంచారనుకోండి. పెంచినా మా దొరసానిగారు కట్టిడిసిన ఒక్క సీర ఖరీదు సేత్తందంటారా?

భీమన్న : కొత్తరాజ్యం అంటే నీకింత మంటయితే మరి వాళ్ళ దగ్గిరే ఎందుకు చదువుకుంటన్నావ్ ?

ముక్కంటి : ఏం జేత్తాను నాకర్మ. వాళ్ళు రమ్మంటే రాకపోతే ఇంకేఁవన్నా ఉందా. రేపీపాటికి ఎర్ర సీటీ వచ్చిందన్నమాటే.

భీమన్న : ఎర్ర చీటీ ఏఁవిటి ?

ముక్కంటి : అదే బాబూ !

(అంటూ గొంతు కోసివేస్తారని అభినయం ద్వారా చూపెడతాడు.)

భీమన్న : (బల్లమీదనుంచి లేస్తూ) సరే వస్తా. (వెళ్ళబోతాడు)

ముక్కంటి : ఇదిగో దొరా! మళ్లీ ఎక్కడా అనమాకండి, పీక ఎగిరిపోద్ది. ఈ ఊళ్లోవాళ్ళు అసలే ఆవులిస్తే పేగు లెక్కబెట్టే రకం. ఏదో మీరు మంచి దొరల్లా ఉండారని నా సొదంతా ఎళ్లబోసుకున్నా. మీ కానిసోణ్ణి, కాళ్ళకు మొక్కుతా. మళ్లీ ఎక్కడా నా పేరెత్తొద్దు దొరా.

(అంటూ దణ్ణం పెడతాడు. అప్పటి వరకు మాట్లాడుతున్న కృత్రిమ యాసను మాని భీమన్న తన సహజ ధోరణిలో)

భీమన్న : మరేం పర్వాలేదు. భయపడకు, మళ్ళీ త్వరలోనే మంచిరోజులొస్తాయి. (వెళ్ళబోతాడు.)

ముక్కంటి : ఇక్కడిదాకా వచ్చి ఊరికే ఎల్తారం? కోస్తారాజు గారిని కూడా కాస్తసూసి ఎల్లండి.

భీమన్న : ఎవరిని మీ మాస్టారునా?

ముక్కంటి : ఆఁ. ఆయనదేగా ఇప్పుడు పెత్తనం అంతా. నేనెల్లి పిల్సుకొస్తా నుండండి.

[అంటూ పరుగెత్తుతాడు. భీమన్న అటు ఇటు చూచి జేబులోనుంచి నోటుబుక్కు, పెన్సిలుతీసి గబగబా స్కూల్లాను వేసుకొని వెళ్లి పోతాడు. ముక్కంటి ప్రసాదుని వెంటబెట్టుకుని హుటాహుటిగా ప్రవేశిస్తాడు. వీరయ్య నారాయణలుకూడా వారితోపాటే వస్తారు. ప్రసాదు సగంచేతుల చొక్కా, పైజామా ధరించి ఉంటాడు. తైల సంస్కారం తక్కువ గావటంచేత క్రాపు కొంచెం రేగి ఉంటుంది. కాని ముఖంలో మాత్రం ప్రసన్నత, గంభీరత ఉట్టిపడుతూ ఉంటాయి.]

ముక్కంటి : (అటూ ఇటూ చూసి) అరె! జారుకున్నాడండి మాస్టారూ!

(ప్రసాదు ఆలోచనలో పడతాడు.)

వీరయ్య : (ముక్కంటితో) నీ మొఖమేంగాదూ. లేచినకాడ నుంచీ నీకు అన్నీ అనుమానాలే.

నారా : అనుమానమే పెనుభూతం.

ప్రసాదు : ఈరోజుల్లో తూర్పునుంచి ఇంతదూరం గిత్తల బేరాని కొచ్చాడంటే అనుమానించాల్సిందే. — అయినా ఊళ్ళోకెళ్ళి ఆరాతీస్తే పోదూ ? ఏం వీరయ్యన్నా ?

వీరయ్య : సరే. నేనెళ్ళొస్తాగాని మీారు పాఠాలు కానియ్యండి. [ వెళ్ళిపోతాడు ]

ప్రసాదు : ఏరీ; అంతా రాలేదె ఇవ్వాళ ?

నారా : మిట్టపాడు ఎళ్ళారండీ.

ప్రసాదు : [ చప్పున గుర్తు తెచ్చుకుని ] ఓ ! మనభూమి నాటకం చూడటానికా ! సరే.

ముక్కంటి : మనంకూడా మనబూమి నాటకం ఆడాలండీ మాస్టారూ !

నారా : [ ముక్కంటితో ] గొల్లమందకు నువ్వాయితే ఫస్టుగా ఉంటావోయ్.

ముక్కంటి : ఆ. తప్పకుండా నేను గొల్లమంద కార్రెట్టుకట్టేదే. ఏఁవండీ మాస్టారూ ?

ప్రసాదు : [ చిరునవ్వుతో ] అలాగె.

ముక్కంటి : అట్టాం అంటే కాదండీ మాస్టారూ. కార్రెట్టులన్నీ ఇప్పుడు పంచాలిసిందే.

నారా : ఆరి నీ తొందరగాల ! కాస్తి ఆగవోయ్, వస్తారుగా మనాళ్ళంతా రేపు.

ముక్కంటి : [ నారాయణ మాట వినిపించుకోకుండానే ఏదో ఆలోచిస్తూ ]

మొగ కారెక్టర్లదేం వుంది గాని ఆడకారెక్టర్లదే ఇబ్బంది.

[ ఇంతలో సరోజని ప్రవేశిస్తుంది. చేతిలో పుస్తకాలు. పల్లెటూరిలో పుట్టి పెరిగినా నవనాగరికత కొంతవరకు అలవడింది. అడుగడుగునా అడ్డం వచ్చే సిగ్గు దొంతరలచాటున ఒక విధమైన ఆత్మ విశ్వాసం, పట్టుదల, ఆమె ముఖంలో దాగుడుమూత లాడుతున్నాయి. కొత్తగా పెళ్లిడికి వచ్చిన నవ తారుణ్యంలో గోచరించే నవలావణ్యం ఆమె సహజ సౌందర్యాన్ని ఇనుమడింప జేస్తూ ఉంది. ]

ముక్కంటి : ( సరోజినిని చూడడంతోనే చప్పున స్ఫురణకువచ్చి )

సరోజమ్మా! నువ్వు తప్పకుండా ఇమలమ్మ కారెక్టరుకట్టాలి.

సరోజిని : (చిరునవ్వుతో) నేనా !

ముక్కంటి : ఏం ? నాటకం ఆడితే తప్పా ?

(సరోజిని ప్రశ్నార్థకంగా ప్రసాదువైపు చూస్తుంది.)

నారా : (పరిహాసంగా) వాళ్ల బావ ఒప్పుకోవద్దూ ?

(సరోజిని సిగ్గుతో తలవంచుకుంటుంది.)

ప్రసాదు : (నవ్వుతూ) నేను ఒప్పుకోకపోవడం ఏమిటి? (సరోజినితో) నువ్వు తప్పకుండా వెయ్యాలిసిందే.

సరో : ఏమో, నాకసలే భయం. నలుగురులో లేచి నుంచుంటేనే కాళ్ళు గజగజలాడతయి.

నారా : ఒకటి రెండు నాటకాలు వేస్తే సరి. భయం గియం అన్నీ ఎగిరిపోతయి.

సరో : నేను వేస్తానన్నా మా నాన్నగారు ఒప్పుకోరుగా !

ప్రసాదు : నేను ఒప్పిస్తాగా మావయ్యని.

సరో : ఏవోఁ. నాకేం నమ్మకం లేదు. రాత్రిపూట నేనీ స్కూలుకు రావటమే ఆయన కిష్టంలేదు.

నారా : [ పరిహాస ధోరణిలో ] మీ ఇద్దరు ఇష్టపడితే ఇంకా ఆ ముసలాయ నేం చేస్తాడు; దేవుడా అంటూ మీ మాట విని తీరాల్సిందే.

ముక్కంటి : [ నవ్వుతూ ] సరోజమ్మా! పప్పన్నం ఎప్పుడు పెడతావు ?

సరో : [ సిగ్గుతో తలవంచుకుని ] నన్నడుగుతావేం ?

ముక్కంటి : సర్లే. అట్టాగయితే మాస్టారినే అడుగుతా. ఏవండీ మాస్టారూ !

ప్రసాదు : పోనివ్వవోయ్, ఇప్పుడేఁవిటి పెళ్ళి గొడవ ?

ముక్కంటి : అట్టా అంటే ఎట్టాగండీ మాస్టారూ! దేనికదే మాట్టాడుకోవాలి.

ప్రసాదు : తర్వాత మాట్లాడుకోవచ్చులే. ముందు పద్యం అప్పగించు.

[ ముక్కంటి చేతులు కట్టుకుని గబగబా మొదటి చరణం అంటాడు. తరవాత రాక తల గోక్కుంటూ ]

ముక్కంటి : సరిగా రాలేదండీ మాస్టారూ.

ప్రసాదు : అదీ కథ. అందుకనే కబుర్లు మొదలెట్టావు. లేకపోతే నీపాఠంతో ఊపిరాడ నిచ్చేవాడివేనా ?

[ హి హి హి హి అని ముక్కంటి నవ్వుకుంటూ ఉంటాడు. ప్రసాదు ఇండియా మ్యాపు దగ్గరికెళ్లి ]

నారాయణా ! ఉత్తరంగా మన దేశానికి సరిహద్దు ఏఁవిటి ?

నారా : హిమాలయ పర్వతం.

ప్రసాదు : ఆల్ రైట్ [సరోజినిని చూచి] దక్షిణంగా ?

సరో : హిందూ మహాసముద్రం.

ప్రసాదు : అచ్ఛా. [ముక్కంటిని చూచి] తూర్పు ?

ముక్కంటి : బందరండీ మాస్టారూ.

నారా : బందరు కాదోయ్ పెద్దమ్మా, బంగాళాఖాతం.

ముక్కంటి : సరిసరి. తూర్పు బంగాళాఖాతం, తూర్పు బంగాళాఖాతం, తూర్పు బంగాళాఖాతం...

[అని బట్టీపడుతూ] పడమంట సరిహద్దు ఏంటండీ ?

నారా : అరేబియా సముద్రం, అదికూడా తెలియదూ ?

ముక్కంటి : పడమట అరేబియా సముద్రం — అరేబియా సముద్రం, అరేబియా సముద్రం (అని బట్టీ పడుతూ) వచ్చి నియ్యండీ మాస్టారూ. ఇప్పుడు అప్పగించుకోండి. (అంటూ గుక్క విడవకుండా) ఉత్తరాన హిందూమహా సముద్రం, దచ్చి నంగా – దచ్చినంగా హిమాలయ పర్వతం, తూర్పున–తూర్పున అరేబియా సముద్రం–అరేబియా సముద్రం; పడమట–పడమట బంగాళాఖాతం

(అందరూ నవ్వుతారు.)

ముక్కంటి : ఏంవండీ మాస్టారూ ! తప్పు చెప్పానా ?

ప్రసాదు : తప్పో వప్పో మొత్తంమీద అన్ని పేర్లూ చెప్పావు. అంతేచాలు.

ముక్కంటి : (నవ్వుతున్న నారాయణను చూచి) ఎందుకయ్యా అట్టా నవ్వుతావు ? మొన్నీ మధ్దేనేగా నేను బళ్లోకొచ్చింది.

నువ్వొచ్చినప్పుడే నేనుకూడా వస్తే కనపడేది నీ సంగతి, నా సంగతి. ఏం సరోజమ్మా?

సరో : నీకున్న పట్టుదలే మాకుంటే ఈపాటికి పండితులమే అయిపోయేవాళ్లం.

(శేషగిరి ప్రవేశం. కట్టుపంచ, తెల్లని ఖద్దరు లాల్చీ, కాళ్ళకు కాబూలీ చెప్పులు, చేతికి గడియారం)

సరో : (శేషగిరిని చూచి ఆశ్చర్యంగా) ఏవిటన్నయ్యా! ఇప్పుడొచ్చావు?

శేషగిరి : ఏం లేదు. ప్రసాదుతో కొంచెం మాట్లాడాలి.

ప్రసాదు : ఏవిటి?

శేషగిరి : ఎప్పుడూ నీకీ స్కూలు గొడవేనా?

ప్రసాదు : ఏం?

శేషగిరి : గ్రామానికి నాయకుడవు గదా, ఊళ్లోకి ఎవరొస్తున్నారో పోతున్నారో కొంచెం కనిపెట్టి ఉండొద్దూ!

ప్రసాదు : ఇప్పుడేం జరిగింది?

శేషగిరి : ఊళ్లోకి ఇవ్వాళ ఒక కొత్తమనిషి వచ్చాడు తెలుసా?

ప్రసాదు : ఎవరా కొత్త మనిషి?

శేషగిరి : గిత్తల బేరగాడట. అతని వాలకం చూస్తే నాకు మాత్రం అనుమానంగానే ఉంది.

ప్రసాదు : ఉన్నాడా? వెళ్ళిపోయాడా?

శేషగిరి : భోజనానికుండమన్నా ఉండలేదు. గ్రామాన్ని మాత్రం మనం వెయ్యికళ్ళతో మంచి పకడ్బందీగా కాపాడుకోవాలి. లేకపోతే ప్రమాదంలో పడతాం.

ప్రసాదు : అవును. గజపతి దిబ్బరాజుతో కలిసి కుట్ర పన్ను తున్నాడు. ఎప్పుడో ఒకప్పుడు మళ్ళీ మనమీద దండ యాత్ర చేస్తాడు.

శేషగిరి : [ వ్యంగ్యంగా ] అందుకనే ఇంత జాగ్రత్తగా ఉంటున్నావు.

నారా : అదేంటి అట్టా అంటావు. మాస్టారికి తీరిక ఉండొద్దూ? లేచినప్పటినుంచి ఎప్పుడూ ఏదో ఒకపని సరిపోతానే ఉండే. మొగుడూ పెళ్ళాం తగాదా వచ్చినా ఆయనే తీర్చాలి. గట్టు వగ్గిర తగాదా వచ్చినా ఆయనే సర్దాలి. చివరకి పెళ్ళి రాయబారాలుకూడా ఆయనే నడపాలిసొచ్చె. ఒక్కడు ఎన్నని చేస్తాడు? తిండి తింటానికి కూడా తీరిక ఉండాలా?

శేషగిరి : [ చిరునవ్వుతో ] నాయకత్వం అంటే మరి మాటలను కున్నావా? [ ప్రసాదుతో ] పోనీ ఒకపని చెయ్యరాదూ?

ప్రసాదు : ఏంవిటి?

శేషగిరి : నీకు మరీ అంత భారంగా ఉంటే నామీదకూడా కొంత వేస్తే పోయేదిగా!

నారా : వేస్తే మోస్తావా అని?

శేషగిరి : మోయగలిగినంత మోస్తాను. మిగిలినదానికి ప్రసాదు ఉండనే ఉన్నాడు. గోవర్ధన పర్వతాన్ని ఎత్తి నెత్తిన బెట్టినా మోయగల సమర్థుడు.

ప్రసాదు : నీ పొగడ్తల కేమొచ్చెగాని ఏంచేస్తావో చెప్పు.

శేషగిరి : ఏది చెయ్యమంటే అది చేస్తా. స్కూల్లో పాఠాలు

చెప్పమంటే చెపుతా. ఊరు కాపలా కాయమంటే కాస్తా. ముక్కు మూసుకుని చావమంటే చస్తా. చాలునా?
[ నవ్వుతాడు ]

నారా : మాటలకేం కోటలు దాటతయ్.

ప్రసాదు : [ శేషగిరితో ] సరే, నీకు అంత ఉత్సాహంగా ఉంటే నేనెందుకు కాదనాలి. రేపటినుంచి స్కూలు చూస్తూ ఉండు. [ నారాయణతో ] మనమంతా రోజూ వంతులవారీగా గ్రామాన్ని కాపలా కాయాలి. దిబ్బరాజు చాల బలవంతుడు. అతనికి కావలసినంత ఆర్థికబలం ఉంది. ఆయుధబలం ఉంది.

సరో : మనదగ్గర ఏఁవీ లేదాయె.

ప్రసాదు : మనకు ప్రజాబలం ఉంది. ధర్మబలం ఉంది. మనం న్యాయంకోసం పోరాడుతున్నాం. సత్యంకోసం పోరాడు తున్నాం. మధ్యన ఎన్ని కష్టాలొచ్చినా, ఎన్ని నష్టా లొచ్చినా తప్పకుండా విజయం సాధిస్తాం.

సరో : ఏం సాధిస్తాఁవోఁ. అసలు మనదేశమే వట్టి పిచ్చిదేశం.

ప్రసాదు : పొరపడుతున్నావు సరోజినీ! మనదేశం పిచ్చిదేశం కాదు. స్వాతంత్ర్య పోరాటంలో అందరికంటె ముందడుగు వేసిన పోతుగడ్డ. వందలకొలది ఝాన్సీలు, వేలకొలది భగత్సింగులు పుట్టిన ఈ మట్టిని ఖండఖండాతరాల ప్రజలు కళ్ళ కద్దుకుంటున్నారు. ఈనాడు మనదేశాన్ని చూచి ముక్కోటి ఆంధ్రులే కాదు, ముప్పైఆరుకోట్ల భారతీయులు గర్వంతో పొంగిపోతున్నారు. దాదా, సీతమ్మలాంటి అమరవీరులకు యావత్ప్రపంచం హారతి పడుతూ ఉంది.

శేషగిరి : జై! స్వతంత్ర భారత్ కీ జై!

అందరు : జై! స్వతంత్ర భారత్ కీ జై!

కోరస్ :
తెలుగువీర లేచిరా
జాగదేల సాగిరా
మేరునగం లేచిందీ
హోరుగాలి వీచిందీ
ధీరు లెవరో రారండీ
భీరువు లిక పోపొండీ ॥తెలుగువీర॥

తర తరాల అజ్ఞానం
నర నరాల జీర్ణించీ
అణగారిన మనజాతికి
నవజాగృతి సమకూర్చగ ॥తెలుగువీర॥

అరణ్యమే శరణ్యమై
శరీరమే నశించినా
పరాజయం పరాభవం
సహించనీ చలించనీ ॥తెలుగువీర॥

యుగ యుగాల రకరకాల
దోపిడికీ రాపిడికీ
నరజాతిని గురిజేసిన
పరపీడన నుసుమాడగ ॥తెలుగువీర॥

# రెండో దృశ్యం

★

## భద్రయ్య ఇల్లు

[హాలు – నీటుగా, శుభ్రంగా ఉంటుంది. ఒక టేబుల్, రెండు మూడు కుర్చీలూ, టేబుల్ మీద కొన్ని పుస్తకాలూ, ఒక ఫౌంటెన్ పెన్ ఉంటాయి. ఎదురుగా ఉన్న గోడకు సరోజినీనాయుడు ఫొటో తగిలించి ఉంటుంది. టేబుల్ మీద ఉన్న పుస్తకాలూ వగైరాలను చక్కగా ఒక క్రమపద్ధతిలో సర్దుతూ సరోజిని పాటపాడుతూ ఉంటుంది.]

బావా రావా
ఓ బావా రావా
నిను వదలి నా మనసు నిలవలేదోయీ
కను మూసినా నీవె కనిపింతువోయీ ॥బావా॥
చిరునగవు చిన్నెల
గురిపించు వెన్నెల
దోగించి ఊగించి దోబూచులాడ ॥బావా॥
అంత చక్కని రూపు
అంత చల్లని చూపు
దొరలించి మురిపించి మరపించివేయ ॥బావా॥

ఆట పాటల ముంచి
చాటుమాటుగ పొంచి
ఉలికించి పలికించి కులికించివేయ ॥బావా॥

( పాట పాడుతూ వుండగానే ప్రసాదు ప్రవేశించి మధ్యలో విఘ్నం కలిగించడం మంచిది కాదని కొంచెం పక్కకు తప్పుకుని గానసుధా రసాన్ని ఆస్వాదిస్తూఉంటాడు. పాట పూర్తి కాగానే. )

ప్రసాదు : ( చిరునవ్వుతో ) ఎంత కమ్మగా పాడుతున్నావ్ ?

( సరోజిని ఉలిక్కిపడి వెనక్కి తిరిగిచూచి సిగ్గుతో గబుక్కున కొంచెం పక్కకు తప్పుకుంటుంది. )

ప్రసాదు : ( సరోజిని దగ్గరకువెళ్ళి ) అంత సిగ్గేసిందా ?

( సరోజిని మాట్లాడకుండా తల వంచుకుంటుంది. కుడిచేతి బొటన వ్రేలి గోటిని పంట్లసందున పెట్టుకుని ఎడమకాలి బొటనవ్రేలితో నేల మీటుతూ ఉంటుంది. సిగ్గు తెరను చీల్చుకుంటూ వస్తూవున్న చిరునవ్వు ముఖంలో చిందులాడుతుంది. )

ప్రసాద్ : నాదగ్గిరే ఇంత సిగ్గయితే మీటింగుల్లో ఎలా పాడతావ్ ?

సరో : నేనెందుకు పాడతాను ?

ప్రసాదు : నీ ఇష్టమేనా ఏంవిటి ?

సరో : నీ ఇష్టమా ?

ప్రసాదు : అప్పుడే ఎదురు తిరిగి మాట్లాడుతున్నావే ? ఇలాగైతే నిన్నెవరూ పెళ్ళి చేసుకోరు.

సరో : (ప్రణయకోపం నటిస్తూ) నన్నెందుకు చేసుకుంటావు లే.

ప్రసాదు : చేసుకోటానికి నీ ఇష్టం, నా ఇష్టమేనా ? మీనాన్న ఒప్పుకోవద్దూ ?

సరో : మానాన్న ఒప్పుకునేదేఁవిటి ? మన ఇష్టం.

ప్రసాదు : (ఆశ్చర్యంగా చూస్తూ) నిజంగా నీకు అంత ధైర్యం ఉందా సరోజినీ ?

(సరోజిని సిగ్గుతో తలవంచుకుంటుంది.)

ప్రసాదు : మీనాన్నకు వ్యతిరేకంగా నిలబడతావా ?

సరో : (తలవంచుకునే) నాన్నగారు మాత్రం ఎందుకు ఒప్పుకోరు ?

ప్రసాదు : ఒప్పుకుంటే పేచీయే లేదు. ఒప్పుకోకపోతే ?

సరో : (చిరునవ్వుతో) ఏం చెయ్యమంటావు ?

ప్రసాదు : అది నీ ఇష్టంమీద ఆధారపడి ఉంది.

సరో : నీ ఇష్టమే నా ఇష్టం.

ప్రసాదు : బాగా ఆలోచించుకునే చెప్తున్నావా ?

సరో : ఆలోచించేదేఁవిటి. చిన్నప్పటినుంచి అందరూ అనుకున్నదేగా ?

ప్రసాదు : చిన్నప్పటి విషయం వేరు. ఇప్పటి విషయం వేరు. చక్కగా చదువుకుని ఏదో పెద్ద ఉద్యోగం చేస్తానని ఆశ పెట్టుకున్నారు. పెద్ద అయినతరవాత ఇప్పుడు నేను చేస్తూ ఉన్నపని అంటే మీ నాన్నకు గిట్టనే గిట్టదు. పనీ పాటా లేకుండా వట్టి బేవార్సుగా తిరుగుతున్నానని ఆయన అభిప్రాయం.

సరో : నాన్నగారెప్పుడూ అలా అనలేదే ?

ప్రసాదు : పెద్దమనిషి గాబట్టి త్వరగా నోరు జారడనుకో. కాని మన పెండ్లికి మాత్రం ఆయన ఒప్పుకోడు.

సరో : అందుకని ?

ప్రసాదు : అందుకని మళ్ళీ ఒకసారి ఆలోచించుకోవటం మంచిదని.

సరో : ( ముఖం చిట్లించుతూ ) నేను ఆలోచించుకోవాల్సింది ఏఁవీ లేదు. నువ్వేఁవన్నా ఆలోచించుకోవాల్సి ఉంటే ఆలోచించుకో.

ప్రసాదు : ఓ, అప్పుడే అమ్మాయికి కోపం వచ్చిందే !

సరో : లేకపోతే ఏఁవిటి బావా ఈ సందేహాలన్నీ.

ప్రసాదు : నేను చెప్పింది నువ్వు సరిగా అర్థం చేసుకోవటంల్లా. ముందు రాబోయే ఇబ్బందులేంటో కొంచెం ఆలోచించు.

సరో : ఏఁవిటా ఇబ్బందులు ?

ప్రసాదు : నన్ను పెండ్లి చేసుకుంటావనుకో. నా బ్రతుకు శాశ్వతమా ! నా జీవితమంతా దినగండం. ఇవ్వాళ ఉన్న చోట రేపుంటానన్న నమ్మకంలేదు.

సరో : నేనుకూడా నీతోపాటే తిరుగుతాను.

ప్రసాదు : ( చిరునవ్వుతో ) అంత తేలిక కాదు సరోజినీ !

సరో : ( మూతి ముడుచుకుని ) ఇంతకీ నీ కిష్టం లేదని చెప్పరాదూ, ఒక్క మాటతో పోతుంది.

ప్రసాదు : ( నిట్టూర్చి ) నిన్ను నేను ఎంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలియదు. . .

సరో : ఈ పై పై మాటలకే మెచ్చాలే. నిజంగా నీకు ప్రేమే ఉంటే ఇన్ని సందేహాలెందుకు రావాలి.

ప్రసాదు : ఇప్పుడు తెలియదులే నీకు. కష్టాలు పడేటప్పుడు గాని ......

సరో : నువ్వు కష్టపడేవాడివి, నేను సుఖపడేదాన్ని. ఏం ?

ప్రసాదు : (కొంచెంసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి ప్రేమ ఉట్టిపడే స్వరంతో) సరోజినీ !

(అంటూ దగ్గరకు వస్తాడు. సరోజిని సిగ్గుతో కొంచెం వెనక్కి తప్పుకుంటుంది.)

అయితే పై నెల 15 వ తారీఖు నిశ్చయించుకుందామా ?

(సరోజిని హృదయంలోనుంచి పొరలి వస్తూ ఉన్న ఆనంద లహరిని సిగ్గుతెరలు అరికడతాయి.)

సరో : ఏంవిటి ?

ప్రసాదు : (నవ్వుతూ) దొంగ. తెలియనట్టు మాట్లాడతావు.

సరో : నాన్నగారికి పంచాంగం పట్టింపు ఉందిగా !

ప్రసాదు : సరే, మావయ్యతో మాట్లాడి నువ్వే సెటిల్ చెయ్. బాజా బజంత్రీల హడావిడిమాత్రం వద్దు.

సరో : పెళ్ళిగాకముందే పెత్తనం చెలాయిస్తున్నావే ?

(అంటూ సిగ్గుతో లోపలకి పరుగుదీస్తుంది. ప్రసాదు అక్కడే పచారు చేస్తూఉంటాడు.)

(శేషగిరి ప్రవేశిస్తాడు.)

శేషగిరి : (ప్రసాదును చూచి ఆశ్చర్యంగా) ఓయ్, నువ్వేనటోయ్ ? ఏంటి కబుర్లు ?

ప్రసాదు : నువ్వే చెప్పాలి.

శేషగిరి (బిగ్గరగా) సరోజినీ! రెండు కాఫీ తీసుకురా.

ప్రసాదు : స్కూలు బాగా సాగుతుందా ?

శేషగిరి : స్కూలుకేం! దివ్యంగా సాగుతోంది. ఊళ్లో విశేషాలేంటి ?

ప్రసాదు : కొత్తగా అడుగుతున్నావే ? నీకు తెలియందేముంది ?

శేషగిరి : ఏం లేదు కాని...నా మనస్సులో ఒక చిన్న సందేహం పట్టి పీడిస్తూ ఉంది.

ప్రసాదు : ఏమిటది ?

శేషగిరి : మనవాళ్లు వట్టి మోటురకం. ఎత్తుగడలు బొత్తిగా తెలియవు. ఏ పట్టు బడితే అదే మొండి పట్టు.

ప్రసాదు : ఏం ?

శేషగిరి : నేనెంత సిన్సియర్‌గా పనిచేస్తూ ఉన్నా, నా మీద వాళ్ళకి ఇంకా అనుమానం వదల్ల.

ప్రసాదు : అందుకు నీవే బాధ్యుడివి. నీ గతచరిత్ర అలాంటిది.

శేషగిరి : ఎప్పుడూ గతాన్ని గురించి ఏడిస్తే ఏం ప్రయోజనం ? వర్తమానాన్ని గురించి ఆలోచించుకోవాలి గాని.

ప్రసాదు : అది నువ్వనుకున్నంత తేలికా గాదు. నువ్వనుకున్నంత కరెక్టూగాదు.

శేషగిరి : ఇంకేం ; నీ ఉపదేశమే వాళ్ళకు బాగా వంటబట్టింది.

ప్రసాదు : కావచ్చు. అందులో తప్పేముంది ?

శేషగిరి : అయితే ఇక నీ సిద్ధాంతం ప్రకారం నాలాంటి వాళ్ళకి మోక్షం లేదన్నమాట.

ప్రసాదు : లేదని ఎవరన్నారు? నీలాంటి కరుడుగట్టిన వ్యక్తి రేకుల్ని నమ్మటానికి ఎక్కువకాలం పడుతుంది. అంతే.

శేషగిరి : నాలాంటివాళ్ళు మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడ్డా అంతేనా !

ప్రసాదు : మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం పడుతున్నావో, లేక ఏ ఎండ కా గొడుగు పడుతున్నావో మాకెలా తెలుస్తుంది?

శేషగిరి : మీకు తెలియజెప్పటానికి మార్గం ?

ప్రసాదు : కఠిన పరీక్షకు తట్టుకోవాలి. దీర్ఘకాల పరీక్షకి నిలబడాలి.

శేషగిరి : మీరందరు నిలబడతారని గ్యారంటీ ఉందా ?

ప్రసాదు : లేదు.

శేషగిరి : మరి ?

ప్రసాదు : కాని గత చరిత్రనుబట్టి ముందే అనుమానించటానికికూడా ఆస్కారం లేదు.

శేషగిరి : ఆల్‌రైట్ !

( సిగరెట్టు ముట్టిస్తాడు. సరోజిని రెండు కాఫీగ్లాసులు తెచ్చి టేబులు మీద పెట్టి లోపలికి వెళ్ళిపోతుంది. ఇంతలో వీరయ్య హుటాహుటిగా ప్రవేశిస్తాడు. )

ప్రసాదు : ఏఁవిటి వీరయ్యన్నా ?

వీరయ్య : ( శేషగిరివైపు చురచుర చూస్తూ ప్రసాదుతో ) ఇదిగో ఉత్తరం.

ప్రసాదు : ( ఉత్తరం తీసుకుంటూ ) ఎవరిది ?

వీరయ్య : ( శేషగిరివైపు చూస్తూనే ) ఈ పెద్దమనిషి దే.

ప్రసాదు : ( ఉత్తరం చదివి నిట్టూర్చి—వీరయ్యతో ) ఎక్కడ దొరికింది?

వీరయ్య : పోస్టులో వెయ్యమని ఎట్టోడి చేతి కిచ్చాడట.

శేషగిరి : (కోపంగా) ఇచ్చాను, ఏం ఇస్తే ?

ప్రసాదు : ఇష్, చెప్పనియ్ :

వీరయ్య : ఎట్టోడు తీసుకొచ్చి మా చేతికిచ్చాడు. " వెయ్యమంటారా వద్దా " అని.

శేషగిరి : ఇంకేం; కన్నంలో దొంగ దొరకనే దొరికాడని పట్టుకోటానికి వచ్చావేం ?

ప్రసాదు : అనవసరంగా మాట్లాడకు.

శేషగిరి : లేకపోతే ఏంచేసేటిది ?

ప్రసాదు : ఇంకా నీపాత బుద్ధి పోనిచ్చావుగాదు.

శేషగిరి : ఇప్పుడేం కొంప మునిగింది ?

ప్రసాదు : ఇప్పుడు మునక్కపోతే రేపు మునుగుతుంది. ఇలాంటి పిచ్చిపనులే చెయ్.

శేషగిరి : (కొంచెం తగ్గి) ఆల్ రైట్ ! తెలిసినవాడివి నువ్వుకూడా అలా మాట్లాడితే నేనేం చెయ్యాలి.

వీరయ్య : (కోపంగా) తూర్పుగా తిరిగి దణ్ణం పెట్టు.

శేషగిరి : ఎందుకలా తొందర పడతావు, తలా తోకా తెలియకుండా ?

వీరయ్య : నాకేం తెలుసులే. దొంగ ఉత్తరాలు రాయటం నీకే తెలవాలి.

శేషగిరి : (వీరయ్య వంక కోపంగా చూచి—ప్రసాదుతో) ఇదేగా నువ్వు చేసిన బోధ ?

ప్రసాదు : ఏం? ఇప్పుడేం తప్పు మాట్లాడాడు ? ఉన్నమాటంటే అంత ఉలుకెందుకు ? నువ్వు దొంగ ఉత్తరం వ్రాసినమాట అబద్ధమా ?

శేషగిరి : దొంగతనంగా రాయాల్సిన ఖర్మ నాకేం బట్టింది. దొరతనంగానే రాశాను పబ్లిక్కుగా.

ప్రసాదు : సిగ్గులేకపోతే సరె !

శేషగిరి : దేనికి సిగ్గు !

ప్రసాదు : శత్రువుతో కలిసి కూడుపుఠానీ చేస్తున్నందుకు.

శేషగిరి : (వెంటనే ధోరణిమార్చి) అదీ, అక్కడే నీకూ నాకూ ఉన్న తేడా.

ప్రసాదు : ఏమిటది ?

శేషగిరి : (నవ్వుతూ) ఇప్పుడు మంచి వేడి మీదున్నావు. కాస్త వేడి వేడి కాఫీ తాగు, చల్లబడుతుంది. తర్వాత నిదానంగా మాట్లాడుకుందాం.

ప్రసాదు : పరిహాసాలతో అసలు విషయం దాటెయ్యాలని చూస్తున్నావు. ఆ పప్పులేం ఉడకవు. అడిగినదానికి సూటిగా సమాధానం చెప్పు.

శేషగిరి : ఆల్‌రైట్ ! చెపుతా విను, నీకూ నాకూ సిద్ధాంతంలో ఏం భేదంలేదు. మన ఇద్దరి సిద్ధాంతాలూ ఒకటే.

సిద్ధాంతానికి సంబంధించినంతవరకు నువ్వు చెప్పింది తూచా తప్పకుండా పాటిస్తాను. కాని......

ప్రసాదు : కాని ?

శేషగిరి : ఎత్తుగడల్లోనే నీకూ నాకూ చుక్కెదురు. నీ వ్యవహారమంతా ఎప్పుడూ ముక్కుకు సూటి. నీవి పట్టు విడుపులు లేని ఎత్తుగడలు, నావి ట్రోజన్ హార్సు ఎత్తుగడలు.

వీరయ్య : అంటే ?

శేషగిరి : అంటే శత్రువును నమ్మించి శత్రువు కోటలో దూరి శత్రువును దెబ్బ గొట్టటం నా పద్ధతి. శత్రువుకు ఎదురుగా వెళ్లి బాహాబాహీ కుస్తీపట్టటం మీ పద్ధతి. మీ పద్ధతిద్వారా వెయ్యిమంది సాధించలేని పనిని నా పద్ధతిద్వారా ఒక్క మనిషి ఒక్క చిటికెలో సాధిస్తాడు, తెలిసిందా ?

( చిరునవ్వుతో వీరయ్య భుజంమీద చెయ్యివేసి తట్టి )

గోటితో పొయ్యేపనికి గొడ్డలి కావాలా ?

వీరయ్య : ఏంటో నువ్వు చెప్పేదంతా అయోమయంగా ఉంది; ఒక్క ముక్కకూడా తెలవటల్లా.

శేషగిరి : తెలుసుకున్నవాడికి తెలుసుకున్నంత మహాదేవా అన్నారు. (ప్రసాదువైపు తిరిగి) మీకు లేనిపోని అనుమానం గాకపోతే నిజంగా ఆ ఉత్తరంలో ఏముంది చెప్పండి? మన రహస్యాలేమన్నా బైటపెట్టానా ? ఏదో మర్యాదకోసం క్షేమ సమాచారా లడిగాను. అంతేగా ! అంతమాత్రాన మనకు పోయిన పరువేంటి? వాడికి ఒరిగిందేవిటి? ఊరందరిదీ

ఒకదారి, ఉలిపికట్టె దొకదారి అన్నట్టు నేనొక్కణ్ణే పోయి వాడి చంకకింద దూరతానా? దేవుడు నాక్కూడా కాస్త మెదడు పెట్టాడు.

ప్రసాదు : కాస్తగాదు; జాస్తిగానే పెట్టాడు. అదే నీతో వచ్చిన చిక్కు. నీ ట్రోజన్‌హార్సు ఎత్తుగడలు వాళ్ళమీద ఉపయోగిస్తున్నావో, లేక మామీదే ఉపయోగిస్తున్నావో అర్థం కావడల్లా.

శేషగిరి : పోనీ అంత అర్థంగాకపోతే మానేసేద్దాం. అనవసరంగా మీకు నామీద అనుమానం ఎందుకు? ఏదో మనందరి మంచికోసమని సూక్ష్మంలో మోక్షంగా ఒక కొత్త ఎత్తు వేశాను. మీరు పదిమంది ఓకే అంటే ఓకే. కాదంటే నాకేంగజ్జుబట్టింది? నలుగురితోపాటు నారాయణా. గుడ్ బై !

ప్రసాదు : ఈ ఊకదంపుడంతా మాకనవసరం. ఇది చివర వార్నింగు. జ్ఞాపకం పెట్టుకో! ఈసారి మళ్ళీ ఎప్పుడన్నా ఇలాంటి తప్పుడు పని చేశావా ఇక ఈ ఊళ్ళో అడుగు పెట్టవు. ఖబర్దార్!

( ప్రసాదు వీరయ్యలు వెళ్ళిపోతారు. )

శేషగిరి : ( వెళ్తూ ఉన్న ప్రసాదును మర చుర చూస్తూ ) రోజులు ! వీడు నాకంటె చిన్న ! నన్ను ఖబర్దార్ అంటాడు !

సరో : ( ప్రవేశించి ) అయినా నీ కెందు కన్నయ్యా ! ఆ గజపతికి నీ వెందుకు వ్రాయాలి ఉత్తరం?

శేషగిరి : అవును లే. 'పెళ్ళాం మొగుడికోపు కాయక అన్నకోపు కాస్తుందా ?

సరో : ఏఁవిటన్నయ్యా ఆ మాటలు ?

శేషగిరి : ఉన్నమాటన్నాను తప్పేముంది ? ప్రసాదునేగా నువ్వు పెళ్ళి చేసుకోబోయ్యేది ?

సరో : ఏం చేసుకుంటే తప్పా ?

శేషగిరి . తప్పని ఎవరన్నారు ? ప్రసాదుకేం మహా నాయకుడు. వెయ్యి జన్మలెత్తినా అలాంటి మొగుడు దొరుకుతాడా ?

సరో : (ముఖం చిట్లించుకొని) ఎట్లాంటాళ్ళకి అట్లాంటాళ్ళే దొరుకుతారు. ఎందుకంత ఎగతాళి ?

శేషగిరి : పెళ్ళి అంటే ఆషామాషీగాదు. ఒకసారికి పదిసార్లు ఆలోచించుకోవాలి. ఒకసారి పొరపాటు జరిగిందా చచ్చిందాకా అనుభవించాలి.

సరో : ఇప్పుడేం పొరపాటు జరిగింది ?

శేషగిరి : ప్రసాదును పెళ్ళి చేసుకోవాలనుకోవటమే అసలు పెద్ద పొరపాటు.

సరో : ఏం ?

శేషగిరి : వాడేదో పెద్ద నాయకుడనుకుంటున్నావు. ఇదంతా మూన్నాళ్ళ ముచ్చట ! ... (లాలనగా) ఇద్దరం ఒక తల్లి కడుపున పుట్టినవాళ్ళం, కాబట్టి మనసులో మాట దాపరికం లేకుండా చెప్తున్నా. నామాట విను. ఈ బోడి పెత్తనం శాశ్వతం కాదు.

సరో : ఆయన పెత్తనాన్ని జూచి పెండ్లి జేసుకుంటున్నానా ?

శేషగిరి : (కొంచెం రెచ్చిపోయి) లేకపోతే ఇంతకంటె అందగాడు దొరకడనా ? ఇంతకంటే ఆస్తిపరుడు దొరకడనా ? ఇంతకంటె చదువుకున్నవాఁడు దొరకడనా !

సరో : నాకదంతా తెలియదు. చిన్నప్పటినుంచీ బావనే పెళ్ళి చేసుకుందాఁవనుకున్నాను. చేసుకుంటాను.

శేషగిరి : చేసుకుంటే అనుభవిస్తావు. చిన్నప్పుడు లక్ష - అనుకుంటాం. అనుకోగానే అయిపోయిందా పెళ్ళి ? బతికినంత కాలం వాడికోసం నువ్వేడవటం, నీకోసం మేం ఏడవటం సరిపోతుంది. చెల్లెలివి గాబట్టి ఇంతగా చెబుతున్నా. లేకపోతే నాకుమాత్రం ఏం బట్టింది. ప్రసాదంటే నాకు మాత్రం ఇష్టంలేదూ ? తిని కూర్చోలేక వాడితో నేనెందుకు తగాదా కొని తెచ్చుకోవాలి ? అయినా ఎందుకు చెబుతున్నానో కాస్త ఆలోచించు. తీరా చేతులు కాలిన తరువాత ఏఁవనుకుంటే ఏం లాంభం ?

(చుట్ట కాల్చుకుంటూ భద్రయ్య ప్రవేశం. కాళ్ళకు పల్లెటూరు చెప్పులు, చేతిలో ఒంకి కర్ర తెలుపు నలుపు వెంట్రుకలతో తల తెలతండుల న్యాయంగా ఉంది.)

సరో : (తండ్రిని చూడగానే) నాన్నా ! (అంటూ దగ్గరకు వెళ్తుంది.)

భద్రయ్య : (కూతురు తలమీద చేయివైచి) ఏఁవిటమ్మా ! (సరోజిని పైటకొంగుతో తన చెమ్మగిలిన కండ్లు తుడుచుకుంటుంది.)

భద్రయ్య : (శేషగిరితో) ఏరా ! అమ్మాయి నేమన్నావు ?

సరో : అన్నయ్య నన్నేఁవీ అనలేదు నాన్నా.

భద్రయ్య : మరి అలా ఉన్నావేం ?

సరో : ఊరికే; ఏదో నా మనసుకు కష్టం వేసింది.

భద్రయ్య : కాదులే. వాడు ఏదో ఒకటి అనే ఉంటాడు.

శేషగిరి : ఏంవన్నాను? ప్రసాదును పెళ్లిచేసుకుంటే చాలా ఇబ్బందులు పడతావన్నాను. అది కూడా తప్పేనా ?

భద్రయ్య : దాని పెళ్లిగొడవ నీకెందుకోయ్, పెద్దవాణ్ణి నేనుండగా ?

శేషగిరి : ఈ ఇంట్లో నేనేది మాట్లాడినా తప్పే. మీరూ మీరు ఏ గంగలోనన్నా కలవండి నాకెందుకొచ్చిన పీడ.

(అంటూ విసుగ్గా బయటికి వెళ్తూ ఉంటాడు.)

భద్రయ్య : నోరుముయ్, వెధవ !

(కూతురు తల నిమురుతూ) ఏంవిటమ్మా ! ప్రసాదును పెళ్లి చేసుకోవాలనుకుంటున్నావా ?

(సరోజిని తండ్రి చొక్కా గుండీలు సర్దుతూ అవుననే అర్థంలో తల ఊపుతుంది.)

(విచారంగా) పిచ్చిపిల్ల ! ఆ గీతేఉంటే వాడి కిలాంటి బుద్ధులెందుకు పుడతయ్.

సరో : ఎలాంటి బుద్ధులు ?

భద్రయ్య : దిబ్బరాజుగారిమీద కత్తి కట్టటం అంటే మాటలా అమ్మా ! ఆ మహారాజు పేరు చెపితే హేమా హేమీ ల్లాంటివాళ్ళే గజగజలాడి పోతున్నారు. ఆయనతల్చుకుంటే ఈ కుర్ర సన్నాసి ఎంత ? బ్రహ్మాస్త్రం ముందు పిచ్చుక. భూమిమీద నూకలు లేకనే వాడికిలాంటిబుద్ధులుపుట్టాయి.

సరో : చచ్చిపోయే టప్పుడు అమ్మకూడా నాపెళ్ళి విషయం చెప్పిందటగా నాన్నా !

భద్రయ్య : ( వస్తూ ఉన్న దుఃఖాన్ని దిగమింగుతూ ) చెప్పిందమ్మా చెప్పింది. పెద్ద అయిన తరవాత ఇలా తయారవుతాడని అదేం కలగన్నదా ? నేనుకూడా వీడి తెలివి తేటలుచూచి ముందు ముందు ఎంతో ఉద్ధరిస్తాడనుకున్నా. చివరికి ఇలా తయారయ్యాడు.

సరో : బావ చాలా మంచివాడు నాన్నా !

భద్రయ్య : ( నిట్టూర్చి ) మంచివాడే. ఏం లాభం ; తల్లీ తండ్రీ లేని బిడ్డ. వాణ్ణి చూచినప్పుడల్లా మీ అత్తయ్య జ్ఞాపకం వస్తుంది. చచ్చి ఏ లోకానుందో ! పోతూ పోతూ " అన్నయ్యా ! ప్రసాదుకు మేనమామైనా తండ్రైనా నీవే. సరోజిన్నిచ్చి పెళ్ళిచేసి వాణ్ణి ఒక ఇంటాణ్ణి చేయమ"ని చేతిలో చెయ్యి వేయించుకుంది. ( పై పంచతో కన్నీళ్ళు తుడుచుకుంటూ ) వాడంటే మీ అమ్మకూడా అంతే ప్రాణ మిచ్చేది ; కన్న కొడుకుకంటే ఎక్కువగా చూసుకునేది. అది బతికుండగా ఎప్పుడూ దానిమాట కాదని ఎరుగను.

సరో : ( కన్నీళ్ళు తుడుచుకుంటూ ) మరి ఇప్పుడు కాదంటావా నాన్నా ? ( పొంగి పొరలే దుఃఖంతో ) మా అమ్మే బ్రతి కుంటే ......

భద్రయ్య : చూస్తూ చూస్తూ నిన్ను అగ్ని గుండంలోకి దింప టానికి మనసొప్పటం లేదమ్మా. జీవితంలో ఏ సుఖం ఎరక్కుండా, బతికినంతకాలం కష్టాలు వెళ్ళబోయ్యాలిసి వస్తుంది.

సరో : ఎన్ని కష్టాలొచ్చినా పర్వాలేదు నాన్నా ! సంతోషంగా సహిస్తాను. నా మాటెప్పుడూ ఇంతవరకు నువ్వు కాదనల. ఈ పెళ్లికి ఒప్పుకుంటే అందరిమాట చెల్లించినట్టవుతుంది.

భద్రయ్య : (నిట్టూరుస్తూ) సరే ! కానియ్. చివరికి ఎలా రాసిపెట్టుంటే అలా అవుతుంది. కాలానికి మనం కర్తలమా ? అన్నిటికీ ఆ పరమాత్ముడే ఉన్నాడు. (లోపలకి వెళ్ళుతూ ఉంటాడు.)

[ తెర ]

# మూడో దృశ్యం

★

## రాత్రి పాఠశాల

(వీరయ్య, నారాయణ, ముక్కంటి హడావిడిగా మామిడాకు తోరణాలు వగైరా కడుతూ ఉంటారు. పెండ్లి ఏర్పాటులన్నీ చకచకా జరిగిపోతాయి. అందరి ముఖాల్లో ఆనందం తొణికిసలాడుతుంది. బారులుగా తీర్చిపెట్టిన దీపాల వెలుగులో పాఠశాలంతా జేగీయమానంగా ఉంది. గ్రామస్థులు ఆనాడు కొత్తగా ధరించిన రంగురంగు బట్టలు వింతవింత కాంతులతో మిలమిల మెరిసిపోతున్నాయి. వీరయ్య, ముక్కంటి లోపలినుంచి ఒక బల్ల పట్టుకొచ్చి హాల్లో వేస్తారు.)

ముక్కంటి : వీరయ్యన్నా ! బూమి బంతిలాగా గుండ్రంగా ఉందా ? ఈ బల్లలాగా పలగ్గా ఉందా చెప్పు.

వీరయ్య : మన మాస్టారు చెప్పారు కదోయ్ భూమి గుండ్రంగా నారింజకాయలాగా ఉందని.

ముక్కంటి : గుండ్రంగా ఉందని ఎట్టా రుజువు జేత్తావ్ ?

వీరయ్య : దానికింకా రుజువేంటి పెద్దోళ్ళంతా చెపుతావుంటే?

ముక్కంటి : పెద్దోళ్ళు కాదు. ఆళ్ళను పుట్టించిన బ్రమ్మదేవుడు జెప్పినా సరే ఒప్పుకోటానికి ఈల్లేదు. ఎనక ఒకసారి ఏం జరిగిందో తెలుసా ?

వీరయ్య: ఏం జరిగింది?

ముక్కంటి: చెప్తా ఇను. మన బారతదేశంలాగే ఇటలీ అని ఒక దేశం ఉంది. ఆ దేశంలో... (పేరు గుర్తుగాదు) తస్సాదియ్యా, ఆడి పేరేంటి... (ఆలోచనలోబడి తల గోక్కుంటూ) ఆళ్ళపేర్లు మనకి నోరు తిరిగిసావవుగందా... (ఆలోచిస్తూనే ఉంటాడు.)

వీరయ్య: పేరుకేం వొచ్చెలే, అసలు సంగతేంటో చెప్పు.

ముక్కంటి: ఆ దేశంలో ఒక పండితుడు బూమి గుండ్రంగా ఉందని వాదించాడు. ఆపళాన మతగురువులంతా అతణ్ణి పట్టుకుని బగబగ మండే మంటల్లోయేసి కాల్చి పేల్చి సంపారు; దెబ్బంటే ఏంవనుకున్నావో.

వీరయ్య: అయితే ఇంతకీ భూమి గుండ్రంగా లేదంటావ్?

ముక్కంటి: లేదంటల్లా, రుజువు సెయ్యమంటన్నా. ఇయ్యి సైన్సు రోజులయ్యా సైన్సు. పిచ్చి పిచ్చి నమ్మకాలు ఇప్పుడేం సెల్లవు. ఏది మాట్లాడినా సైన్సు పకారం మాట్లాడాలి.

వీరయ్య: సరే నువ్వు చెప్పు. భూమి గుండ్రంగా ఉందా? బల్లపరుపుగా ఉందా?

ముక్కంటి: గుండ్రంగా ఉంది.

వీరయ్య: రుజువు చెయ్.

ముక్కంటి: ఇప్పుడు నీ ముక్కు ఎటు ఉంది? పడమటగావుంది. పో. నీ ముక్కుకు సూటిగా పో. అరేబియా తగుల్తుంది. అక్కడనుంచి ఆఫ్రికా వస్తుంది. పో, ముక్కుకు సూటిగా

ఇంకా ముందుకు పో. అట్లాంటిక్ మహాసముద్రం. అది దాటావా అమెరికా కండం. తరవాత పసిఫిక్కు, దాని తరవాత ఇండో సైనా.

వీరయ్య: ఏదీ, ఇప్పుడు యుద్ధం జరిగే దేశమా?

ముక్కంటి: అదే.

వీరయ్య: దాని తరవాత?

ముక్కంటి: దాని తరవాత బర్మా. అక్కడినుంచి మళ్లీ ముక్కుకు సూటిగా పో, సరిగ్గా ఇక్కడికే – ఇప్పుడు నువ్వు నుంచున్న చోటికే వస్తావు. బూమి గుండ్రంగా లేకపోతే నువ్వు బయల్దేరిన చోటికే మళ్లీ ఎట్టా వచ్చావు చెప్పు?

వీరయ్య: ఆరి నీ ఏటుగాల, దెబ్బంటే నీది. బళ్ళోకి అందరి కంటె ఎనకమాలొచ్చి అందరికంటె ముందు పోయావే!

ముక్కంటి: ముక్కంటి దెబ్బంటే ఏఁవనుకున్నావు మరి! ఏది పట్టినా ముక్కలు ముక్కలై పోవాల్సిందే. పట్టుదలుండాలి. వీరయ్యన్నా పట్టుదలుండాలి. ఈ పెద్ద పెద్దోళ్ళంతా పుడతానే సదువుకొచ్చారా? ఆళ్ళ మొకానే పొద్దు పొడిసిందా? ఆళ్ళు మనకంటె ఎక్కువ కష్టపడతారా, మనకంటె ఎక్కువ నిద్రకాస్తారా? సదువులో మట్టికి మనం ఎందుకు ఎనక పడాలంట?

నారా: (హడావుడిగా వచ్చి) చదువో చదువో అంటూ నీకీ పిచ్చి పట్టుకుందేంటిరా!

ముక్కంటి: సదువంటే మరి తేరగా ఉందాయేం? ఇకిలించందే పికిలించందే దేవుడిగుడి తాళాలు ఊరికే వస్తయ్యా?

దానికెంత కష్టపడాలి! మన కర్మగాలి తరతరాలనుంచి పసరాలుగా ఉండిపోయాం. ఇక ఉంటానికి ఈల్లేదు. రోజులు మారిసయ్, మైకం వదిలింది, కళ్ళు తెరిశాం. మనంకూడా మనుషులమే. సదువుకోవాలి, ఆళ్ళకంటె ఎక్కువ సదువుకోవాలి. ఆళ్ళు పది సంవత్సరాల్లో నేర్చు కుంది మనం ఒక్క సంవత్సరంలో నేర్చుకోవాలి. అదీ మన దెబ్బంటే.

ప్రసాదు: (వెనుకనుంచి వచ్చి సంతోషంగా ముక్కంటి భుజంమీద చేయి వైచి) అదీ పట్టుదల! అలా ఉండాలి.

ముక్కంటి: (ఉలిక్కిపడి చిరునవ్వుతో) మిమ్ముల్ని సూడలేదండీ. మాస్టారూ! (అంటూ కొంచెం వెనక్కి తప్పుకుంటాడు.)

నారా: (నవ్వుతూ) అసలు పెళ్ళికొడుకే ఆలస్యంగావస్తే ఎట్టా గండీ?

ప్రసాదు: ఇక్కడకి వద్దామని బయలుదేరగానే ఇందిరాంబ గారు కబురు చేశారు.

వీరయ్య: ఎవరు? గజపతి వదినా?

ప్రసాదు: అవును, ఆమెగారే. భర్త చచ్చిపోయి నప్పటినుంచీ గజపతి ఏదో మనవర్తి ఇచ్చేవాడట.

నారా: ఇప్పుడదికూడా ఎగ్గొట్టాడా?

ప్రసాదు: ఆ. "నా పొలం అంతా కూలీలు రైతులు పంచేసుకున్నారు. ఇంకా నా దగ్గరేం ఉంది నీ కివ్వటానికి" అన్నాడట.

ముక్కంటి: ఏఁవీ లేందే పట్నంలో మూడంతస్తుల మేడ ఎట్టా గట్టాడు?

నారా: ఓరి పిచ్చోడా, దొంగతనంగా దాచేసిన బంగారం అంతా ఏమైందనుకున్నావు ?

ప్రసాదు: పాపం ఇందిరాంబగారు ఇప్పుడు చాలా ఇబ్బంది పడుతూ ఉంది. స్కూలు జీతం కట్టలేక తమ్ముణ్ణి చదువు మాన్పించిందట.

నారా: వాడు ఆ మనవర్తి ఇస్తే ఎంత, ఇవ్వకపోతే ఎంత ? ఇంత ఊరుంది, ఒక ఆడగూతుర్ని పోషించుకోలేక పోతామా ?

ముక్కంటి: ఆరునూరైనా సరే; ఆ కుర్రోడి సదువుమాత్రం ఆగిపోటానికి ఈల్లేదు. మేం అంతా సందా వేసుకుని సదువు సెప్పిస్తాం.

వీరయ్య: (అసంతృప్తిగా) ఆహా ? ఎంత ప్రేమ గజపతి కుటుంబము మీద !

ప్రసాదు: అదేంవిటి వీరయ్యన్నా ! గజపతి సాగించే దోపిడి విధానానికే మనం వ్యతిరేకులంగాని అతని కుటుంబంతో వ్యక్తిగతంగా మనకు తగాదా ఏముంది ?

ముక్కంటి: జనం అంతా వచ్చారు, అసలు పెళ్లికూతురేది ? నేనెల్లి పిల్చుకొస్తానుండండి (అంటూ గబగబా నాలుగడుగులు వేసి) అరుగో, మాటలో మూటేసుకుని రానే వచ్చారు. నూరేళ్ళు !

(భద్రయ్య కూతుర్ని వెంటబెట్టుకుని ప్రవేశిస్తాడు.)

వీరయ్య: (నవ్వుతూ) ఏం భద్రయ్యన్నా !

భద్రయ్య: ఏంవిటి వీరయ్యా ?

వీరయ్య : ఎట్టాగయితేం చివరికి నువ్వుకూండా మా ముఠాలోనే కలిశావు.

భద్రయ్య : ఏం చేస్తాం. పిల్లలు పెద్దోళ్ళమాట వినకపోతే పెద్దోళ్ళే పిల్లల మాట వినాలి. తప్పాకుండా సంసారమన్నాక.

నారా : శేషగిరి రాలేదేం ?

వీరయ్య : నేను చెప్పలా రాడని !

భద్రయ్య : ఈపాటికి రావల్సిందే మరి.

నారా : ఎక్కడికి వెళ్ళాడేంటి ?

భద్రయ్య : ఏం పనుందో వెంటనే వస్తానని పట్నం వెళ్ళాడు.

(తెరలోనుంచి)

ఒకగొంతు : ఊఁఊఁ ! ఆలస్యం ఏఁవిటి? కానివ్వండి. కానివ్వండి.

(సరోజినీ ప్రసాదులు చెరియొక కుర్చీలో కూర్చుంటారు. వీరయ్య రెండు కాగితాలు తెచ్చి వధూవరులకు చెరొకటి ఇస్తాడు.)

ప్రసాదు : (లేచి నిలబడి కాగితం చూచి చదువుతాడు.) "నేనూ సరోజినీ పరస్పరం ప్రేమించుకున్నాం. ఈ శుభ సమయంలో సరోజినిని నా భార్యగా స్వీకరిస్తున్నాను. కష్టాల్లో, సుఖాల్లో ఒకరికొకరు అండగాఉండి దేశశ్రేయస్సుకోసం పాటుబడగలమని మీ అందరి ముందు శపథం చేస్తున్నాం."

(సభ్యుల కరతాళ ధ్వనులు)

(ప్రసాదు కూర్చోగానే సరోజిని లేచి చదువుతుంది.)

సరో : "నేనూ ప్రసాదూ పరస్పరం ప్రేమించుకున్నాం. ఈ శుభ సమయంలో ప్రసాదును నా భర్తగా స్వీకరిస్తున్నాను. కష్టాల్లో సుఖాల్లో ఒకరికొకరు అండగా ఉండి దేశ శ్రేయస్సు

కోసం పాటుపడగలమని మీ అందరి ముందు శపథం చేస్తున్నాం."

[ సభ్యుల కరతాళ ధ్వనులు. సరోజినీ ప్రసాదులు రెండు కాగితాల మీద సంతకాలు చేసి వీరయ్య చేతికిస్తారు. ]

వీరయ్య : నారాయణా ! సాక్షులచేత సంతకాలు చేయించు.

[ అంటూ ఆ కాగితాలు నారాయణ చేతికిస్తాడు. వధూవరులు పరస్పరం పూలదండలు వేసుకుంటారు. ఇద్దరూ కలిసి భద్రయ్య పాదాలకు నమస్కరిస్తారు. ]

భద్రయ్య : మీరిద్దరు ఒకరికొకరు తోడునీడగా ఉండి చిరకాలం సుఖంగా ఉండండి. (అని దీవించి లోపలికి వెళతాడు.)

ముక్కంటి : (చిరునవ్వు నవ్వుతూ సరోజినితో) ఇక రేపటినుంచి బళ్ళోకి రావుగా !

సరో : ఎందుకురాను ?

ముక్కంటి : ఇయ్యాలతో పంతులమ్మగారివై పోతున్నావాయె. పంతులుగారే నీ యింటికి వస్తా ఉంటే ఇంకా నువ్వు బళ్ళోకి రావటం ఎందుకు ? ఇదివరకు నిన్ను పంతులుగారు దబాయించేవాడు. ఇక నువ్వే దబాయించు.

( తెరలోనుంచి )

ఒకగొంతు : సరోజినీ ప్రసాదుల వివాహ మహోత్సవ సందర్భంలో శాంతి నృత్యం ప్రదర్శింపబడుతుంది.

[ నృత్యం ]

[ తెరలోనుంచి జీప్ కార్ల హారన్ మోతలు, తుపాకి కాల్పుల ధ్వనులు, బూటుకాళ్ళ చప్పుడు, "ఖబడ్దార్ ! ఖడేహోజావ్ ! పకడో పకడో ! మారో మారో !" అనే కేకలు గల్లంతుగా – భయంకరంగా వినపడతాయి.]

ప్రసాదు : దాడి వచ్చింది.

వీరయ్య : ఏం చేద్దాం!

నారా : (కంగారు పడుతూ) ఊరుచుట్టూ ముట్టడేసి ఉంటారు.

ముక్కంటి : మాస్టారూ! ముందు పడుకోండి.

(అంటూ గబగబా ప్రసాదును వెల్లకిల పండుకోబెట్టి తన సైపంచె తీసి ఆపాదమస్తకం కప్పేస్తాడు.)

రండి, చుట్టూ కూర్చొని ఏడవండి. ఊఁ!

సరో : (భయపడుతూ) ముక్కంటీ!

ముక్కంటి : హుష్! అపాయం వచ్చినప్పుడే ఉపాయం ఉండాలి.

(అందరూ ప్రసాదు చుట్టూ కూర్చొని ఏడుస్తూ ఉంటారు.)

ముక్కంటి : కొడుకో... నా కొడుకో... పద్దానుగేళ్ళకే మట్టి గొట్టుకపోతావని నాకేం తెలుసురో... ఓ నాయనో ... మా నాయనో.

(అంటూ శోకాలు పెడుతూ ఉంటాడు. హుటాహుటిగా ఇద్దరు దివ్య సైనికులు ఆర్భాటంచేస్తూ వస్తారు. వాళ్ళు రాగానే ఏడుపు ఇంకా పెద్దది చేస్తాడు.)

ఇందుకే గాంవాలి నా బిడ్డకి ఇంత తెలివివ్వాడు దేవుడో... సచ్చిపోయినా ఇంకా నీ మొకం నవ్వుతానే ఉంది కొడుకో... నా కొడుకా.

1 సైనికుడు : క్యాహైరే! యే సబ్ క్యాహై?

ముక్కంటి : పండంటి బిడ్డని అమ్మోరు పొట్టబెట్టుకుంది మారాజో!

2 సైనికుడు : బాప్‌రే! అమ్మోరే! కలరా! అంటువ్యాధి. ఒక్క నిమిషంకూడా ఇక్కడుంచగూడదు. లేజావ్ ఇస్కో?...అరే ఉల్లూ! అట్టా సూస్తావేరో, నీకే చెప్పేది? పో, తీస్కపో. జల్దీ, ఊఁ! (అంటూ లాఠీ ఎత్తి వెయ్యబోతాడు.)

ముక్కంటి : (గజ గజలాడుతూ) అట్టాగే దొరా! ఇప్పుడే తీసి కెల్తా (అంటూ భయపడుతున్నట్టు నటించి వెల్లకిలగా పండుకున్న ప్రసాదును ఆపళంగానే పైకెత్తుతూ) చూస్తా ఉండగానే కళ్ళల్లో దుమ్ముగొట్టి దాటిపోతన్నావంట్రో... కొడుకో... నువ్వు దాటిపోయిన తరవాత నీకోసం ఏడవమని సెప్పి ఎల్లి పోతిన్నావురో...(అంటూ తీసికెళ్తారు.— మగో వైపునుంచి విజయ సూచకంగా వికటాట్టహాసం చేస్తూ గజపతి ప్రవేశం. షేర్వానీ, షుర్వా, కోరమీసం, ఎరుపెక్కిన కళ్ళు, రాజరీవి ఉట్టిపడే ముఖం.)

గజపతి : ఎవరు అక్కడ?

భీమన్న : (ప్రవేశించి) జీ హుజూర్! (సలాం చేస్తాడు.)

గజపతి : ఏం చేస్తున్నారు మనవాళ్ళు?

భీమన్న : ఊరంతా ముట్టడించేశారు, హుజూర్!

గజపతి : ప్రసాదు దొరికాడా?

భీమన్న : (అపరాధివలె తలవంచి) దొరక లేదు హుజూర్!

గజపతి : [మండిపడి] ఏంటి? దొరకలా? ఏం చేస్తున్నారు మీరంతా? గాడిదల్ని కాస్తున్నారా! ఊరుచుట్టూ ముట్టడేస్తే వాడెలా పారిపోయాడు?

భీమన్న : అంతా మాయగా ఉంది.

గజపతి: నోర్ముయ్! వాడెక్కడో ఊళ్లోనే దాగి ఉంటాడు. వెళ్ళండి, కనపడ్డ మనిషినల్లా విరగబాదండి-గడ్డివాములన్నీ గాలించండి. వాణ్ణి పట్టుకురాకుండా వట్టి చేతుల్తో వచ్చారా మీ తలకాయ ఎగిరిపోతయి. ఖబర్దార్! జావ్!

[ భీమన్న సలాంచేసి వెళ్ళిపోతాడు. గజపతి ఆవేశంగా ఇటు ఇటు తిరుగుతూ ఉంటాడు. "రాత్రి పాఠశాల" అనే అట్ట అతడి కంట్లో పడుతుంది. ]

మట్టి తట్టలు మోసే గాడిదలకు కూడా చదువు!

[ అంటూ అట్టలాగి చించి ముక్కలు ముక్కలు చేస్తూ ఉంటాడు. ]

తెర.

# నాలుగో దృశ్యం

★

## భద్రయ్య ఇల్లు

[ సరోజిని కాగితాలు, పుస్తకాలు ఒక పెట్టెలో సర్ది గోడకు తగిలించిఉన్న ప్రసాదు ఫొటో తీసి ఒకసారి హృదయానికి హత్తుకుని దాన్ని కూడా పెట్టెలో పెడుతూ ఉంటుంది. ఇంతలో దొడ్డితలుపు చప్పుడవుతుంది. సరోజిని అటు ఇటు చూచి కొంచెం సందేహించి మెల్లగా తలుపుదగ్గరకు వెళుతుంది. ]

సరో : ఎవరు ?

వీరయ్య : నేనే, వీరయ్యని.

(సరోజిని తలుపు తీస్తుంది.)

వీరయ్య : (లోనికివస్తూ) ఏంటిపని ? ఎందుకు కబురంపావు ?

సరో : ముఖ్యమైన కాగితాలన్నీ ఈ పెట్టెలో పెట్టాను; దీన్ని ఎక్కడైనా దాస్తే మంచిదేమోనని.

వీరయ్య : ఎక్కడ దాస్తాం ! ఎవరింటో పెడదామన్నా అంతా జడుస్తున్నారు.

సరో : పోనీ మా గడ్డివాములో దాయగూడదూ ?

వీరయ్య : చీకటిపడ్డ తరవాత దానిపనేదో చూస్తాలే. ఇప్పుడు సాధ్యం కాదు. వాళ్ళ కంటబడకుండా ఇక్కడికి వచ్చేసరికే తాతలు దిగొచ్చారు.

సరో : ఏం? అంత ఘోరంగా ఉందా?

వీరయ్య : ఘోరం ఏంటె! వాళ్ళు కొట్టే దెబ్బలు దెబ్బలుగావు, చూడు!

(అంటూ చొక్కా పైకితీసి వీపు చూపెడతాడు. సరోజిని విస్తుపోయి వీరయ్యకేసి చూస్తుంది.)

సరో : అబ్బ! వీపు అంతా అట్టగట్టిపోయింది; అన్ని దెబ్బలకు ఎట్టా ఓర్చుకున్నావోగాని...

వీరయ్య : ఓర్చుకోక చేసేదేముంది. నోరెత్తితే ఇంకా విరగ బొడుస్తారు. చివరికి మనబతుకు పశువులకంటె కనాకష్టమై పోయింది.

సరో : ఇంత ఇదిగా ఉందనుకుంటే అసలు కబురంపేదాన్నే కాదు.

వీరయ్య : పర్వాలేదులే, దానికే మొచ్చెగాని, ప్రసాదు దగ్గర నుంచి ఏఁవన్నా చీటీముక్క వచ్చిందా అమ్మా!

సరో : లేదు బాబాయ్!...ఎక్కడున్నారో ఏమో!

వీరయ్య : మనం ఇక్కడే ఇన్ని కష్టాలు పడుతున్నాం. ఆయన అక్కడ ఇంకెన్ని కష్టాలు పడుతున్నాడో. సరిగ్గా పెళ్లి సమయానికే వచ్చిపడ్డారు యమదూతల్లాగా. (ఏదో ఆలోచిస్తూ) ఇక మాస్టారు ఈ ఊరు రారు.

సరో : ఏం?

వీరయ్య: ఊరు ఇట్టాఉంటే ఇంకా ఎట్టా వస్తారు? ఊళ్ళోనే ఒకళ్ళ ఇంటికి ఒకళ్ళు రావటానికి వీల్లేదాయె. ఒకళ్ళతో ఒకళ్ళు మాట్టాట్టానికి వీల్లేదాయె. పాపం! దెబ్బలతోనే కాదమ్మా రామిసెట్టికి పిచ్చెక్కింది.

సరో: అతన్ని ఇంకెంత హింసించారో!

వీరయ్య: ఆ గడ్డిపల్లి రాజమ్మ సంగతి విన్నావు కాదూ?

సరో: ఏఁవిటి?

వీరయ్య: ఏముంది. రాత్రి చీకటిపడి దొడ్డి కెళ్ళిందట. ఆరుగురు రౌడీలు అమాంతంగా మీదబడి నోట్లో గుడ్డలు గుక్కి......

సరో: రామరామ!

వీరయ్య: ఊళ్ళోకొచ్చి ముఖం చూపెట్టలేక అక్కడే భావిలో పడి చచ్చిపోయింది.

సరో: పాపం!

వీరయ్య: అన్యాయంగా ఆ అమ్మాయి ప్రాణాలు తీసింది చాలక, పైగా తండ్రిని కూడా అరెస్టుచేసి కేసుపెట్టారు.

సరో: తండ్రిమీద కేసేఁవిటి? ఆయనేం చేశాడని?

వీరయ్య: తండ్రి కూతుర్ని చంపి భావిలో పడేశాడని.

సరో: ఎంత దుర్మార్గం!

వీరయ్య: అప్పుడే ఏఁవయింది. ఇట్టాంటి దుర్మార్గాలు ఇంకెన్ని చూడాలో మనం. ఇప్పుడు మంచివాళ్ళకు రోజులు కావమ్మా. తాగుబోతులు, రౌడీలు, ఖూనీకోర్లు గ్రామానికి నాయకు లయ్యారు. పట్టపగలు నడిబజారులో నుంచో

బెట్టి కాల్చినా 'నా' అనేవారు లేరు. వాళ్ళు ఆడింది ఆట. పాడింది పాట.

సరో: ఎందుకో నాకు భయంగా ఉంది బాబాయి. ... వారెలా ఉన్నారో ఏమో.

వీరయ్య: ఆయనకేం పర్వాలేదమ్మా. ఆయన చాల జాగ్రత్తగా ఉంటారు. మనమే ఇంతఇదైతే ఊళ్లోవాళ్లెంగావాలి? ఇటు వంటప్పుడే మనం ధైర్యంగా ఉండాలి.

సరో: (ఆలోచిస్తూ) నిజమే ... సరేగాని ముక్కంటి ఏంవ య్యాడు బాబాయి! ఎక్కడా కనపట్టంలేదు.

వీరయ్య: ఏవోం ఎక్కడా పత్తాలేడు మరి...ఎటో పారి పోయి వుంటాడు. వట్టి కోతలరాయుడు. సమయం వచ్చేస రికి జారుకున్నాడు.

సరో: అంతే నంటావా?

వీరయ్య: ఇంకా అంటావా ఏంటి, కంస్టకి గట్టినట్టు కనబడతా ఉంటే...ఈ రోజుల్లో ఎవణ్ణి నమ్మటానికి వీల్లేదు.

(ఇంతలో దొడ్డి తలుపు చప్పుడవుతుంది. సరోజిని, వీరయ్య కంగారు పడతారు.)

వీరయ్య: మీ నాన్న వచ్చాడేమో

సరో: మా నాన్నయితే దొడ్డి వాకిట్లోనుంచి ఎందుకొస్తాడు? (బిగ్గరగా) ఎవరది?

(తలుపు మళ్ళీ ధనధనా మోగుతుంది.)

వీరయ్య: తప్పకుండా దిబ్బ రాడీలే. లేకపోతే తలుపు అంత గట్టిగా ఎందుకు కొడతారు! (సరోజిని తెల్లబోయి చూస్తుంది.)

నేనిక్కడుంటే నీకు కూడా ప్రమాదం. నేను వెళ్ళిపోతాగాని నువ్వేం భయపడకు, ధైర్యంగా ఉండు.

(అంటూ ఒకవైపుకు పరుగెత్తుతాడు. సరోజిని ధైర్యం తెచ్చుకుంటుంది. చీరకొంగు నడుముకు బిగించికట్టి, డ్రాయరులో ఉన్న బాకు తీసుకొని తలుపు దగ్గరకు వెస్తుంది. గడి తీస్తుండగానే తలుపు తోసుకుని ప్రసాదు లోనికి ప్రవేశిస్తాడు. నెత్తిమీద ముసుగు ఉంటుంది. సరోజిని ప్రసాదును గుర్తించదు. పొడవటానికి చెయ్యెత్తగానే ఆ చేతిని ప్రసాదు పట్టుకుంటాడు. ఇద్దరూ ఒకరి మొఖం ఒకరు చూసుకుంటారు. సరోజిని ప్రసాదును గుర్తించి విస్తుపోయి—"ఆఁ! మీరా!" అంటుంది. ఆమె చేతిలోని కత్తి అప్రయత్నంగా జారిపోతుంది. సరోజిని గబగబా వచ్చి మంచం వాలుస్తుంది. ప్రసాదు తన తలమీద ముసుగు తీసి మంచంమీద కూర్చుని ఒక దీర్ఘనిశ్వాసం విడుస్తాడు.

ప్రసాదు కళ్ళు లోపలికి పీక్కు పోయాయి. మనిషికూడా బాగా చిక్కిపోయాడు. అతను ధరించిన సగం చేతుల చొక్కా, నిక్కరు మాసి దుమ్ముగొట్టుకుని అక్కడక్కడ చినిగి పోయాయి. గడ్డం మాసి ఉంటుంది.)

సరో: (ప్రసాదు వంటిమీద గాయాలు చూచి) ఏఁవిటిదంతా ?

ప్రసాదు: ఏం లేదులే, భయపడకు.

(సరోజిని చప్పున లోపలికి వెళ్ళి నీళ్ళు తెచ్చి గుడ్డ పేలికను తడిపి, నెత్తురు తుడిచి కట్లు కడుతూ ఉంటుంది. ఆమె చెక్కులవెంట కన్నీరు ధార కడుతుంది.)

సరో: (కట్లు కడుతూనే) ఏం జరిగింది ?

ప్రసాదు: రాత్రి బావురుపల్లి కొండమీదుంటే రెండువందల మంది దిబ్బసైన్యంవచ్చి అమాంతంగా ముట్టడించింది.

సరో: (ఆశ్చర్యంగా) రెండు వందలమంది సైన్యమే!

ప్రసాదు : అవును, కాల్పుల్లో నా మిత్రులిద్దరూ చనిపోయారు. నేనొక్కణ్ణే తప్పించుకు బయటపడ్డాను.

సరో : ఎవరు చనిపోయింది ?

ప్రసాదు : నువ్వెరగవులే.

సరో : ఈవేళప్పుడు ఊళ్ళోకి ఎలా వచ్చావు? వాళ్ళచూడలా?

ప్రసాదు : మీా ఎడ్లు బీటినుంచి వస్తూంటే వాటిని చాటు చేసుకుని వాటి మధ్యగా వచ్చేశాను. (తల పట్టుకుని) అబ్బ! తల తిరిగిపోతూ ఉంది. శోష వచ్చేట్టుంది.

సరో : ( ఆదుర్దాగా ) ఎట్లా ! దగ్గరలో డాక్టరు కూడా లేడు.

ప్రసాదు : డాక్టరొద్దూ ఏమీావద్దు. ముందు కొంచెం కాఫీ ఇవ్వు. మూాడురోజులనుంచి తిండి లేదు.

( పొరలివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ లోపలికి వెళ్తుంది. ప్రసాదు కళ్ళుమూసుకుని ప్రక్కమీాద కొంచెంసేపు మేను వాలుస్తాడు. సరోజిని కాఫీతో ప్రవేశిస్తుంది. )

సరో : నిద్రపట్టిందా ? లేచి కొంచెం కాఫీ తీసుకో.

( కాఫీ ఆరబోస్తూ )

మూడు రోజులనుంచి అన్నం లేకుండా రావునుపల్లి నుంచి ఇక్కడిదాకా నడిచి వచ్చారన్నమాట ఈ గాయాలతో. ఎన్ని కష్టాలు పడుతున్నారు.

( అంటూ కాఫీగ్లాసు అందిస్తుంది )

ప్రసాదు : ( గ్లాసు తీసుకుంటూ ) ఎన్ని కష్టాలుపడక అప్పుడే ఏమయింది. ఉన్నదంతా, ఇక ముందే ఉంది.

సరో : మన బ్రతుకులు గాలిలో దీపాలయ్యాయి.

ప్రసాదు : అవును, ఏపూట ఏం జరుగుతుందో చెప్పలేం.

సరో : (కొంచెం ఆగి) ఏంటిటో నా మనసంతా పిచ్చి పిచ్చిగా ఉంది. ఏ పని చెయ్యాలన్నా చెయ్యబుద్ధిగాదు. పొద్దస్తమానం మీరే తలపుకొస్తారు.

ప్రసాదు : నాకోసం నువ్విలా బెంగపెట్టుకుంటే ఎలా చెప్పు ?

సరో : అలాగే అనుకుంటాను ; కాని మనసులో మళ్ళీ ఏదో భయం వేస్తూనే ఉంటుంది.

ప్రసాదు : ఎందుకంత భయం ?

సరో : నీకోసం ఊళ్ళకు ఊళ్ళు గాలిస్తున్నారు; అన్నెం పున్నెం ఎరుగని అమాయకుల్ని చావగొడుతున్నారు. ఒకవేళ నువ్వే దొరికితే ఇంకా వదిలిపెడతారా ?

ప్రసాదు : నేను దొరికితే వదిలిపెట్టటం అనే మాటే లేదు. వెంటనే కాల్చేస్తారు.

సరో : ఏం అన్యాయం చేశావని ? ఎందుకు నీమీద వాళ్ళకంత కోపం ?

ప్రసాదు : ఎందుకా; నేను దిబ్బరాజుకు అనుకూలంగా ప్రచారం చేయనందుకు – ప్రజలందరు తిండిలేక మలమల మాడి చావాలని కోరనందుకు – కొత్తరాజ్యం పనికిరాదని దిబ్బరాజ్యాన్ని బలపర్చనందుకు –...

సరో : అందులో తప్పేముంది ?

ప్రసాదు : అది నీ అభిప్రాయం, నా అభిప్రాయం. కాని దిబ్బరాజుగారి దృష్టిలో అదొక మహానేరం. తన నిరంకుశాధికారం సాగటానికి వీల్లేకుండా పోయిందని ఆయనకు కడుపు

మంట. నిన్న మొన్నటిదాకా 'నీ గానిసోణ్ణి దొరా' అంటూ ఆయన అడుగులకు మడుగులొత్తిన ప్రజలే ప్రభువులైతే ఆయన సహిస్తాడా?

సరో: ఏమో, నిన్ను చూస్తే గుండె తరుక్కుపోతూ ఉంది... పోనీ ఇక్కడే ఉండి పోగూడదూ?

ప్రసాదు: నే నుంటానన్నా గజపతి ఉండనిస్తాడా? అయినా, నే నిక్కడే ఉండాలనుకుంటే ముందు ఆయన కాళ్ళమీద బడి క్షమాపణ చెప్పుకోవాలి. ఇంకెప్పుడూ ఇలాంటి బుద్ధి తక్కువ పని చెయ్యనని లెంపలు వేసుకోవాలి... ఇదేనా నేను చెయ్యాల్సిన పని?

(చొక్కా నుంచి చొక్కా తొడుక్కోవటం పూర్తి అవుతుంది.)

సరో: నువ్వుపడే కష్టాలు చూడలేక అలా అనిపించింది బావా!

ప్రసాదు: ఈమాత్రం కష్టాలకే భయపడితే మనమేం చేస్తాం సరోజినీ! చూడు, సామాన్యప్రజలు, చదువు రానివాళ్ళు ఎన్నెన్ని త్యాగాలు చేస్తున్నారో — ఒకసారి నేను ఏటి అవతల గుట్టమీదున్నాను. ఆ గుట్టను ముట్టడించటానికి దిబ్బసైన్యం వస్తూ ఉంది. ఏటికవతల ప్రక్కనున్న గ్రామాల కాపులు దిబ్బసైన్యం రావటం చూశారు. నాకా కబురంద జేయటానికి ముగ్గురు మనుష్యులు పక్కదారిన బడి చస్తూ బతుకుతూ ఒకళ్ళ కొకళ్ళు పోటీపడి పరుగెత్తు కొచ్చారు. కాని ఏరుదాటటం ఎలా?

సరో: (ఆదుర్దాగా) ఎలా?

ప్రసాదు: అందులో ఏరు వెల్లువ మీదఉంది. గట్లు కొరగదన్ని పారుతూఉంది. అటు ఇటు చూశారు. ఎక్కడా తెప్ప

కొయ్యా కనపడలా. పక్క పల్లెకెళ్లి తెద్దామా అంటే ఆలస్యాం అయిపోతుంది. ఆలస్యం అయితే దిబ్బసైన్యం వచ్చేస్తుంది, నా ప్రాణం పోతుంది.

సరో : ఏం చేశారు మరి ?

ప్రసాదు : ఒక మనిషి తెగించి వట్టి చేతుల్తోనే ఏట్లో పడ్డాడు. మహానది, మహాప్రవాహం, మోతలు పెడుతూ ఉంది. అడుగడుగునా సుడిగుండాలు. సగంవరకు ఈదాడు. ఆయాసం వచ్చింది, చేతులు చచ్చుపడ్డాయి. ఎంత ప్రయత్నించినా సుడిగుండాన్ని దాటలేకపోయాడు. సుడిగుండం అతన్ని అడుక్కు లాగేసింది.

సరో : పాపం !

ప్రసాదు : అతడు మునిగిపోవటం గట్టుమీదున్న మిగతా ఇద్దరూ చూస్తూనే ఉన్నారు. వెంటనే మరోమనిషి పంచె బిగించి ఏట్లోకి ఎగిరి గంతేశాడు. కాని అతడు కూడా ఏరు దాటలేక పోయాడు.

సరో : ( గాద్గదికంగా ) నీ ప్రాణం కాపాడబోయి చివరికి తమ ప్రాణాలు పోగొట్టుకున్నారన్నమాట !

ప్రసాదు : అవును, అంతటితో మూడో మనిషి భయపడ్డాడా ! లేదు. కర్తవ్యం నిర్వహించాలి. తమ నాయకుని ప్రాణం కాపాడుకోవాలి. అదే పట్టుదల, అదే దీక్ష, అదే ఆవేశంతో – కుప్పించిఏట్లో దూకాడు. ఉవ్వెత్తుగా విజృంభించి రంకెలు వేస్తూఉన్న ఆ మహానదిని జయించాడు. దిబ్బసైన్యం కంటెముందే వచ్చి నా ప్రాణాన్ని కాపాడాడు.

సరో : ఎవరు ఆ మహాత్ముడు. చెయ్యెత్తి దణ్ణం పెట్టాలని పిస్తుంది.

ప్రసాదు : అప్పుడే అయిందా, ఇంకా విను. దిబ్బసైన్యంకూడా గట్టు దగ్గరికి చేరుకుంది. నా కోసం ఆగట్టు అంతా అంగుళం అంగుళం గాలించారు. నే నెక్కడా కనపడలా. అక్కడే ఒక చోట పద మూడేళ్ళమ్మాయి పశువుల్ని కాస్తూ ఉంది. ఆ అమ్మాయి దగ్గరికెళ్ళి నేనెటు వెళ్ళిందీ చెప్పమన్నారు. ఆ అమ్మాయికి నా సంగతంతా తెలుసు. కాని ఒక్కమాట కూడా చెప్పలేదు. డబాయించారు, కొట్టారు, క్రూరంగా హింసించారు. వాటన్నిటికీ ఆ అమ్మాయి ఒక్కటే జవాబు ఇచ్చింది.

సరో : ఏమిటి ?

ప్రసాదు : మెల్లగా తన బొడ్లోఉన్న చాకుతీసి నాలిక కోసేసుకుంది.

సరో : (కంగారుగా) ఎందుకు ?

ప్రసాదు. ఆ మూర్ఖులకదే సమాధానం. వాళ్ళు కొడతారు. ఇంకా లక్షా తొంభై చిత్ర హింసలు పెడతారని ఆ అమ్మాయికి తెలుసు. ఒకవేళ ఎప్పుడైనా పొరపాటున నోరు జారి ఒక ముక్క బయటికొస్తుందేమోనని అసలు నాలికే కోసేసుకుంది. ఆ అమ్మాయికి చదువు రాదు. గొడ్లకాపరి. కాని దేశంకోసం ఎంత త్యాగం చేసిందో చూడు ! నువ్వు నా దగ్గిర చదువుకొని చివరకు నాకిచ్చే సలహా ఇదా !

సరో : పొరపాటున నోరు జారాను బావా! ఇంకెప్పుడూ అలాంటి మాట నా నోటినుంచి రాదు.

ప్రసాదు : అదీ నీకు తగిన మాట. ధైర్యంగా ఉండు. ఈ జీవితాలు శాశ్వతంకావు. బానిసలుగా చిరకాలం బతికే కంటె బతికిన నాలుగు రోజులైనా మనుష్యుల్లాగా బతకటం మంచిది.

(బయటినుంచి బూట్ల చప్పుడవుతుంది.)

సరో : (కంగారు పడుతూ) ఎవరో వస్తున్నట్టుంది?

ప్రసాదు : (ఆలకించి) అవును.

(అంటూ అటూ ఇటూ చూచి గబుక్కున మంచం ఎత్తి మాంచానికి తెరకు చాటున దాగుతాడు ఇద్దరు భటులతో భీమన్న ప్రవేశం)

భీమన్న : (నలుదిక్కుల చూచి అధికార స్వరముతో) మీ ఇల్లు సోదా చెయ్యాలి.

సరో : (ధైర్యంగా) ఇంట్లో మొగాళ్ళెవరూ లేనప్పుడు లోపలికి రావటం మంచిదిగాదు.

భీమన్న : ఇది గజపతిగారి ఆజ్ఞ.

సరో : కావచ్చు. మానాన్నగారు వచ్చిన తరువాత రండి.

భీమన్న : ఎక్కడికెళ్ళాడు ?

సరో : పట్నం.

భీమన్న : ఎందుకు ?

సరో : కోర్టు పనిమీద.

భీమన్న : కోర్టు పనిమీదనా ? అల్లుణ్ణి కలుసు కోటానికా ?

సరో : (వ్యంగ్యంగా) అల్లుడు అక్కడున్నాడా ?

భీమన్న : మరెక్కడున్నాడో చెప్పు.

సరో : నాకు తెలియదు.

భీమన్న : చెప్పితీరాలి. ఇది కొత్తరాజ్యంగాదు, దిబ్బరాజ్యం తెలుసా ?

సరో : తెలుసు.

భీమన్న : తెలిస్తే అలా మాట్లాడవు.

సరో : ఎలా మాట్లాడతాను ?

భీమన్న : మీ ఆయన నీ దగ్గిరికి వచ్చి పోవటంల్లేదా ?

సరో : ఊం వచ్చిపోతే ?

భీమన్న : నాన్సెన్స్ ! ఎలా వచ్చిపోతాడు, ఊరిచుట్టూ మేమంతా కాపలా కాస్తూ ఉంటే ?

సరో : అవును, ఎలా వచ్చిపోతాడు ?

భీమన్న : అదిగో ! అబద్ధమాడుతున్నావ్. చెప్పు ఎలా వస్తున్నాడో.

సరో : నాకేం తెలుసు.

భీమన్న : ( భటులతో ) ఒరేయ్ ! చూస్తారేంటిరా. ఇల్లుసోదా చెయ్యండి.

( భటులు లోపలికి వెళ్ళబోతారు. )

సరో : వెళ్ళటానికి వీల్లేదు. ( అడ్డంవస్తుంది )

[ భటులు చెరియొక రెక్క పట్టుకుని సరోజినిని ఒక పక్కకు లాగేసి లోపలికి వెళతారు. భీమన్న మంచం వాల్చుకుని కూర్చుంటాడు. మంచం

వాళ్ళగానే ప్రసాదు మంచంకిందకు దూరతాడు. ప్రసాదును ఎక్కడ చూస్తాడోనని సరోజిని భయపడుతూంటుంది. భీమన్న దిండ్లు వగైరా తీసి చూస్తూ ఉంటాడు. ఇంతలో ఒక భటుడు సరోజినీనాయుడు ఫొటో తెచ్చి భీమన్న చేతికిస్తాడు. ]

భీమన్న : [ ఫొటో చూస్తూ ] ఎవరీ మనిషి ?

సరో : సరోజినీనాయుడు.

భీమన్న : నాయుడు ! ఆడమనిషిలాగాఉంటే నాయుడంటావేం?

సరో : అదేపేరు.

భీమన్న : ఎవరీమె ? నీకేం గావాలి ?

సరో : నాకేంగాదు.

భీమన్న : సర్దార్ భీమన్నకే టోపీ వెయ్యాలని చూస్తున్నావ్? నీ ఎత్తులు, జిత్తులు నాముందు సాగవ్. ( అధికారయుతంగా ) చెప్పు. ఎవరీమె ?

సరో : ఒక పెద్ద నాయకురాలు.

భీమన్న : అదీమాట. అట్టా దారికిరా. ఇప్పు డెక్కడుంది ?

సరో : ఇప్పుడెక్కడా లేదు.

భీమన్న : ఎక్కడా లేక ఏమవుతుంది ?

సరో : చచ్చిపోయింది.

భీమన్న : అదిగో, మళ్ళీ అబద్ధాలాడుతున్నావ్. నిజంచెప్పు. పబ్లిక్కా ? అండర్ గ్రౌండా ?

సరో : ( వచ్చిన నవ్వును ఆపుకుంటూ ) అండర్ గ్రౌండ్.

భీమన్న : ఈమెను పట్టించాలి. నీకు మంచి బహుమానం ఇప్పిస్తా.

సరో: నాచేతగాదు; మీరే పట్టుకోండి.

భీమన్న: అడ్రస్?

సరో: తెలియదు.

భీమన్న: అట్టా అంటే కుదరదు. చెప్పాలిసిందే.

సరో: సరే వ్రాసుకోండి.

(భీమన్న సంతోషంగా జేబులోనుంచి పెన్సిలు, నోటుబుక్కు తీస్తాడు.)

భీమన్న: ఊఁ చెప్పు.

సరో: సరోజినీనాయుడు, కేర్ ఆఫ్ దేవేంద్రుడు, స్వర్గలోకం.

భీమన్న: (రాస్తూ రాస్తూ ఉలిక్కిపడి) నాన్సెన్స్. స్వర్గలోకం ఏంటి! నన్నెగతాళి చేస్తున్నావా? నీపని చెప్తానుండు.

(ఒక భటుడు లోపలనుంచి గొడ్డలి తెచ్చి భీమన్న చేతికిస్తాడు. గొడ్డలి చేతబుచ్చుకొని తన ప్రయత్నం ఫలించిందనే ఉద్రేకంతో సగర్వంగా సరోజినిని చూచి) దొరికారు! (మంచంమీదనుంచి లేచి సరోజినిదగ్గిరకెళ్ళి) ఈ మారణాయుధం మీ ఇంట్లో ఎందుకుంది?

సరో: రైతులింట్లో గొడ్డలి ఉండక తుపాకి ఉంటుందా?

భీమన్న: తుపాకికంటె ఇదేం తక్కువ ప్రమాదం?

సరో: గొడ్డలి లేకుండా రైతులకెలా గడుస్తుంది?

భీమన్న: అదంతా నాకు తెలియదు. ఈ గొడ్డలితో కొడితే మనిషి బతుకుతాడా?

సరో: దెబ్బకు చస్తాడు.

భీమన్న : అలా చెప్పు. కాబట్టి ఇదొక పెద్ద మారణాయుధం.

సరో : మీవాళ్ళ చేతుల్లో ఉంటే నిజంగా మారణాయుధమే ; కాని రైతుల చేతుల్లో ఉంటేమాత్రం కాదు.

భీమన్న : అదంతా నాకనవసరం. నీమీద కేసు పెడుతున్నా.

సరో : ఎందుకు ?

భీమన్న : మా దిబ్బరాజ్యంలో మనుష్యుల దగ్గిర మారణాయుధాలుండటం మహానేరం.

సరో : మరి మీదగ్గిరెందుకున్నాయ్ ? మీరు మనుష్యులు గారా ?

భీమన్న : మేం మీ అందర్నీ రక్షించే వాళ్ళం.

సరో : మీరు రక్షించేవాళ్ళు. మేం భక్షించేవాళ్ళం. బాగుంది.

భీమన్న : నేను నీతో వాదించటానికి రాలేదు. ఈ కాగితం మీద సంతకం చెయ్.

సరో : ఏఁవిటది ?

భీమన్న : మీ ఇంట్లో ఫలానా వస్తువులు దొరికినమాట నిజమేనని.

సరో : ఫలానా ఫలానా అంటే ?

భీమన్న : అంటే (సరోజినీ నాయుడు పటాన్నీ, గొడ్డల్నీ చూపుతూ) ఇదుగో ఈ నాయుడూ, ఈ మారణాయుధం.

(అంటూ కాగితం సరోజిని చేతికిస్తాడు. సరోజిని వచ్చే నవ్వు నాపుకుంటూ సంతకంచేసి కాగితం తిరిగి యిచ్చివేస్తుంది.)

భీమన్న : సరే, ఈసారికి వెళ్తన్నా. పదిహేను రోజుల్లో నీ భర్తను పట్టించక పోయావా అరెస్టు చేస్తా. (భీమన్న వెళ్ళి పోతాడు.)

సరో : (మంచం కిందకు తొంగిచూచి చిరునవ్వుతో) ఇక రావచ్చు అండర్ గ్రౌండు నుంచి బైటికి.

ప్రసాదు : (మంచం కింది నుంచి బైటికొచ్చి) అద్భుతంగా మాట్లా డావ్. నీ వింత ధైర్యంగా, ఇంత తెలివిగా మాట్లాడతావని నేనెప్పుడూ అనుకోలేదు. మొత్తంమీద నీ పేరు సార్థకం చేసుకున్నావు. (అంటూ వీపు చరుస్తాడు. సరోజిని చిరునవ్వు నవ్వుతూ తల వంచు కుంటుంది. బయటనుంచి "సరోజినీ! సరోజినీ!" అంటూ ఎవరో పిలుస్తారు. ప్రసాదు సైడ్‌వింగ్‌లోకి తప్పుకుంటాడు. సరోజిని "ఎవరు?" అంటూ వెళ్ళి దొడ్డితలుపు తీస్తుంది. వీరయ్య, నారాయణలు ప్రవేశిస్తారు.)

వీరయ్య : (వస్తూనే ఆదుర్దాగా) దిబ్బరౌడీలు వచ్చారుగా ఏం జరి గింది?

సరో : ఏం జరగాలో అదే జరిగేది. కొద్దిలో గండం గడిచి బయట పడ్డాం.

నారా : ఏమిటి?

సరో : (పరిహాస ధోరణిలో) పిల్లిలాగా ఈ మంచంకింద దూరాడు గాబట్టి మాటదక్కింది.

వీరయ్య : ఎవరు?

సరో : అడుగో! (అంటూ సైడ్‌వింగ్‌లోకి చూపుతుంది.)

(వీరయ్య, నారాయణలు ఇంకా కొంచెం ముందుకు వెళ్ళి సైడ్‌వింగ్‌లోకి చూస్తారు. లోపలినుంచి వస్తూవున్న ప్రసాదు కనిపిస్తాడు.)

వీరయ్యా : } (ఆశ్చర్యంగా) ప్రసాద్?
నారా : }

(ప్రసాద్ పట్టరాని సంతోషంతో వీరయ్య నారాయణలను కౌగలించు కుంటాడు.)

వీరయ్య : అబ్బ! ఎన్నాళ్లకు చూశాం!

నారా : నిన్ను చూస్తే మళ్లీ ప్రాణం లేచివచ్చింది ప్రసాద్!

ప్రసాదు : మీకోసం నేనే కబురంపుదా మనుకుంటున్నా. ఏంవిటికబుర్లు?

వీరయ్య : ఇప్పుడిక్కడికి వచ్చాడే – సర్దార్ – వాడే ఆ రోజు గిత్తలబేరం అంటూ దొంగవేషంలో వచ్చింది.

ప్రసాదు : ఎవరు? అప్పుడు స్కూలుకువచ్చి ముక్కంటితో మాట్లాడిపోయిన మనిషా?

నారా : అవును, వాడే.

ప్రసాదు : (కొంచెం ఆలోచించి వికసించిన ముఖంతో) సరే, అయితే లంకలో జొరబడేమార్గం దొరికిందన్నమాట.

వీరయ్య : ఏంటది?

ప్రసాదు : ఏముంది. కోటకు తూటు పడుతుంది.

నారా : ఎట్టా?

ప్రసాదు : కొద్ది రోజులు ఓపిక పట్టండి. మీకే తెలుస్తుంది.

వీరయ్య : (విసుగ్గా) ఓపిక! ఓపిక! వాళ్లుచేసే దుర్మార్గం చూస్తా ఉంటే వల్లు మండిపోతా ఉంది.

ప్రసాదు : నువ్వొక్కడివే తొందరపడితే లాభంలేదు. వీరయ్యన్నా! అందర్నీ కలుపుకు రావాలి.

వీరయ్య : అందర్నీ కలుపుకొచ్చేటప్పటికి ఇక్కడ మా ప్రాణం కాస్తా గుటుక్కు మంటుంది. అంతా కలిసొచ్చినా సరే రాక పోయినా సరే. ముందా గజపతిగాడి సంగతేంటో తేల్చు కోవాల్సిందే.

ప్రసాదు : (వీరయ్య భుజం తట్టి వారిస్తూ) నేల విడచి సాము చేయటం మంచిది కాదు. ప్రజలను దూరమయ్యామా మనం పడే కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. ధైర్యంగా ఉండండి. భూములు మాత్రం గజపతి స్వాధీనం కాకుండా జూడండి. మీరు చేసేపని రెండో కంటికి తెలియ గూడదు. బహు జాగ్రత్తగా ఉండాలి...ఇప్పటికే చాలా ఆలస్య మైంది. మీరు కూడా కొంచెం నాతోపాటు ఊరి బైట దాకా రండి. మీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి. (సరోజినిని చూచి) వెళతాం.

సరో : భోంచెయ్యకుండానే ?

ప్రసాదు : ఇప్పుడిక లాభంలేదు, వెళ్లాలి.

సరో : (నిర్విణ్ణురాలై) మూడురోజులనుంచి భోజనం లేకుండా...

ప్రసాదు : ఏంచేస్తాం తప్పదు. అర్జెంటుగా ఒక మిత్రుణ్ణి కలుసు కోవాలి. అయిదు నిముషాలు ఆలస్యమైందా మళ్లీ అతను నాకు దొరకడు. వస్తా. (వీరయ్య నారాయణలతో) రండి.
(బయల్దేరబోతారు.)

సరో : ఉండండి. (అంటూ గబగబా లోపలికి వెళ్లి ఒక పాతిక రూపాయలు తీసుకొచ్చి ప్రసాదు జేబులో పెడుతుంది.)

ప్రసాదు : [ఆశ్చర్యంగా] ఏంవిటిది ?

సరో: ఉండనివ్వండి. దేనికైనా ఉపయోగిస్తుంది.

ప్రసాదు: సరే.

(అంటూ ఒక చిరునవ్వు నవ్వి వీరయ్య, నారాయణలతో సహా వెళ్లి పోతాడు. సరోజని విచారంగా ప్రసాదు వెళ్లినవైపే చూస్తూ ఉంటుంది)

[ తెర ]

# అయిదో దృశ్యం

★

## దేవిడీ

[మొన్నటిదాకా రాత్రి పాఠశాలగా ఉన్న దేవిడీ (బంకులు) దిబ్బ సైనికుల క్యాంపుగా మారింది. మ్యాపులు, పటాలు, ఫొటోలు ఉండే స్థానంలో కత్తులు, కరారులు వెలిశాయి. సర్దార్ భీమన్న బెల్టు సర్దుకుంటూ ఉంటాడు. వెనకనుంచి అడుగుల చప్పుడవుతుంది. గజపతిగారు వస్తున్నారని గబుక్కున వెనక్కి తిరిగి వంగి సలాం చేస్తాడు.]

ముక్కంటి : (నవ్వుకుంటూ) దండాలుండి దొరగారూ!

భీమన్న : (ముక్కంటిని పరికించి చూచి) ఓరి నువ్వట్రా మడేల్ !

ముక్కంటి : గిత్తలభేరం బలేబాగా చేశావు దొరా!

భీమన్న : చేశాం. ఊరంతా ముందు ఆరా తీశాం. ఆటల్లో పాటల్లో జనం అంతా అజాగ్రత్తగా నున్నప్పుడు చూశాం. ముట్టడి వేశాం.

ముక్కంటి : అద్గదీ. దెబ్బంటే అట్టా వుండాలి.

భీమన్న : ఆ దెబ్బ గొట్టటానికి ఆరు మాసాలనుంచి ప్లాను వేశాం. ఏం లాభం అసలు గిత్తే తప్పించుకుపోయింది.

ముక్కంటి : ఎవడు! ఆ ప్రసాదుగాడేనా?

భీమన్న : వాడే! ఎట్టా బురిడీగొట్టాడో కొట్టాడు.

ముక్కంటి : ఆడి జిత్తులూ ఎత్తులూ మీకేం తెలుస్తయ్ దొరా! ఆ రోజున చిక్కేవాడే, కొద్దిలో తప్పించుక పొయ్యాడు.

భీమన్న : ఎలా ?

ముక్కంటి : చచ్చిపోయినట్టు దొంగనాటకమాడి ఊళ్లోనుంచి దూసుకున్నాడంట.

భీమన్న : [ఆశ్చర్యపోయి] నిజంగా!

ముక్కంటి : నాపేరు ముక్కంటి గౌరా! ఆమాత్రం తెలుసుకో లేకపోతే ఇంకా మూడోకన్నెందుకు నా మొఖానికి ?

భీమన్న : [కొంచెం ఆలోచించి] సరే, అయిందేదో అయింది. ఈ మాట దొరగారితో అనకు మళ్లీ నా పీక ఎగిరిపోతుంది.

ముక్కంటి : నేనే అంత తెలివితక్కువ దద్దమ్మ ననుకున్నారేం? ఏ మాట ఎక్కడనాలో, ఎప్పుడనాలో నాకూడా కాస్తి తెలుసండో అప్పలరాజుగారూ!

భీమన్న : అప్పలరాజేవిట్రా?

ముక్కంటి : [తెల్లబోయి] అదేకా మీ పేరు !

భీమన్న : అది మిమ్మల్ని బోల్తావేయటానికి చెప్పిన పేరురా మడేల్ !

ముక్కంటి : అద్గదీ దెబ్బ ! బలే బాగా బోల్తా వేశారు దొరా. మన అసలు పేరో ?

భీమన్న : భీమన్న.

ముక్కంటి : భీమన్నగారా ? ఎవరు బెట్టారోగాని మీకీ పేరు బలే శాగుంది.

భీమన్న : (దప్పున ఏదో స్ఫురణకు వచ్చి) సరేగాని ఇంత కాలం నుంచి నువ్వెక్కడి కెళ్ళావు ?

ముక్కంటి : (ఇకిలిస్తూ) అత్తారింటికి.

భీమన్న : ఏంటి గిరాకీ ?

ముక్కంటి : పెళ్ళి అయి మూణ్ణెల్లేగా అయింది. మా దొర గారు మళ్లీ ఊళ్లోకొచ్చారని తెలిసేటప్పటికి ఆగలేకపోయా. మా ఆడది ఇంకా పదిరోజులుండమంది .....

భీమన్న : ఉండక పోయావా ? ఇక్కడేం మునిగిపోయిందని వచ్చావ్? కొత్త పెళ్ళాన్నొదిలి పెట్టి.

ముక్కంటి : మా దొరగారిని చూడకుండా నేనుండ లేం. ఏరి మా దొరగారు ?

భీమన్న : వచ్చే వేళయింది. (చిరునవ్వుతో) సరేగాని మరి పెళ్ళాన్ని తీసుకొచ్చావా ?

ముక్కంటి : [చేతులు నలుపుకుంటూ] లేదు దొరా !......
ఏవండో భీమన్నగారూ ! దొరగారికి మీరుకూడా కాస్త సిపార్సు చెయ్యాలి.

భీమన్న : ఏఁవిటి?

ముక్కంటి : అదే దొరా ! నా ఉద్యోగంమాట. మా దొర గారి కొలువు నేనే సెయ్యాలి, వారే సేయించుకోవాలి. మీరు గట్టిగా సెపితే తప్పకుండా అవుద్ది.

భీమన్న : తప్పుకో, దొరగారు వస్తున్నారు.

ముక్కంటి : మరి నామాట ?

భీమన్న : నేనున్నానుగాదటోయ్ పిచ్చోడా ! బయటఉండు, కబురు పెట్టగానే రా.

ముక్కంటి : ( హుషారుగా ) భీమన్నగారు మాట అనాలేగాని ఇంకా నాదెబ్బకి తిరుగుందా ?

( సంతోషంగా చంకలు కొట్టుకుంటూ బయటికి వెళతాడు.—గజపతి ప్రవేశం. భీమన్న సలాంజేసి నిటారుగా నిలబడతాడు. గజపతి కుర్చీలో ఆసీనుడై సిగరెట్టు పైపు నోట్లోబెట్టుకుని గూడ్సుబండిలాగా గుప్పుగుప్పున పొగ వదుల్తూ ఉంటాడు. మరొక నౌకరు డ్రింక్సు వగైరా తెచ్చి టేబిలుమీద పెట్టి సలాంజేసి వెళ్ళిపోతాడు. )

గజపతి : సర్దార్ !

భీమన్న : జీ హుజూర్ !

గజపతి : ఊళ్ళోనుంచి పరారైనవాళ్ల జాబితా తీసుకురా.

( భీమన్న లోపలికి వెళ్తాడు. గజపతి ఒకడోసు పానీయం సేవిస్తాడు. భీమన్న జాబితా తెచ్చి సవినయంగా గజపతి టేబుల్ మీద ఉంచుతాడు.)

గజపతి : ప్రసాదు ఆచూకీ తెలిసిందా ?

భీమన్న : లేదండీ.

గజపతి : శ్రీనివాసరావు ?

భీమన్న : లేదండీ.

గజపతి : గోపయ్య ?

భీమన్న : లేదండీ.

గజపతి : వెంకటరెడ్డి ?

భీమన్న : లేదండీ.

గజపతి : ముక్కంటీ?

భీమన్న : హాజరు.

గజపతి : ఎప్పుడొచ్చాడు?

భీమన్న : ఇప్పుడేనండీ.

గజపతి : సరిగా దర్యాప్తు చేశావా?

భీమన్న : చేశానండి.

గజపతి : ఇంతకాలంనుంచి గైరు హాజరైనందుకు ముక్కంటి ఇచ్చిన సంజాయిషీ ఏఁవిటి?

భీమన్న : (చిరునవ్వుతో) అత్తవారింటికెళ్ళాడండీ. వాఁడి సంగతి మనకు మొదటినుంచీ తెలుసుగదండీ. పాపం మొన్ననే పెళ్లి చేసుకున్నాడంట. దొరగారు మళ్లీ ఊళ్లో కొచ్చారని తెలిసి పెళ్లాం ఇంకా పదిరోజులుండమన్నా ఉండకుండా దొరగారి దర్శనంకోసం రంయిన పరుగెత్తుకొచ్చాడు. అప్పుడు నన్ను మీరు గూఢచారిగా పంపలా?

గజపతి : (గుర్తుతెచ్చుకొని) ఊఁ.

భీమన్న : ఊళ్ళోనుంచి మీరు వెళ్లిపోయారని పాపం కళ్ళ వెంట నీళ్లు పెట్టాడు.

గజపతి : చూడటానికి వట్టి పొగరుబోతులాగా కన్పిస్తాడే.

భీమన్న : వాడిముఖం, వాడిదేం ఉందండి. కుడుం చేతికిస్తే? పండగనుకు నేరకం.

గజపతి : వాడుకూడా ప్రసాదు స్కూల్లో చేరాడట?

భీమన్న : చేరక ఏంచేస్తాడు కొట్టి లాక్కెళితే? ఆ రోజుల్లో అదంతా రాడీరాజ్యం. అడిగేవాడెవడు? రాడీరాజ్యం అంటే వాడికి గొంతువరకుంది. మెల్లగా దువ్వి వాణ్ణి కొంచెం దగ్గరకు తీస్తే మనకు చాలా ఉపయోగపడతాడు.

గజపతి : ( ఆలోచించి ) అచ్ఛా! పిలువు.

( భీమన్న బయటికి వెళ్తాడు. గజపతి మళ్ళీ ఒకడోసు డ్రింకువేసి అచారు, పచారుచేస్తూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. )

ముక్కంటి : ( వస్తూనే పట్టరాని సంతోషంతో ) మా ధొరగారు! మళ్ళీ మా ధొరగారొచ్చారు. ( గబగబా వచ్చి గజపతి కాళ్ళ మీద పడతాడు. )

గజపతి : ఏఁవిటిరా ఇది? లేవరా. లే.

ముక్కంటి : ( లేచి చేతులు నలుపుకుంటూ ఇకిలిస్తూ ) మళ్లీ మా ధొరగారి దర్శనం అయింది. ఇప్పుడు నాకళ్లు చల్లబడ్డాయి. ఇక ఈ ఊళ్లో వాళ్లని ఒక్కొక్కళ్లని ముప్పుతిప్పలుబెట్టి మూండు చెరువుల నీళ్లు తాగించకపోతే నాపేరు ముక్కంటి గాదు. నాదెబ్బంటే ఏఁవనుకున్నారో ధొరగారు. ఈ దెబ్బతో మన చావో బతుకో తేలిపోవాలి. ( అటు ఇటు జూచి ) మీరు లేనప్పుడు ఇదంతా బావురుమంటూ ఉండేది. మళ్లీ మీరు అడుగుబెట్టేసరికి ఎంతకళనచ్చింది. మా తాత ముత్తాతలనాటినుంచీ ధొరగారి మోచేతికింద నీళ్లు తాగాం. మొట్టమొదటనుంచీ మీ ఊడిగమే చేశాం, మీ కొలువులో మళ్లీ నేనే పని చెయ్యాలి.

గజపతి : ఏం పని చేస్తావ్.

ముక్కంటి: ఏపనిబడితే ఆపని చేస్తాను. ఇదంతా ఊడిచేస్తా. ఇక్కడున్న మురికంతా తుడిచేస్తా. బట్ట లుతుకుతా, ఇస్త్రీ చేస్తా. నాకు చాలా విద్యలొచ్చండీ ధొరగారు. మంగలాయన పనికూడా నేనే చేస్తా. మీకు ఆఁవదం రాస్తా, బాగా నలుగుపెడతా, జలకం ఆడిస్తా, కాళ్ళు పిసుకుతా. మీరు 'ఊఁ' అనాలేగాని ఇంకా మీ ఊపిరి ఆడనిస్తానా!

గజపతి: (నవ్వుకుంటూ) సరే కానీయి.

ముక్కంటి: (సంతోషంగా) సల్లని మారాజు. నే నడిగితే ఇంకా మా ధొరగారు కాదంటారా?

(అంటూ వెళ్లిపోతాడు. — శేషగిరి ప్రవేశం. శేషగిరి సూటుమీద నీటుగా ఉంటాడు.)

శేషగిరి: గుడ్‌మార్నింగ్ రాజాసాహెబ్!

గజపతి: హలో! గుడ్‌ మార్నింగ్!

(ఇద్దరు కరస్పర్శ చేస్తారు.)

,, ఏఁవిటి కబుర్లు?

శేషగిరి: ఇంతకాలానికి పీడ విరగడైంది. రౌడీరాజ్యం పోయి మళ్ళీ మన రామరాజ్యం వచ్చింది, బ్రతికిపోయాం.

గజపతి: దిబ్బరాజుగారు క్షేమంగా ఉన్నంతకాలం బ్రహ్మ దేఁవుడు కూడా మనజోలికి రాలేదు. దిబ్బరాజ్యంలో మనం చెప్పింది శిలాక్షరం.

శేషగిరి: ఆ సంగతి మనకు తెలియకుండా ఉందా? ఆ ధైర్యం తోనే రెండు సంవత్సరాలు వాళ్ళు పెట్టిన బాధలన్నీ సహిం

చాను. మానాభిమానాలు వదులుకున్నాను. వాళ్ళు చెప్పిన దానికల్లా తల ఊపాను. వాళ్ళతో కలిసి ప్రజారాజ్యానికీ జయ్ అని గొంతుచించుకుంటూ కేకలు వేశాను.

గజపతి: భలేపని చేశావ్. బాగా టోపీ వేశావ్.

శేషగిరి: లేకపోతే ఆ రౌడీరాజ్యంలో నాలాంటివాళ్లు బ్రతకటం సాధ్యమా? ఏ రోటి దగ్గర పదం ఆ రోటి దగ్గర పాడి చివరికి ఎలాగైతేం మనపని సాధించాను.

గజపతి: క్వైట్ రైట్! యుగంధరుడవంటే నీవు. ఈరోజునుంచి నిన్ను నా పర్సనల్ సెక్రటరీగా నియమిస్తున్నా.

శేషగిరి: ధాంక్సు! రౌడీ రాజ్యంలో ఊరంతా అల్లకల్లోలం అయిపోయింది. ఇప్పుడు మళ్ళీ మనం దాన్ని పకడ్బందీ చెయ్యాలి.

గజపతి: చెయ్! నీకు సర్వముఖ్తారునామా ఇస్తున్నాను.

శేషగిరి: కూటికిలేని నిధవలందరికీ ఓటు ఇవ్వడంతో కళ్లు నెత్తికొచ్చాయి. ఒక్కొక్కడికి కొమ్ములు మొలిచాయి. ఇప్పుడు మనం మళ్లీ వాటిని విరగ్గొట్టాలి.

గజపతి: క్వైట్రైట్! కానీయ్, నీ ఇష్టంవచ్చినట్లు కానీయ్.

శేషగిరి: అన్నిటికంటే ముందు గ్రామంచుట్టూ మంచి బందోబస్తు చెయ్యాలి. నాల్గువైపులా కాపలా పెట్టాలి. వాళ్ల దసలే మైరావణజాతి. పూటకొక వేషం వేస్తారు. పాముల్లాగా రొమ్ములమీద పాకివస్తారు. కన్నుమూసి కన్ను తెరిచేటప్పటికే నీళ్లల్లో చేపల్లా మాయమైపోతారు. కాబట్టి మనం బహుజాగ్రత్తగా ఉండాలి. ఊళ్లోకి బిచ్చగాణ్ణి

రానివ్వకూడదు. సన్యాసిగాణ్ణి రానివ్వకూడదు. చివరికి గాజులసెట్టి వచ్చినాసరే, ముందు మీ దగ్గర పర్మిషన్ తీసుకుంటేనే ఊళ్లో అడుగుబెట్టనివ్వాలి. ఇదంతా మంచి పకడ్బందీగా జరగాలి. పొరపాటు చేశామా ప్రాణాలు ఎగిరిపోతయి.

గజపతి: బాగుంది. నీప్లాను అద్భుతంగా ఉంది. వెయ్, ఒక డోసు వెయ్! (ఇద్దరూ డోసు వేస్తూఉంటారు.)

శేషగిరి: మరో చిన్న సలహా.

గజపతి: ఏంవిటది?

శేషగిరి: మన దండనీతికి కూడా ఒక పద్ధతి, ఒక ప్లాను ఉండాలి. పిడుక్కీ బియ్యానికీ ఒకే మంత్రంగా ఉండగూడదు. మనం కూడా చతుర్విధోపాయాలు ఉపయోగించాలి. లాలించేవాళ్ళను లాలించాలి. లంచం మేపేవాళ్ళకి లంచం మేపాలి. కాల్చేసేవాళ్ళని కాల్చెయ్యాలి.

గజపతి: కాల్చేస్తాం, పేల్చేస్తాం. మనల్నడిగే దెవరు? దిబ్బరాజుగారు మనకు సర్వాధికారాలిచ్చారు.

శేషగిరి: నిజమే ననుకోండి. అయినా మనం కూడా ఒక న్యాయానికి కట్టుబడి నడుచుకుంటూ ఉన్నట్టు నటించాలి. కాబట్టి మారణ కార్యక్రమంతోపాటు మరొకవైపున కేసుల కార్యక్రమం కూడా నడపాలి.

గజపతి: ఏం కేసులు?

శేషగిరి: హత్యా కేసులు, దొమ్మీ కేసులు, దోపిడీ కేసులు, చోరీ కేసులు, ఏది వీలైతే అది.

గజపతి : క్వైట్‌రైట్ ! ఆ కేసుల కార్యక్రమమంతా నువ్వు చూడు.

శేషగిరి : థాంక్స్ ! మరోవిషయంకూడా మనం మంచి పకడ్బందీగా ఆలోచించాలి.

గజపతి : ఏఁవిటి ?

శేషగిరి : ఊళ్లోనుంచి కొందరు పరారయ్యారు. వాళ్లను పట్టుకో లేకపోయామా ఎప్పుడైనా మనకు ప్రమాదం తప్పదు.

గజపతి : యస్. యూ ఆర్ క్వైట్‌రైట్ !

శేషగిరి : వీరయ్య తమ్ముడు గోపయ్య పారిపోయాడు. కాబట్టి మనం వీరయ్యను అరెస్టు చెయ్యకూడదు.

గజపతి : అదేఁవిటి ?

శేషగిరి : ఆఁ. అక్కడేఉంది అసలు కిటుకు. వీరయ్యను అరెస్టు చెయ్యలేదనుకోండి, ఎప్పుడో ఒకప్పుడు వీరయ్య గోపయ్యనో, గోపయ్య వీరయ్యనో కలుసుకుంటారు. కాబట్టి మనం వీరయ్యమీద ఎప్పుడూ ఒకకన్ను వేసిఉంటే వాడి ద్వారా గోపయ్యను పట్టుకోవచ్చు.

గజపతి : క్వైట్‌రైట్ ! బాగుంది. బుర్రంటే నీది.

శేషగిరి : ప్రసాదు విషయంకూడా అంతే.

గజపతి : క్వైట్ రైట్ ! సరోజినిని అరెస్టు చేయకుండా వాచ్ చేస్తూ ఉందాం.

శేషగిరి : మా నాన్నలాంటి మోతుబరి రైతులతో కూడా నిష్కర్షగా ఉండాలి. వింటారా మీమాట ఖచ్చితంగా వింటారు; లేదా అందరితోపాటు వాళ్లుకూడా అనుభవిస్తారు.

గజపతి: (శేషగిరి భుజం తట్టి) రాజభక్తి అంటే అలా ఉండాలి. నీలాంటివాళ్ళు పదిమంది ఉంటే చాలు; మన దిబ్బరాజ్యం పేరు దేశదేశాల్లో మోగిపోతుంది.

శేషగిరి: సెలవు, వస్తా.

గజపతి: అచ్ఛా. జావ్.

(షేక్‌హాండ్ ఇస్తాడు. శేషగిరి వెళ్ళిపోతాడు.)

,, ఎవడురా అక్కడ?

భటుడు: జీ హుజూర్!

గజపతి: గంటకొట్టు.

భటుడు: చిత్తం!

(సలాంచేసి లోపలికివెళ్ళి గంట కొడతాడు.)

గజపతి: (ఒక గుక్కెడు పానీయం సేవించి) సర్దార్!

భీమన్న: జీ హుజూర్!

గజపతి: ఊళ్ళోవాళ్ళంతా వచ్చారా?

భీమన్న: వచ్చారు హుజూర్!

గజపతి: ఒక జట్టును ఊళ్ళోకి పంపి ఇళ్ళిల్లు సోదా చేయించు.

భీమన్న: చిత్తం!

గజపతి: వచ్చినోళ్ళందరికీ ఒక్కొక్కడికి యాభై దెబ్బలు తగలనియ్.

భీమన్న: చిత్తం!

గజపతి: పో.

(భీమన్న వెళ్తాడు. తెరలోనుంచి దెబ్బలు, మూల్గులు, అట్టహాసాలు, హాహాకారాలు భయంకరంగా వినపడుతూ ఉంటాయి.)

గజపతి: (వికటాట్టహాసం చేస్తూ) కొట్టండి. బాదండి. సున్నం లోకి ఎముక లేకుండా విరగబొడవండి. రాజా గజపతి అంటే ఏంవనుకున్నారో గాడ్దెలు. ఏనుగుల్ని పీనుగుల్ని చేస్తాను. ఈ వెధవలు నాకు వ్యతిరేకంగా కుట్ర చేస్తారా? నా ఊళ్లోనుంచి నన్ను తరిమివేస్తారా? కొట్టండి. నుగ్గు నుగ్గు చెయ్యండి. వీళ్ళబ్బగాడు ఎవడు అడ్డం వస్తాడో చూస్తా. (ఒకప్రక్కకు వెళ్ళి దిగ్గరగా)

గజపతి: దంపుడు పూర్తి అయిందా?

భీమన్న: (ప్రవేశించి) అయిందండి.

గజపతి: పిలువు. అందర్నీ పిలువు.

భీమన్న: అంతా ఇక్కడే ఉన్నారండి.

గజపతి: (ఒక పక్కకు వెళ్ళి) దున్నేవాడికే భూమి కావాలిరా?

— తెరలో —

"వద్దుబాబో వద్దు – మాకు భూమీవద్దు పుట్రావద్దు"

గజపతి: ఆక్రమించుకున్న భూములన్నీ వదలిపెట్టేస్తారా?

— తెరలో —

'ఆ'

గజపతి: వెట్టిచాకిరీ చేస్తారా?

— తెరలో —

"చేస్తాం బాబూ చేస్తాం, మీకు చెప్పినట్లల్లా చేస్తాం, మీరు నడవమన్నట్లే నడుస్తాం."

గజపతి: [వికటాట్టహాసం చేసి] సరే వినండి. రేపటినుంచి రోజూ ఊళ్ళోవాళ్ళంతా ఒక్కడు కూడా బీకుపోకుండా కోట కాపలా కాయాలి. కోటకు నాలుగువైపులా డేరాలు వేసుకోవాలి.

తెరలో

" డబ్బో ? "

గజపతి: మీరే పెట్టుకోవాలి. మనిషికి పది రూపాయల చొప్పున చందా వేసుకోవాలి. తెలిసిందా ?

( తెరలో నిశ్శబ్దం )

రండి. ఒక్కొక్కళ్లే వచ్చి చందాలు వేయండి.

( ఎవళ్ళూ ముందుకురారు )

( భీమన్నతో ) అందరికంటే ముందు పెద్దరైతు భద్రయ్యను రమ్మను.

భీమన్న: భద్రయ్య రాలేదండీ.

గజపతి: ఏం ? ఎందుకురాల ? శేషగిరి తనకొడుకేగదా అనుకుంటున్నాడేమో ! ఆ పప్పులేమీ ఉడకవు. రూలు రూలే. అందరూ పాటించాలి. (భటునితో) వెళ్లు, భద్రయ్యను పిల్చుకురా !

( భటుడు సలాంచేసి వెళతాడు )

( మళ్ళీ గ్రామస్థులవైపు చూచి ) సరే, మీరు రండి లోపలికి.

తెరలో

" పేదోళ్లమండీ, చందాలు ఇచ్చుకోలేం బాబూ ! "

గజపతి : నోరెత్తారా పల్లి మగుతన్. మీ రక్షణకోసం మీరు డబ్బివ్వకపోతే మీ అబ్బగాడు ఎవడిస్తాడు ?

— తెర లో —

" మా కెందుకండీ రచ్చన ? ఎత్తుకెల్లటానికి మాదగ్గరేం ఉండయ్ మా అస్తులు. ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్టు మీ రచ్చనకోసం మేం డబ్బు ఇవ్వటం ఏంది ?"

గజపతి : ఎవడురా వాడు ?

[ ఒక్కడూ మాట్లాడడు. ]

,, ఎవర్రా ఇప్పుడు మాట్లాడింది? చెప్తారా, చెప్పరా?

[ అంతా నిశ్శబ్దం ]

,, సర్దార్ !

భీమన్న : హుజూర్ !

గజపతి : వీళ్ళకింకా పొగరణగలా. ఒక్కొక్కణ్ణి మెత్తగా తన్ని గుడ్డలూడదీయించి ఊరంతా ఊరేగించు, పో ముందు వీరయ్యను పట్టుకురా.

( భీమన్న వెళ్తాడు. )

,, గాడ్దెలు; మదం దిగి కొట్టుకుంటున్నారు. ఈ దెబ్బతోగాని బుద్ధిరాదు.

( కుర్చీలో కూర్చొని డోసుమీద డోసు వేస్తూ ఉంటాడు. వీరయ్యను వెంటబెట్టుకుని భీమన్న ప్రవేశం. వీరయ్య వళ్ళంతా దెబ్బలతో కంది పోయి, పొంగిపోయి ఉంటుంది. )

గజపతి : ఏంరా, నువ్వేనటగా నాయకుడివి ?

వీరయ్య : నేను నాయకుణ్ణీగాదు, వినాయకుణ్ణీగాదు.

గజపతి: నీ తమ్ముణ్ణి పట్టిస్తావా?

వీరయ్య: అది నాపనిగాదు.

గజపతి: కాల్చేస్తాను జాగ్రత్త.

వీరయ్య: కాల్చెయ్. ఒకేసారి పీడ వదిలిపోద్ది ఈ బాధంతా లేకుండా.

గజపతి: ఒకేసారి కాల్చెయ్యనురా. అంగుళం అంగుళం నరికి చిత్రహింస చేస్తా, తెలిసిందా?

(వీరయ్య మాట్లాడడు.)

,, మీ రౌడీ రాజ్యంలో నువ్వొక కమిటీ మెంబరువా?

వీరయ్య: నేను మెంబరునుకాదు.

గజపతి: నిజం చెప్పు.

వీరయ్య: అబద్ధం చెప్పే అలవాటు నాకు లేదు.

గజపతి: ఏం, వళ్లు బలిసిందా?

వీరయ్య: తింటానికి తిండిలేనివాణ్ణి నాకేం వళ్లు బలుస్తుంది లెండి.

గజపతి: (గుడ్లురుముతూ మీదకువచ్చి) ఇంతకీ నీ సభ్యత్వానికి రాజీనామా ఇస్తావా, ఇవ్వవా?

వీరయ్య: అసలు సభ్యత్వమే లేదంటే!

గజపతి: సభ్యత్వం లేకపోతే సానుభూతికి రాజీనామా ఇవ్వు.

వీరయ్య: (ఎగతాళిగా) సానుభూతికి రాజీనామా ఏంటి?

గజపతి: షటప్! సర్దార్! వీణ్ణి తీసికెళ్లి మీసాలు పీకించు. గోళ్లల్లో సూదులు గొట్టించు, పో. నారాయణను తీసుకురా.

( భీమన్న వీరయ్యను తీసికెళ్లి నారాయణను వెంటబెట్టుకొని ప్రవేశిస్తాడు. నారాయణ వల్లంతా వాతలతో దెబ్బలతో నిండిపోయి ఉంది. గుడ్డలనిండా నెత్తురు మరకలు, నోటివెంట నెత్తురు కారుతూ ఉంటుంది.)

గజపతి : ఏంరా ! నువ్వుకూడా ప్రసాదుస్కూల్లో చేరావా ?

(భయంతో నారాయణ కాళ్లు, చేతులు వణకుతూ ఉంటాయి.)

నారా : చేరానండి.

గజపతి : ఎందుకు చేరావు ? ( గద్దిస్తూ అడుగుతాడు )

నారా : అందరూ జేరతాడుంటే నేనూ జేరాను.

గజపతి : నువ్వుకూడా ఒక కమిటీ మెంబరువా ?

( నారాయణ అవునన్నట్టు తలవూపుతాడు. )

,, ప్రెసిడెంటు ఎవరు !

నారా : ప్రసాదేనండి.

గజపతి : ఆ కమిటీ ఇంకా పని చేస్తూఉందా ?

నారా : లేదండి.

గజపతి : ప్రసాదును పట్టిస్తావా ?

నారా : నాకెక్కడ దొరుకుతాడు ?

గజపతి : దొరికితేనే.

నారా : పెద్ద పెద్దోళ్ళే పట్టుకోలేకపోతే నేనెట్టా పట్టుకుంటానండీ ?

గజపతి . అదంతా అనవసరం. పట్టుకోటానికి నువ్వుకూడా మావాళ్ళతోపాటు వెళతావా ?

( నారాయణ మాట్లాడడు )

గజపతి : ఏం ?

( నారాయణ తల ఊపుతాడు )

,, ( భీమన్నతో ) నీ అజమాయిషీకింద వీణ్ణి తన్ని పని చేయించు. టలాయించాడా షూట్ చెయ్.

,, ( నారాయణతో ) వెళ్ళు. [ భీమన్నతో నారాయణ వెళ్ళిపోతాడు]

భద్రయ్య : ( ప్రవేశించి సవినయంగా ) నమస్కారమండీ ! ఎందుకు పిలవనంపారు ?

గజపతి : ( ఆవేశాన్ని తగ్గించుకుని మృదువుగా ) రా, కూర్చో !

(అంటూ కుర్చీ చూపుతాడు. భద్రయ్య కుర్చీలో కూర్చుంటాడు.)

,, కోట రక్షణకు కొన్ని వేల రూపాయల ఖర్చౌతుంది. అందరిచేత చందాలు వేయిస్తున్నాం. ముందు నీ పద్దు ఎంతో ఈ కాగితంమీద వెయ్.

(అంటూ ఒక తెల్లకాగితం, కలం భద్రయ్య చేతికిస్తాడు.)

భద్రయ్య : ఎంత వేయమంటారు ?

గజపతి : నన్నడుగుతావేం ? నీ ఇష్టం వచ్చినంత వెయ్.

(భద్రయ్య కాగితంమీద అంకె వేసి గజపతి కిస్తాడు.)

,, ( కాగితం చూచి కోపంగా ) ఏఁవిటిది ? బిచ్చం అనుకున్నావా ? ఊళ్లో అందరికంటె మోతుబరివి. పది రూపాయలు వేస్తావటయ్యా ? ఒక్క భీమన్న జట్టులోనే 70 మంది సిబ్బంది ఉన్నారే. ఈ ముష్టి పదిరూపాయలతో వాళ్లందరికి తిండి ఎలా పెడతావ్. ఎన్ని డేరాలు వేయిస్తావు ? పెద్ద రైతువు నువ్వే పెద్ద మొత్తం వెయ్యకపోతే బక్కరైతులింకేం వేస్తారు ? వెయ్యవయ్యా ఒక వెయ్యి రూపాయలు.

భద్రయ్య : (నిర్ఘాంతపోయి) చందా వెయ్యి రూపాయలా ఈ కరువురోజుల్లో !

గజపతి : చాల్లేవయ్యా పెద్ద కబుర్లు చెప్పావ్. ఇదేం నా ఇంట్లో పెండ్లి కనుకున్నావా పేరంటాని కనుకున్నావా? కోట రక్షణకి, ప్రాణ రక్షణకి. ప్రాణం పోయినతరువాత ఇంకా ఆ స్తిఉండి ఎందుకయ్యా, తగలెయ్యనా? వెయ్.

(అంటూ మళ్లీ కాగితం అందిస్తాడు. భద్రయ్య మారు మాట్లాడకుండా వెయ్యి రూపాయలువేసి కాగితం తిరిగి ఇచ్చేస్తాడు. భీమన్న లోపలనుంచి వచ్చి ఒక పక్కన నుంచుంటాడు.)

భద్రయ్య : [చేతులు జోడించి] ఇక సెలవిప్పిస్తారా ?

గజపతి : నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి!

భద్రయ్య : [సవినయంగా] చిత్తం!

గజపతి : నీ అల్లుడెక్కడున్నాడు ?

భద్రయ్య : నాకు తెలియదు.

గజపతి : నీ ఇంటికి రావటల్లా?

భద్రయ్య : లేదు.

గజపతి : వచ్చినట్టు దాఖలా చూపిస్తే?

[భద్రయ్య మాట్లాడడు.]

గజపతి : ఇంతకాలంనుంచి నువ్వొక పెద్దమనిషి వనుకున్నా. రాడీలతో నువ్వు కూడ లాలూచీ అయ్యావన్నమాట.

భద్రయ్య : దైవసాక్షిగా చెప్తున్నా. నాకేం తెలియదు.

గజపతి : ఈసారి నీ అల్లుడు నీ ఇంటికొస్తే పట్టిస్తావా ?

[ భద్రయ్య మాట్లాడడు. ]

,, బెల్లంగొట్టిన రాయిలాగా మాట్లాడవేం ?

భద్రయ్య: ఏం మాట్లాడాలి?

గజపతి: అల్లుణ్ణి పట్టించాలి.

భద్రయ్య: (హృదయావేదన అణచుకుంటూ) సరే!

గజపతి: ఆమాట కాగితంమీద పెట్టు.

భద్రయ్య: ఎందుకులెండి. మాటంటే ఒకటీ, కాగితం మీద పెడితే ఒకటా?

గజపతి: నీ వేదాంతం ఇక్కడేం పారదు. మర్యాదకు మర్యాదే, వ్యవహారానికి వ్యవహారమే.

[భద్రయ్య ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. గజపతి భీమన్నకు సైగ జేస్తాడు.]

భీమన్న: (భద్రయ్య దగ్గరకు వచ్చి) రాస్తావా, రెండు వడ్డించాలా!

(భద్రయ్య ఒకసారి భీమన్నవైపుచూచి, ఒక నిట్టూర్పు విడిచి కిమ్మన కుండా కాగితం కలం తీసుకుంటాడు. కళ్లవెంట నీళ్లు తిరుగుతూ ఉంటాయి. కచ్చెళ్లతో కళ్లు తుడుచుకుంటాడు. కాగితంమీద కలం పెడతాడు; చెయ్యి వణుకుతుంది. "వ్రాయ్" అంటూ భీమన్న గద్దిస్తాడు. భద్రయ్య విపరీతంగా బాధపడుతూ చివరికి గుండెరాయిచేసుకుని కాగితం వ్రాసి గజపతి చేతికిస్తాడు. గజపతి కాగితం చదువుకొని డ్రాయరులో పెడతాడు.)

భద్రయ్య: (గాద్గదికంగా) వెళ్లమంటారా?

గజపతి: అందరితోపాటు నీవుకూడా కోట కాపలా కాయాలి.

భద్రయ్య: నేనసలే ఒంటరిగాణ్ణి. కోటకాపలాకొస్తే ఇల్లేంగావాలి. మా ఇంట్లో ఎవరూ లేరు. మమ్మాయి ఒక్కతే బిక్కు బిక్కుమంటూ పడిఉండాలి.

గజపతి : (వెకిలి నవ్వు నవ్వుతూ) వయసులో ఉన్నపిల్ల. బిక్కు బిక్కుమంటూ ఎందుకు పడి ఉండాలి? ఎవళ్ళో ఒకళ్లు జత ఉంటారు లే.

[భద్రయ్య వచ్చిన కోపాన్ని అణచుకుంటూ, జరిగిన అవమానాన్ని దిగమింగుతూ గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోబోతాడు.]

గజపతి : (అధికార స్వరములో) భద్రయ్యా! వెళ్ళటానికి వీల్లేదు.

(భద్రయ్య ఆగిపోయి గజపతివైపు చుర చుర చూస్తూ ఉంటాడు.)

,, క్షమాపణ వ్రాసి ఇవ్వు.

భద్రయ్య : (తీవ్రంగా) దేనికి?

గజపతి : నన్ను హత్య చెయ్యటానికి ప్రయత్నించినందుకు.

భద్రయ్య : (నిర్ఘాంతపోయి) నేను మిమ్మల్ని హత్యచెయ్యటానికి ప్రయత్నించానా?

గజపతి : ఇదివరకు ప్రయత్నించావో లేదో అదంతా అనవసరం. ఇకముందు అలాంటి ప్రయత్నం జరక్కుండా గ్యారంటీ కావాలి.

భద్రయ్య : 'నేను మిమ్మల్ని హత్యచెయ్యను' అని వ్రాసి ఇవ్వమంటారు. అంతేగా?

గజపతి : అంతేకాదు. రౌడీలతో కలిసి కుట్రపన్ని రాజా గజపతిగారిని చంపటానికి ఇదివరకు ప్రయత్నించానని, ఇప్పుడు నాతప్పు తెలుసుకుని మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడుతున్నానని.

భద్రయ్య : (ఆవేశంగా) ఇదంతా పచ్చి అబద్ధం, అలా వ్రాసి ఇవ్వను.

గజపతి : హుఁ, బాగా ఆలోచించుకో.

భద్రయ్య : బాగా ఆలోచించుకునే చెప్తున్నా.

గజపతి : చిక్కుల్లో పడతావ్.

భద్రయ్య : కానియ్, అలా వ్రాసి ఇస్తేమాత్రం చిక్కుల్లో పడనా ; ఆ కాగితంముక్క పట్టుకెళ్ళి కోర్టులో దాఖలుచేస్తే నా గతేం కావాలి ? మిమ్మల్ని ఎవళ్ళు చంపినా, ఆ కేసు నామీదికి రాదా ?

గజపతి : వస్తుంది. వస్తుందిగాబట్టే రాసివ్వమంటున్నా. వ్రాసిస్తే నా ప్రాణానికి నీ ప్రాణం హామీగా ఉంటుంది. నాకు వ్యతిరేకంగా జరిగే కుట్రల్లో నువ్వు పాల్గొనలేవు.

భద్రయ్య : నేనేకుట్రలోనూ పాల్గొనను. ఏ అబద్ధాలూ వ్రాసి ఇవ్వను.

గజపతి : అదే ఆఖరుమాటా ?

భద్రయ్య : అదే ఆఖరుమాట. నా వంట్లో ఊపిరుండగా అలాంటి అబద్ధాలు వ్రాసి ఇవ్వను.

గజపతి : సర్దార్ ! అరెస్టు చెయ్ వీణ్ణి.

భద్రయ్య : అదిరించి బెదిరించి అధికారం చలాయించి అబద్ధాలు రాయించుకుంటావా ? ఇదేనా నీ నీతి ? ఇదేనా నీ మర్యాద ? ఇదేనా నీ రామరాజ్యం ?

(భద్రయ్య ఆగ్రహావేశ పరవశుడై దెబ్బతిన్న త్రాచులాగా బుస పెడుతూ ఉంటాడు. భీమన్న భద్రయ్య చేతులకు బేడీలు వేస్తాడు.)

[ తెర ]

# ఆరో దృశ్యం

★

## భద్రయ్య ఇల్లు

[ నేపథ్యంలోనుంచి పాట-సరోజిని కుర్చీలో కూర్చుని విచారంగా పాట నాలకిస్తూ ఉంటుంది. కుర్చీముందున్న టేబుల్ మీద మరే వస్తువూ - ఆఖరికి టేబుల్ క్లాత్ కూడా-ఉండదు. ఎప్పుడు చూచినా కళకళలాడే ఆ ఇల్లు ఇప్పుడు వెలవెలపోతూఉంది. ]

ఏలా

ఈ లీలా

చల్లని వెన్నెల చల్లే జాబిలి
వెలవెలపోయిన దెలా ?
కారుమబ్బు లీ దారిన గలవని
జారిపోవగా నేలా?
సత్యమేవ జయతేయను సూక్తిని
సందేహించగ నేలా ?
ఎముకలు కొరకే హేమంతము చన
విమల వసంతము రాదా ?

[పాట అయిపోయినతరువాత సరోజిని టేబుల్ మీద ఉన్న పుస్తకం తీసుకొని తిరగేస్తూ ఉంటుంది. నారాయణ ప్రవేశిస్తాడు. అతని ముఖం

విచారంగా నిర్జీవంగా ఉంటుంది. పుస్తకం చదువుకుంటున్న సరోజిని తలయెత్తి నారాయణను చూస్తుంది. ఆమె చూపుల్లోని తిరస్కారభావం నారాయణ ఉదాసీనతకు మరింత దోహదం ఇస్తుంది. సరోజిని కనుబొమ్మలు చిట్లించుకుని మళ్ళీ పుస్తకం చదువుకుంటుంది. కూర్చోమని సరోజిని అనకపోయినా నారాయణ తనంత తానే టేబుల్ పక్కనున్న మరొక కుర్చీలో కూర్చుంటాడు. కొంచెంసేపటిదాకా ఉభయులు నిశ్శబ్దంగా ఉంటారు. ]

నారా : సరోజమ్మా !

సరోజిని : ఏమిటి ?

నారా : నువ్వుకూడా నాతో మాట్లాడదలుచుకోలేదా ?

సరో : నీలాంటి నాయకులతో నేనేం మాట్లాడతాను ఇంట్లో కూర్చొని అంటుకుండలు గీక్కునే ఆడదాన్ని ?

నారా : ( హృదయభారంతో నిట్టూర్చి ) అవును, నేనిప్పుడొక నాయకుణ్ణయిపోయాను.

సరో : అబద్ధమా ?

నారా : అబద్ధం ఏముంది. నిజమే. సర్దార్ కింద రెండో సర్దారునయ్యాను.

సరో : ( ఎత్తిపొడుపుగా ) ఇంకేం ! మంచి ఉద్యోగమే సంపాదించావుగా ?

నారా : అవును మరి. నాకింతకంటె ఇంకా పెద్ద ఉద్యోగం అవుతుందా ? నన్ను చూచి జనం అంతా గజగజ లాడుతున్నారు. నావెంట ఎప్పుడూ పదిమంది లారీలు పుచ్చుకుని కాపలా కాస్తున్నారు. బజారులో కూర్చున్న పెద్దలు

కూడా వంగి వంగి దండాలు పెడుతున్నారు. నిన్న మొన్నటి దాకా "నారాయుడూ" అని పిల్చినవాళ్ళు ఇవ్వాళ "నారాయణ దొరగారూ!" అని పిలుస్తున్నారు. నా బతుక్కి ఇంతకంటె ఇంకా దర్జా ఏం కావాలి?

సరో: ప్రసాదునుకూడా పట్టించకపోయూవా అయిదువేల రూపాయలు బహుమానం వచ్చేది?

నారా: (హృదయంలోని బాధ నణచుకొంటూ) పట్టిస్తా.

సరో: (కోపంగా లేచి) నీచుడా! చదువు చెప్పారనే విశ్వాసం కూడా లేదు. నీ పొట్టకోసం ఎవళ్ళగొంతు కొయ్యమన్నా కోస్తావు. ఛీ! పో బైటికి!

(నారాయణ అలాగే తలవంచుకుని ఉంటాడు)

,, అసలు నువ్వేగడపెందుకు తొక్కావు? ఆడది ఒంటరిగా ఉంది పట్టుకుందామనేగా? పోతావా పోవా?

(నారాయణ లేస్తాడు. సరోజిని అతని ముఖంవైపు చూస్తుంది. అతని కన్నులవెంట నీళ్ళు బొటబొట కారుతూ ఉంటాయి. సరోజిని నిర్ఘాంత పోతుంది. నారాయణ పసిపిల్లవానిలాగా వెక్కి వెక్కి ఏడుస్తూ ముక్కులు చీదుకుంటాడు.)

నారా: వెళ్తున్నా. చిన్నప్పటినుంచి చెల్లెలులాగా ఉన్న దానివి చివరికి ఆ మాటకూడా అన్నావు. నీ తప్పేముంది? నేను చేసినపని అలాంటిది. ఎక్కడికెళ్ళినా నాకి దేగతి. ఇంటా బయటా అంతా నన్ను అనుమానిస్తున్నారు. నన్నొక సి. ఐ. డి. గా చూస్తున్నారు. ఎప్పుడో చస్తే ఈ ఊరికి నా పీడా లేకుండాపోయేది. చావలేక ఈ పాడు బతుకు బతుకు తున్నా. వెళ్లిపోతాన్లే అమ్మా; వెళ్లిపోతా.

(పైపంచెతో కన్నీళ్ళు తుడుచుకుంటూ వెళ్తూ ఉంటాడు. సరోజిని మనస్సు కరిగి నీరైపోతుంది. గబగబా నారాయణ దగ్గిరకొచ్చి.)

సరో: అన్నయ్యా!

నారా: (పిచ్చివాడిలాగా సరోజినివైపు చూచి ఏడుస్తూ) ఏంటమ్మా! ఏఁవన్నావు? నన్ను అన్నయ్యా, అని పిలిచావా? నా సొంత చెల్లెలే నన్ను అన్నా అని పిలవటం మానేసింది. వద్దమ్మా, వద్దు. నన్నట్టా పిలవవద్దు. నేను పాపాత్ముణ్ణి, దుర్మార్గుణ్ణి.

సరో: కాదు అన్నా! నేనే పొరపాటు పడ్డాను. నిన్ను సరిగా అర్థం చేసుకోలేక పోయాను, రా కూర్చో. (అంటూ చెయి పుచ్చుకొని తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెడుతుంది.)

నారా: నీకు తెలియదమ్మా! నన్ను కొట్లోబెట్టి ఎట్టా గొట్టారో, ఎంత హింసించారో, నీకు సరిగా తెలియదమ్మా. పక్కటెముకలన్నీ విరిగిపోయినై. నాకంటె ఇంకా ఎక్కువ దెబ్బలు తిన్నవాళ్ళున్నారనుకో! ఏం చేస్తాను, నా కర్మ. ఆ బాధ కాగలేక మొదట కొంచెం మెత్తపడ్డా. ఆ మెత్తపడటమే చివరికి నన్నిట్టా తయారుచేసింది. ఇంత కాలంనుంచి ప్రసాదుదగ్గిర చదువుకొని ఆయనమాట దక్కించలేకపోయాను. ఆయన అక్కడ అన్ని కష్టాలు పడతాఉంటే ఇక్కడ నేను ఎద్దులాగా మువ్పూటా తిని తిరుగుతున్నా. ఎవళ్ళకి ముఖం చూపెట్టాలన్నా సిగ్గుగా ఉంది. పైకి నాదగ్గర ఎన్ని మంచి మాటలు చెప్పినా లోలోపల అంతా తిట్టుకొంటన్నారు.

సరో: తిట్టుకుంటే తిట్టుకున్నారులే. నువ్వేం విచారపడకు.

నారా: అదిగాదు సరోజమ్మా! నువ్వే చెప్పు, ఊళ్ళోవాళ్ళకి నేనేం అన్యాయం చేశాను? దెబ్బలకి తట్టుకోలేకపోయాను! పిరికిపారాను. గుండె నిబ్బరం లేదు. జారిపోయాను. నిజమే! వాళ్ళు రమ్మన్న చోటికల్లా వెళ్ళాను; కాని ఇంతవరకు నేనొక్కడిమీదకూడా చెయి చేసుకోలేదమ్మా. మీ అందరినీ వదలిపెట్టి ఆ ముఠాలో జేరినందుకు ఎంత కుళ్ళి కుళ్ళి చస్తున్నానో నా బాధ నాకు తెలుసు. నేను ఎలాగూ బతకను. ఒక్కటేనమ్మా నాకోరిక. నన్ను మీ ఇద్దరూ అనుమానించకుండా ఉంటే అంతేచాలు. సంతోషంగా చస్తాను. నేను పిరికిపందనే. కాని ద్రోహినికాదు. ఈ ఒక్కముక్క ప్రసాదు చెవిలోకూడా వెయ్యమ్మా.

(కళ్ళు తుడుచుకుంటూ గబగబా లేచి వెళ్ళిపోతాడు. "నారాయణన్నా! నారాయణన్నా!" అని సరోజిని పిలుస్తూఉన్నా ఆగడు. సరోజిని నివ్వెరపోయి నారాయణ వెళ్ళినవైపే చూస్తూ నుంచుంటుంది.

శేషగిరి దర్జాగా సిగరెట్టు తాగుతూ ప్రవేశిస్తాడు. పరధ్యానంలో ఉన్న సరోజిని శేషగిరిని చూడదు.)

శేషగిరి: ఏఁవిటి. అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?

(సరోజిని ఉలిక్కిపడి వెనక్కి తిరుగుతుంది.)

,, ఇప్పటికైనా నామాటవిను, ఎందుకొచ్చిన అవస్థ?

సరో: ఏం చెయ్యమంటావు?

శేషగిరి: ప్రసాదు ఎక్కడున్నాడో చెప్పు; ఎందుకు అనవసరంగా అందరినీ బాధపెడతావ్?

సరో : ఇదేనా నువు నాకు చెప్పాల్సిన సలహా ?

శేషగిరి : ఏం చెయ్యను ? అంతకంటె గత్యంతరము లేదు. ఊళ్ళో అందరి పరిస్థితి చూస్తూనే ఉన్నావుగా ? పోనీ నువు చెప్పకుండాఉండి ప్రసాదును బ్రతికించగలవా ?

సరో : చెప్పి బ్రతికించ గల్గునా ?

శేషగిరి : చెప్పినా బ్రతికించలేవు. చెప్పకపోయినా బ్రతికించ లేవు.

సరో : అలాంటప్పుడు ఇంకా నేను చెప్పటం ఎందుకు ?

శేషగిరి : నీ ప్రాణం రక్షించుకోటానికి.

సరో : నా ప్రాణంకోసం నాభర్త ప్రాణాన్ని బలిపెట్టమంటావా?

శేషగిరి : ఎందుకీ పెద్దపెద్ద సిద్ధాంతాలు ? కాస్త నిదానంగా ఆలోచించు, నీకే తెలుస్తుంది. నువ్వు చెప్పకుండా ఉంటంవల్ల నీభర్త బతికితే ఆల్‌రైట్. చెప్పకుండానే ఉండు. మంచిదే నేను కాదనను. కాని ఉన్న వాస్తవం ఏమిటి ? నువు చెప్పకపోయినా దిబ్బరాజుగారి సైన్యం అతన్ని వదిలిపెట్టదు. ఎప్పుడో ఒకప్పుడు పట్టుకుంటారు. కాల్చేస్తారు. అదెలాగూ తప్పదు. అనవసరంగా మధ్య నీప్రాణం పోగొట్టుకోవటం ఎందుకు ? ఇదేనా తెలివంటే ?

సరో : (వ్యంగ్యంగా) కాదు. భార్య భర్తను పట్టించి కాల్పించ టమే తెలివి.

శేషగిరి : సెంటిమెంటల్ నాన్సెన్స్! (అంటూ చేతిలోఉన్న సిగరెటు విసిరి నేలకు కొట్టి) నీకు స్వయంగా తెలియదు. చెపితే వినవు. అన్నిటికీ నీ పంతమే నెగ్గాలంటావు. ఇది ప్రాణంతో పని.

ఒకసారికి పదిసార్లు ఆలోచించు. నీమూలంగా కొంప నాశనమై పోతుంది.

సరో: ఇప్పుడు నేనేం చేశాను.

శేషగిరి: ఇంట్లో కూర్చొంటే నీకేం తెలుస్తుంది? గజపతి గారితో పూటకొక అబద్ధమాడి ఇంతవరకు నెట్టుకొచ్చా. ఇక నానుంచి కాదు. నేను లేకపోతే ఎప్పుడో నిన్ను బిస్మిల్లా చేసేవాళ్లు. కిరసనాయిలు పోసి ఎప్పుడో ఈ కొంప తగలబెట్టేవాళ్లు.

సరో: ఇదంతా నా మూలంగానే నంటావ్?

శేషగిరి: నీ మూలంగా గాకపోతే నా మూలంగానా? పెళ్లికి ముందే ఇదంతా నీకు పూసగుచ్చినట్టు చెప్పా. అప్పుడు నామాటనీతలకెక్కలా. ఇప్పటికైనావాడెక్కడుందీచెపితే...

సరో: ఎక్కడుందీ నాకసలు తెలియదు. తెలిసినా చెప్పను.

శేషగిరి: తెలుసు. అబద్ధం ఆడుతున్నావు.

సరో: (కోపంగా) నిజం చెప్పడం నీదగ్గరే నేర్చుకోవాలి. మనిషై పుట్టినతరువాత కాస్త జ్ఞానముండాలి. మొన్నటిదాకా కుక్కిన పేనులాగా పడిఉండి ఊళ్లోవాళ్లందర్ని నమ్మించి గొంతుకోశావు. నీ పెత్తనంకోసం కన్నతండ్రినికూడా జెల్లో పెట్టించావు. ఛీ! నీ మొఖంచూసినా పాపం.

శేషగిరి: నోర్మూయ్; (లాగి లెంపకాయ వేసి) చచ్చేదానివి నోరు మూసుకొని చావక నా మీదబడి ఏడవటం ఎందుకు?

(అంటూ కోపంగా బయటికి వెళ్లిపోతాడు. సరోజిని విచారంగా వచ్చి కుర్చీలో కూలబడుతుంది. హడావుడిగా నారాయణ ప్రవేశిస్తాడు. అతని చేతిలో ఏదో పత్రిక ఉంది. ముఖంలో శోకం మూర్తీభవించింది.)

నారా: అమ్మాయి, సరోజినీ!

సరోజిని: (భయకంపితురాలై లేచి) ఏఁవిటి అన్నా! ఏఁవిటి?

నారా: (ఏడుస్తూ) ఏం ఉంది, కొంప మునిగింది.

సరో: (ఆదుర్దాగా) ఏం జరిగింది?

నారా: ప్రసాదుని పొట్టబెట్టుకున్నారు.

సరో: (నిశ్చేష్టురాలై) ఆఁ!

నారా: కాల్చి చంపేశారు.

(సరోజిని కుప్పలాగా కూలిపోతుంది)

సరో: (ఏడుస్తూ) ఎక్కడ?

నారా: ఇదిగోనమ్మా పేపరులో ఉంది.

(పేపరు సరోజిని చేతికిస్తాడు. సరోజిని పేపరుతీసుకొని చదవాలని ప్రయత్నిస్తుంది. కాని ఆమె కన్నీటిధారే ఆమె చూపుకు అవరోధం అయింది. పైటచెంగుతో రెండుమూడుసార్లు కన్నీళ్ళు తుడుచుకొని పత్రికలోపడిన వార్తను చదువుతూ ఉంటుంది.)

నారా: ఏంచేస్తాం తల్లీ? ఇంతకీ మనరోజులు బాగాలేవు. ఎంత ఓపిక; ఎంత తెలివి? ఎప్పుడు చూచినా నవ్వుతూ ఉండేవాడు. ఎందుకూ పనికిరాని నాలాంటివాళ్ళం బతికాం; బంగారంలాంటి బిడ్డ చచ్చిపోయాడు.

(సరోజిని పొంగిపొరలే దుఃఖంతో "అన్నా" అని ఆపైన మాట్లాడ లేక పోతుంది.)

[ తెర ]

# ఏడో దృశ్యం

★

## దేవిడీ

[ ముక్కంటి బల్లలు వగైరా తుడిచి వస్తువులన్నీ చక్కగా సర్దుతూ ఉంటాడు. నారాయణ ప్రవేశిస్తాడు. అతనిముఖం చాల గంభీరంగా, విషాదపూరితంగా ఉంటుంది. ]

ముక్కంటి : నారయ్యన్నా ! ఏంటి ఇయ్యాల పొద్దున్నే వచ్చావ్ ?

( నారాయణ మాట్లాడడు. అక్కడున్న ఆయుధాలను ఏకాగ్ర దృష్టితో చూస్తూ ఉంటాడు. )

,, పొద్దున్నే లేసి నీ మొకంమే చూశా. ఏమవుద్దో ఏంవో.

నారా: ( విసుగ్గా ) అనండిరా అందరూ నన్నే అనండి. అందరికీ నేనేగా లోకువ. ఇంకెన్నాళ్ళుంటాయిలె అనండి !

ముక్కంటి : ఇయ్యాలేందో కొత్త కొత్తగా మాట్లాడ తన్నావ్. ఇంకేదన్నా పెద్ద ఉద్యోగం అయిందా ఏం ? పేదాణ్ణి, నన్ను మర్చిపోవద్దు నారయ్యన్నా !

నారా : నిన్ను మర్చిపోతానా ! మన ముఠాలోనుంచి ఈ ముఠాలో కలిసిన గాడిదలం మనిద్దరమేగా ?

ముక్కంటి : ఏంటీ? మనం గాడిదలమా? ఏ గాడిదంటాడు ఆమాట? అసలు తెలివంటే మనదే. ఎప్పుడూ గెల్పె కోవులోనే ఉంటాం.

ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటి కామాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుగువాడే ధన్యుడుసుమా తే.

(అంటూ చివరిచరణాన్ని కందార్థంలాగా ఒక పిచ్చిరాగం తీసి పాడ తాడు.)

,, తెలిసిందా? అదే మన సిద్ధాంతం. మన దెబ్బంటె ఏఁవనుకున్నావో, ఏఎండ కాగొడుగు పడతాం.

నారా : ఏఎండ కాగొడుగుపట్టే చివరికి రెంటికిచెడ్డ రేవడు అయ్యాం.

ముక్కంటి : అక్కడేఉంది అసలు చిక్కు. దాన్ని విడదీసు కుంటేనే తెలివి.

నారా : (విసుగ్గా) ఏఁవిటిరా నీ సొల్లువాగుడు. పో, నీపని నువ్వు చూసుకో.

ముక్కంటి : ఓ సబ్బో! నా మీద నారయ్యన్నకి కోపం వచ్చింది. దూపం వెయ్యాలి.

(అంటూ లోపలికి వెళ్తాడు. నారాయణ ఒకమూలనున్న రివాల్వరు తీసి లోడ్ చేస్తూ ఉంటాడు. ముక్కంటి వెనకగావచ్చి చూచి మెల్లగా ఒక పక్కకి తప్పుకుంటాడు. నారాయణ రివల్వారును లోడ్ చేసి తన గుండెకు సూటిగా గురిపెట్టి కాల్చుకో బోతాడు.)

ముక్కంటి : (మంచినీళ్ల గ్లాసుతో ప్రవేశించి అమాయకంగా) నారయ్యన్నా ! కాసిని మంచినీళ్లు తాగు.

(నారాయణ ఉలిక్కిపడి ముక్కంటివైపు చూస్తాడు.)

నారా : (కోపంగా) ఎందుకు మంచినీళ్లు ? ఇప్పుడెవరు తెమ్మన్నారు ?

ముక్కంటి : ఆఁ ఏఁవీ లేదు. ఎంత లేదన్నా ఒక్కరోజు పయాణమూ, ముందే కాసిని మంచినీళ్లు తాగి ఎత్తే మంచిదని.

నారా : ఎక్కడికి ?

ముక్కంటి: అక్కడికే సొర్గానికి (నారాయణ తెల్లబోయి ముక్కంటి వైపు చూస్తాడు. అమాయికంగా) చాలదూరాబారప్పయాణం గాదూ! కాస్తముందే జాగర్తపడాలి. లేకపోతే నీ జీవాత్మ మళ్ళీ చాలా బాదపడుద్ది. దారిలో దప్పికై గొంతు ఎండిపోయి, నాలిక పిడచగట్టి గిలగిల గిలగిల తన్నుకుంటది. ఒకవేళ సచ్చిబతికి అక్కడిదాంకా చేరినాఁ ఆ సొర్గంలో ఉండే పరమాత్మ నీళ్లులేక ఎండిపోయిన జీవాత్మల్ని లోపలికి రానియ్యడు. అప్పుడు మళ్లీ దేఁవుడా అంటూ ఈ బూలోకానికి తిరిగొచ్చి ఈ మాయ కాయంలోనే జొరబడాలి. అప్పటిదాకా ఈ మాయకాయం నీకోసం ఇంకా ఇక్కడే కనిపెట్టుకుంటదా ? జీవాత్మ అటుదాటగానే ఇటు దీన్ని వల్లకాటికి చేర్చి తగలేస్తారు. అటు సొర్గంలోకి ఎల్లటానికీ వీల్లేక, ఇటు బూలోకంలో ఉంటానికీ తావులేక, అప్పుడు జీవాత్మపడే కష్టాలు ఆ పరమాత్మకే ఎరుక. అందుకనే కాదు నారయ్యన్నా ! సచ్చిపోయేటప్పుడు మన పెద్దాళ్ళు నోట్లో

కాసిని గంగపోస్తాను. (మంచినీళ్ళ గ్లాసు చూపుతూ) ఇదిగో మంచినీళ్ళు. ఒక్క గుటకేసి తర్వాత నీపని కానియ్.

(నారాయణ కుప్పలాగా బల్లమీద కూలబడతాడు. తన చేతిలోనుంచి రివాల్వరు జారి కిందపడుతుంది)

ముక్కంటి : (గంభీరంగా) ఏం? సతికిలపడ్డావేం? సచ్చిపోటానికి బయపడతావేం? మొగపుటక పుట్టలా?

నారా : (ముక్కంటి ఎత్తిపొడుపు మాటలను భరించలేక) ముక్కంటీ!

ముక్కంటి : లోకులు ఏదో అనుకుంటున్నారని నిన్ను నువ్వే సంపుకుంటావా? పిరికితనంనుంచి బయటపడాలనుకున్నావు కాని మళ్లీ పిరికిపనే చేస్తున్నావు. తనకు తాను కాల్చి సంపుకోటం మగతనంకాదు. గొప్పతనంకాదు. వట్టి పిరికి తనం. ఎందుకూ పనికిరాని సవట చేసేపని.

నారా : (ఆశ్చర్యపోయి) ముక్కంటీ! నా మనసులోమాట నీకెలా తెలిసింది?

ముక్కంటి : తెలుసు. అంతా తెలుసు. నీ పక్కనేఉండి నీ సంగతంతా తెలుసుకుంటానే ఉన్నా. అంతగా సావాల్సివస్తే ఈ దిక్కుమాలినసావు ఎందుకు సావాలి? వీసుల్లాగానే సద్దాం.

(నారాయణ ఆశ్చర్యపోయి ముక్కంటివైపు ఎగాదిగా చూస్తూ ఉంటాడు.)

ముక్కంటి : నువు సరోజమ్మతో ఏం మాట్లాడిందీ మనమాష్టరు గారికి తెలిసింది. అయిందేదో అయింది. ఇప్పటికే నా నిన్ను మంచి ధైర్యంగా ఉండమన్నాను.

నారా: (పట్టరాని సంతోషంతో దిగ్గునలేచి) నిజంగానా ముక్కంటీ?

ముక్కంటి: ఇష్! మళ్లీ ఎక్కడా అనమాకు కొంప మునుగుద్ది.

నారా: (ఏదో ఆలోచిస్తూ) అయితే నీవిక్కడ చేరింది......

ముక్కంటి: (అటూ ఇటూ చూస్తూ) గప్‌చిప్ సాంబారుబుడ్డీ!

నారా: (తల పంకిస్తూ ఆశ్చర్యంగా) ఇదన్నమాట మీ ప్లాను. ఈ మట్టిబుర్ర కర్థంకాలేదు గాని, మాష్టరుగారప్పుడు చెప్పనే చెప్పారు కోటకు తూటు పడుతుందని. తమ్ముడూ! (అంటూ ముక్కంటిని కౌగిలించుకుని) నువ్వెంత మంచివాడివి. నువ్వింత గొప్పవాడివని నాకు తెలియదు. ముక్కంటి అంటే నివురుగప్పిన నిప్పు అని ఇప్పుడు తెలుసుకున్నా.

గజపతి: (వార్తాపత్రిక చూస్తూ ఠీవిగా ప్రవేశించి చిరునవ్వుతో) ఏమిట్రా, చెవులు కొరుక్కుంటున్నారు?

ముక్కంటి: (వెంటనే ధోరణిమార్చి చేతులు నలుపుకుంటూ నవ్వుతూ) హీ హీ హీ, ఏంలేదు దొరా! అదే - ఆ రామాపురం చిలక. దొరగారివల్లో బడకుండా ఎగిరిపోయిందే -

గజపతి: ఊఁ.

ముక్కంటి: అదే-దానికి ఎట్టా టోపీ వేద్దామా అని.

గజపతి: ఏడ్చారులే వెళ్లండి.

(ముక్కంటి, నారాయణ పక్కకెళతారు. గజపతి యథాస్థానంలో కూర్చొని యథాప్రకారం పానసేవ చేస్తూ ఉంటాడు.)

గజపతి: సర్దార్!

భీమన్న : జీ హుజూర్!

గజపతి : చూడు మన తడాఖా.

[అంటూ హుషారుగా పేపరు భీమన్న చేతికిస్తాడు.]

భీమన్న : [పేపరు చదువుకొని అమితానందంతో] పీడా వదిలి పోయింది. కడుపులో చల్ల కదలకుండా గుండెమీద చెయ్యి వేసుకుని ఇక మనం హాయిగా నిద్రపోవచ్చు. జయ్ గజపతి మహారాజుకీ జయ్ !

గజపతి : ఏమిటోయ్ ఈ పిచ్చికేకలు ?

భీమన్న : ఇంకేముంది హుజూర్ ! అసలు ముఠానాయకుడు ప్రసాదే చచ్చిపోతే ఇంకా మన కత్తికి ఎదురేముంది ?

గజపతి : అదిగాదోయ్ మందబుద్ధీ!

భీమన్న : చిత్తం హుజూర్.

గజపతి : వాడు చావలేదోయ్. ఇంకా బతికే ఉన్నాడు.

భీమన్న : చిత్తం హుజూర్. (మళ్ళీ చప్పున గుర్తుకువచ్చి) అదేమిటి సార్, అలా అంటారు ? నన్ను మరీ మెడకాయమీద తలకాయలేని మనిషికింద జమకట్టారే. పేపరులో చచ్చాడని పడితే ఇంకెలా బతుకుతాడు ?

గజపతి : అందుకేగాదోయ్, నీకు మందబుద్ధి అని పేరుపెట్టింది. శత్రువుల్ని ముందే హడలగొట్టడానికి అది మనం వేసిన స్టంట్.

భీమన్న : పేపరువాళ్ళుకూడా అలాంటిపని చేస్తారా హుజూర్?

గజపతి : చేస్తారోయ్! పైసా, పైసా. "పైసా హైతో పరిస్తాన్, పైసా నహీంతో కబ్రస్తాన్" తెలిసిందా ?

భీమన్న : జీ హుజూర్ !

గజపతి : ఆల్ రైట్ ! (అధికార స్వరంతో) ప్రసాద్ ఆచూకీ తీశావా ?

(భీమన్న మాట్లాడకుండా తలవంచుకుంటాడు)

,, మాట్లాడవేం ?

భీమన్న : ఏం మాట్లాడమంటారు. ప్రసాదు ఆచూకీ తీయటం సాధ్యంగాదు.

గజపతి : ఏం ?

భీమన్న : ఇంటిదొంగను ఈశ్వరుడుకూడా పట్టుకోలేడు హుజూర్ !

గజపతి : ( ఆశ్చర్యంగా ) ఇంటిదొంగ ?

భీమన్న : అవునండీ.

గజపతి : ఎవరు ?

భీమన్న : శేషగిరి.

గజపతి : (ఆశ్చర్యంగా) శేషగిరి !

భీమన్న : ప్రసాదు బావే కదండీ.

గజపతి : అయితే ?

భీమన్న : ఏముంది, రెండావుల దూడలాగా అటూ ఇటూ నాటకమాడుతున్నాడు.

గజపతి : నీకెలా తెలుసు ?

భీమన్న : ఇప్పటికి ప్రసాదుకోసం పదిసార్లు దాడిచేశాం. ఒక్కసారికూడా పట్టుకోలేకపోయ్యాం.

గజపతి : సిగ్గులేక ఇంకా చెప్పొచ్చావ్ ?

భీమన్న : అదికాదు హుజూర్ ! మనం రహస్యాలు దాచలేక పోతున్నాం. మన ప్లానులన్నీ ఎప్పటికప్పుడు వాడికి తెలిసి పోతున్నయి. ఎంత ధైర్యం లేనిదే ప్రసాదు ఊళ్లోకి వచ్చి పోయ్యాడు ?

గజపతి : వస్తే ఎందుకు పట్టుకోలా ?

భీమన్న : ఎలా పట్టుకుంటాను సార్ ! శేషగిరి మీ పర్సనల్ సెక్రటరీ. ఆయన ఇంట్లోకి వెళ్ళటానికి నాకధికారమేముంది?

గజపతి : (తల పంకిస్తూ) ఐ సీ.

భీమన్న : శేషగిరి ఇంట్లో మారణాయుధాలు దొరికినా ఏం చెయ్యలేకపోయాం. నన్ను సరోజిని ఎగతాళి జేసినా అరెస్టు చేయలేకపోయాను. వీరయ్యను అరెస్టు చేస్తానంటే మీరు వద్దన్నారు. శేషగిరి చెప్పిన సలహా విన్నారు. చివరికి పిట్ట మన చేతుల్లోనుంచి తుర్రుమ జారిపోయింది.

గజపతి : ఎవరు ?

భీమన్న : వాడేనండి, వీరయ్య. ఊళ్ళోనుంచి పరారై పోయ్యాడు. ఇక మనం చేయగలిగిందేముంది ?

గజపతి : (కోపంగా) అచ్ఛా ! రాసియ్ శేషగిరిని. వాడి పకడ్బందీ ఏమిటో తేల్చుకుంటా.....ప్రసాదుకోసం మళ్లీ దాడి చేయించు.

భీమన్న : రాత్రే మన సైనికుల్ని పంపించాను హుజూర్ ! ఈ పాటికి మళ్లీ తిరిగి వస్తూనే ఉండాలి.

గజపతి : ఎక్కడికి పంపించావ్ ?

భీమన్న :అక్కడికే...నిన్న మన వేగులవాళ్లు కబురు తెచ్చారే...

గజపతి : క్వైట్ రైట్! జావ్!

(భీమన్న సలాంచేసి వెళ్లిపోతాడు. ఇంతలో ఇద్దరు భటులు ప్రసాదును పట్టుకొస్తారు. అతని శరీరమంతా రక్తసిక్తమై ఉంది. గుడ్డలు చినిగి పేలికలయ్యాయి. గడ్డం బాగా పెరిగింది. చేతులకు బేడీలువేసి ఉన్నాయి. ఎండలో, కొండల్లో తిరగటంవల్ల ఎర్రటి సుకుమార శరీరం మొద్దుబారి నలుపుకు తిరిగింది. బక్కచిక్కి పోయ్యాడు. కండ్లు లోపలికి పీక్కుపోయ్యాయి. చూడగానే మనిషిని పోల్చుకోవటం సాధ్యంకాదు.)

గజపతి : ఎవడు వాడు?

భటుడు : ఎవడైందీ తెలియదండీ!

గజపతి : ఎక్కడ దొరికాడు?

భటుడు : చిట్టడవిలో.

గజపతి : (ప్రసాదు దగ్గరకొచ్చి) ఎవరు నువ్వు?

ప్రసాదు . ఆంధ్రుణ్ణి.

గజపతి : నీపేరు?

ప్రసాదు : నీ కనవసరం.

గజపతి : చెప్పాలి.

ప్రసాదు : చెప్పను.

గజపతి : నువ్వు చేసేపని?

ప్రసాదు : పోరాటం.

గజపతి : ఎవరిమీద?

ప్రసాదు : నీమీద.

గజపతి: పటప్!...నీ ఊరు?

ప్రసాదు: అడవి.

గజపతి: నీకు తిండిపెట్టే దెవరు?

ప్రసాదు: భూదేవి.

గజపతి: తలిదండ్రులు లేరా?

ప్రసాదు: ఉన్నారు.

గజపతి: ఎవరు?

ప్రసాదు: ప్రజలు.

గజపతి: కొత్తరాజ్యంలో నీ హోదా ఏఁవిటి?

ప్రసాదు: ఒక సేవకుణ్ణి.

(ఇంతలో భీమన్న ప్రవేశించి ప్రసాదును చూచి మహానందంతో)

భీమన్న: దొరికావన్నమాట!

గజపతి: ఎవరితను?

భీమన్న: వీడేనండి ప్రసాదు.

("ప్రసాద్!" అంటూ గజపతి ఒక పిచ్చికేక వేస్తాడు)

గజపతి: ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి దొరికావు! ఆరు మాసాల నుంచి నానాగడ్డి కరిపించావుగదరా...సర్దార్!

భీమన్న: హుజూర్!

గజపతి: వీణ్ణి తీసికెళ్ళి ఇంటరాగేషన్ ప్రారంభించు.

(భీమన్న ప్రసాదుని లోపలికి తీసికెళ్తాడు. విజయోత్సాహంతో గజపతి పొంగిపోతూ ఉంటాడు. చేతులు నలుపుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వుతూ ముక్కంటి ప్రవేశం.)

ముక్కంటి : ఇనాం ఇప్పించాలి దొరా!

గజపతి : దేనికిరా ఇనాం? (సంతోషంగా)

ముక్కంటి : ఇయ్యాల పెద్దపండగండీ!

గజపతి : ఏం పండగ?

ముక్కంటి : రావణాసురుడు దొరికాడుగదండీ. అబ్బ! నాకళ్ళు సల్లబడ్డయి. ఇక మనూరంతా కంటినిండా నిద్రపోద్ది. నేనూ నాపెళ్ళాం ఇయ్యాల పండగచేసుకుందాం అనుకున్నామండీ. ఏలినోరు ఇనాం ఇప్పించాలి.

(గజపతి సంతోషంగా జేబులోనుంచి ఒకరూపాయి తీసి గిరా టేస్తాడు.)

(క్రిందపడిన రూపాయిని తీసుకొని కళ్ళకద్దుకొని) దొరగారూ! ఇయ్యాల ఊరందరికీ సెలవిప్పించాలి. ఆటల్తో పాటల్తో అంతా జల్సా సెయ్యాలి.

గజపతి : అలాగే ఎవడురా అక్కడ?

భటుడు : జీ హుజూర్!

గజపతి : ఊరంతా చాటింపు వేయించు. ఊరందరికీ ఇవాళ పండగ. అందరికీ ఇవ్వాళ సెలవు. ఇంటింటా దీపాలుపెట్టి ఆనందోత్సవం చెయ్యాలి.

భటుడు : చిత్తం!

గజపతి : వెళ్ళు.

(సిగరెట్టు ముట్టించుకుని హుషారుగా పచార్లు చేస్తూఉంటాడు.)

,, సర్దార్!

భీమన్న : జీ హుజూర్ !

గజపతి : ఇంటరాగేషన్ అయిందా ?

భీమన్న : చెయ్యాల్సిందంతా చేశాం. వాడి నోటినుంచి ఒక్క మాటకూడా బయటికి లాగ లేకపోయ్యాం.

గజపతి : సరే. ఇక్కడికి తీసుకురా.

భీమన్న : చిత్తం.

(లోపలికి వెళ్లి ప్రసాదును తీసుకొస్తాడు. ప్రసాదు నోటివెంట నెత్తురు వరదకట్టి కారుతూ ఉంటుంది. గజపతి భీమన్నను బయటికి వెళ్ళమని సైగ చేస్తాడు. భీమన్న వెళ్ళిపోతాడు.

గజపతి ప్రసాదుదగ్గరకు వెళ్లి అతని భుజంమీద చేయివేసి చిరునవ్వు నవ్వుతూ లాలనగా)

గజపతి : నీ సంగతంతా నాకు తెలుసు. నువ్వు చాలా మంచి వాడివి. చాలా బుద్ధిమంతుడివి. చక్కగా చదువుకున్నావు. నీకు ఏ ఉద్యోగం కావాలంటే ఆ ఉద్యోగం ఇప్పించేవాణ్ణి. అనవసరంగా నామీద కత్తిగట్టి చెడిపోయావు.

ప్రసాదు : చెడిపోయిందెవరో చరిత్రే నిర్ణయిస్తుంది.

గజపతి : నిన్ను చూస్తే నాకు నిజంగా జాలివేస్తుంది.

ప్రసాదు : (వ్యంగ్యంగా) అవును అసలే జాలిగుండె.

గజపతి : పాపం కొత్తగా పెళ్లి జేసుకున్నావు. ఏం లాభం ? ఒక్కరోజుకూడా మీ మొగుడు పెళ్లాం కలిసుండలా. పెళ్లి పీటలనుంచే పరారయ్యావు. ఏ సుఖం అనుభవించకుండా ఇంత చిన్న వయస్సులోనే చచ్చిపోవడం ఎందుకు ?

ప్రసాదు : నీ క్రింద బానిసగా బతికే కంటె చావే మేలు.

గజపతి: శానిసగా ఎందుకు బతకాలి? నువ్వు కోరుకున్న ఉద్యోగం ఇస్తాను. నువ్వు కోరుకున్న పొలం పాతికెకరాలు ఇస్తా. హాయిగా-కులాసాగా కాలుమీద కాలేసుకొని కాలక్షేపం చెయ్యొచ్చు. ఎందుకొచ్చిన బాధ ఇదంతా? నీ ముఠాలో ఉన్న మిగతావాళ్ల పేర్లుకూడా చెప్పేసెయ్. శుభ్రంగా బతికిపోతావ్.

ప్రసాదు: ప్తూః! ముమ్మాటికీ గజపతివనిపించావు. నీ బుద్ధి, నీ స్వభావం చక్కగా బయట పెట్టుకున్నావ్.

గజపతి: (కోపంగా) జాగ్రత్త! ఇప్పుడు నీ ప్రాణం నా చేతిలో ఉంది. తెలుసా?

ప్రసాదు: తెలుసు, బాగా తెలుసు.

గజపతి: నీతోపాటు నీ కొత్తరాజ్యంకూడా ఖూనీ అవుతుంది.

ప్రసాదు: కాదు. నేను చస్తే నాలాంటివాళ్ళు వెయ్యిమంది పుడతారు. కొత్త రాజ్యాన్ని సుస్థిరంగా నిల్పుకుంటారు. దోపిడినీ, దారిద్ర్యాన్నీ నిర్మూలించి భూలోకాన్ని స్వర్గలోకంగా మారుస్తారు.

గజపతి: సర్దార్!

భీమన్న: జీ హుజూర్!

గజపతి: వీణ్ణి తీసికెళ్ళి ఉరితియ్యి!

భీమన్న: చిత్తం!

గజపతి: వీడి శవాన్ని ఊరంతా ఊరేగించు.

భీమన్న: చిత్తం!

గజపతి: వీడి తల నరికి కోటగుమ్మానికి కట్టించు.

భీమన్న: చిత్తం.

గజపతి: పో, వెళ్ళు.

(భీమన్న ప్రసాదును తీసికెళ్తాడు. గజపతి కుర్చీలో కూర్చొని ముక్కంటి గ్లాసులోపోసి యిచ్చిన డ్రింకు సేవిస్తూ ఉంటాడు.)

ముక్కంటి: ధొరగారూ!

గజపతి: ఏంవిటిరా?

ముక్కంటి: (తలగోక్కుంటూ) తెలివితక్కువ మొద్దుని ఒక్క మాటడుగుతా.

గజపతి: ఏంవిటి?

ముక్కంటి: చిక్కక చిక్కక చిక్కాడు. చాల తేలిగ్గా వదలి పెట్టారు దొరా. ఇంకా నాకచ్చ తీరలా.

గజపతి: ఏం చెయ్యమంటావు? అంతకంటె పెద్దశిక్ష ఏముంది?

ముక్కంటి: అది ఏవంత పెద్దసిచ్చ బాబూ! ఒక్కదెబ్బతో ఉరతీత్తారు. పాణం పోద్ది. ఇంకా బాద ఏముంది? మీరే సెప్పండయ్యగారూ!

గజపతి: నిజవేంమరి!

ముక్కంటి: ఆణ్ణి సంపితే ఆవోక్కడితోనే పోయె. మిగతా వాళ్ళెట్టా దారుకుతారు?

గజపతి: ఎంతగొట్టినా వాడు ఆపేర్లు బయటపెట్టండే?

ముక్కంటి: ఒక్కరోజు దెబ్బలకే బయటపెడతాడా? రోజూ రేపూ మాపూ ఒకగంటసేపు మర్దించాలి. వల్లంతా

పచ్చిపుంట్లై బూరెలాగా పొంగి లసలసమనేటప్పుడు దరువు మీద దరువు ఏత్తా ఉంటే అప్పుడుగాని మన మజా తెలియదు.

(గజపతి ఆలోచనలో పడతాడు.)

ముక్కంటి: ఆడిబతుకు సిన్నప్పటినుంచి నాకు తెలుసు దొరా! లోపల లోటారం బయటపటారం. మెల్లిగా నన్నప్పగించి నట్టయితే వారంరోజుల్లో అన్నిరాస్యాలు బయటికి లాక్కపోయానా? పైకి నేనొట్టి పిచ్చోడిలాగా కనపడతాగాని కనపడ్డంత పిచ్చోణ్ణిగాదు దొరో!

గజపతి: ఇప్పటిదాకా ఎక్కడ చచ్చావుమరి? ఆ ఏడ్చేదేంటో ముందే ఏడిస్తే పోయేదిగా?

ముక్కంటి: దొరలు మాట్టాడతాఉంటే నడాన నేను మాట్టాట్టం తప్పుగాదూ? (అంటూ లెంపలు వేసుకుంటూ) నాక్కూడా కాస్తి గ్యానం ఉందండి... దొరక్క దొరక్క మాంచి శాన్సు దొరికింది. దెబ్బకి రెండుపిట్టలు పడేయి. ఏం లాబం, పోగొట్టారు.

గజపతి: ఎలా?

ముక్కంటి: ఈడు సిక్కాడా, ఈణ్ణి కొట్టోబెట్టో సావగొడతా ఉంటే ఈడి పెళ్ళాం దేవుడా అంటావచ్చి మీ కాళ్ళ మీద పడేది. కాకి ముక్కుకు దొండపండని ఈడి కాపెళ్ళాం దొరికినందుకు సెప్పుకోవాలి. ఆడదంటే ఆడదా! బంగారబ్బొమ్మ! ఒక్కసారి చూశారా రోజూ కలలో రావాల్సిందే. ఈణ్ణి సంపుతావని దాన్నీ, దాన్ని సంపు

తాఁవని ఈణ్ణే ఇద్దరి జుట్లు చేతిలో పెట్టుకుంటే అటు ఆపనీ, ఇటు ఈపనీ రెండూ అయ్యేయి.

గజపతి : (సంతోషంతో ఎగిరి గంతేసి) అద్భుతం! అద్భుతం! అద్భుతంగా ఉందిరా నీ సలహా, ఇదుగో వెయ్. నువ్వు కూడా ఒకడోసు వెయ్. డోసువేస్తే నీ బుర్ర ఇంకా బాగా పనిచేస్తుంది.

(అంటూ గ్లాసు ముక్కంటి చేతికిస్తాడు.)

,, ఎవడురా అక్కడ ?......సర్దార్ !

భీమన్న : జీ హుజూర్ !

గజపతి : ప్రసాదును అప్పుడే ఉరి తియ్యటానికి వీల్లేదు. తీసుకొచ్చి కొట్లో పెట్టు.

భీమన్న : చిత్తం! అలాగే.

గజపతి : (ముక్కంటితో) నువ్వంటే ఏఁవో అనుకున్నాం. తిమ్మరుసు మంత్రిని చంపి పుట్టావురా ముక్కంటీ!

ముక్కంటి : (నవ్వుతూ) హిం హిం హిం ఏదో మీాదయ.

గజపతి : సరే, నువెళ్ళి అటు దాసపనీ, ఇటు వీడి పనీ రెండూ చూడు.

ముక్కంటి : దాని పనెంతసేపండీ. సిటికెలో సేసేత్తా. అట్టాంటాటిల్లో మనది అందెవేసిన చెయ్యిలెండి. ఈ సుట్టుపక్కల ఆఁవడదూరంలో ఎక్కడ మనకు తెలియని ఆడది లేదనుకోండి. పోతే ఇక వీడిదే కాస్తి పేసీ. నాలుగురోజులు మల్లీ మచ్చిక సేసుకుంటేనేగాని పిట్ట వల్లో పడదు.

గజపతి: నాలుగు రోజులు గాకపోతే పది రోజులు టైము తీసుకో. మనకు కావలసింది పని.

ముక్కంటి: ఆణ్ణి కొట్టో పెట్టామగా, అక్కడికి నే నెట్టా ఎల్తా?

గజపతి: నిన్నడ్డగించే దెవడోయ్! నీ ఇష్టం వచ్చినన్నిసార్లు వెళ్ళు. ఇదిగో ఫర్మానా.

(అంటూ గబగబ తెల్లకాగితంమీద పర్మిషన్ వ్రాసి)

,, ఇదిగో! ఈ చీటీముక్క పట్టుకెళ్ళి జైలరుకు చూపించు.

ముక్కంటి: ఈ సీటీముక్కే సాలునంటారా?

గజపతి: ఆ. ఆచీటీముక్కతో నీవు నీ యిష్టమొచ్చినన్నిసార్లు ప్రసాద్‌తో మాట్లాడొచ్చు.

ముక్కంటి: (ఆశ్చర్యాన్ని నటిస్తూ) అట్టాగా! తెలివి తేటలికి మా దొరగారినే సెప్పుకోవాలి.

గజపతి: (లేచి వెళ్ళుతూ) దాని పనికూడా చూస్తావుగా?

ముక్కంటి: మనదెబ్బకి ఇంకా తిరుగుందా? ఎంత పొద్దోయినా సరే ఇయ్యాలే మీపని పూర్తిచేత్తా. ఈ సీటీముక్కతో అంతా పీటీ మన్ను.

(గజపతి హుషారుగా వెళ్ళిపోతాడు. ముక్కంటి ఒక్కడే గంభీరంగా ఏదో ఆలోచిస్తూ స్టాట్ లైటులో అటు ఇటు తిరుగుతూ ఒక పక్కకు వెళ్లి మెల్లగా "నారయ్యన్నా" అని పిలుస్తాడు. నారాయణ వస్తాడు. ముక్కంటి నారాయణ చెవిలో ఏదో ఊదుతాడు.)

నారా: ఇవ్వాళ చస్తే రేపటికి రెండు. పద. నీతోపాటే నేనూ.

ముక్కంటి: ఆయుదం ఏది?

నారా: తెస్తానుండు.

(తెరలో కోలాహలం. "పకడో. పకడో. మారో! మారో!" అనే కేకలు — భీమన్న, శేషగిరి హడావుడిగా చెరియొకవైపునుంచి పరుగెత్తుకుంటూ వస్తారు.)

శేషగిరి: (బిగ్గరగా) రాజాసాహెబ్! రాజాసాహెబ్!

గజపతి: (లోపలినుంచి వస్తూ) ఏఁవిటీ హంగామా?

శేషగిరి: ఏఁవిటో ఊరంతా గల్లంతుగా ఉంది!

గజపతి! (శేషగిరిమాట వినిపించుకోకుండానే) సర్దార్! ముందు జైలుకు పరుగెత్తు, ఖైదీలున్నారో లేదో కనుక్కో.

(భీమన్న వెళ్తాడు. గజపతి రివాల్వరు లోడ్ చేసి పిచ్చివానిలాగా పిచ్చిచూపులు చూస్తూ పరవస్ను తొక్కుతూ ఉంటాడు.)

భీమన్న: (లోపలనుంచి వచ్చి) హుజూర్! ఖైదీలంతా పరారయ్యారు.

గజపతి: మోసం! కుట్ర!! ద్రోహం!!! (అంటూ రంకెలువేస్తూ) ముక్కంటి మోసం చేశాడు. ద్రోహం చేశాడు. మొట్టమొదటినుంచీ దొంగనాటకం ఆడి మసల్ని బుట్టలో వేసుకున్నాడు. వెళ్ళండి, పరుగెత్తండి. పట్టుకోండి. కాల్చండి — సర్దార్!

భీమన్న: హుజూర్!

గజపతి: సరోజిని ఇంటిమీద దాడిచెయ్. సరోజినిని పట్టుకురా. పో. (భీమన్న వెళ్తాడు)

శేషగిరి: నారాయణ ఏఁవయ్యాడు?

గజపతి: వాడు తక్కువతిన్నాడా? నువ్వు తక్కువ తిన్నావా? ఇంతకాలంనుంచి అటూ ఇటూ దొంగనాటకం ఆడావు. మీరంతా రౌడీలతో మిలాఖత్ అయ్యారు. ఒక్కణ్ణీ నమ్మ టానికి వీల్లేదు. కూచుంటే మోసం, నుంచుంటే మోసం! కొడుకును నమ్మటానికి వీల్లేదు. కూతుర్ని నమ్మటానికి వీల్లేదు. పొలాల్లో రౌడీలు – ఫ్యాక్టరీల్లో రౌడీలు – కొండల్లో రౌడీలు – సముద్రంలో రౌడీలు– దేశం అంతా రౌడీమయం, ప్రపంచమంతా రౌడీమయం...

(భీమన్న సరోజినిని పెడరెక్కలు విరిచికట్టి హాజరు పరుస్తాడు. సరోజిని నుద్దేశించి–)

,, ఇన్నాళ్ళనుంచి తప్పించుకు పోయావ్! ఈ సారి తప్పించుకు పోలేవు. చెప్పు నీ మొగుడెక్కడున్నాడో?

సరో: నాకు తెలియదు.

గజపతి: ఈ దొంగవేషాలన్నీ నాముందు సాగవ్. చెప్పు.

సరో: చెప్పానుగా?

గజపతి: ఏమని?

సరో: నాకు తెలియదని.

గజపతి: మీ మాటలు నమ్మటానికి వీల్లేదు. మీరంతా దొంగలు.

సరో: నీలాంటి దొరకంటే దొంగేనయం.

గజపతి: షటప్! చెపుతావా చెప్పవా? (రివాల్వరు చూపిస్తూ) షూట్ చేస్తా.

సరో: చెయ్, అంతకంటె నీకింకేం చేతవుతుంది.

గజపతి: జాగ్రత్త! ప్రాణంపోతే మళ్ళీ రాదు.

సరో: ఆ సంగతి నీకంటే నాకు బాగా తెలుసు.

గజపతి: తెలిస్తే ఇంకేం, చెప్పు నీ మొగుడెక్కడున్నాడో.

సరో: గజపతి జైల్లో.

గజపతి: జైల్లోనుంచి పారిపోయ్యాడు.

సరో: మంచిపని చేశాడు.

గజపతి: (క్రోధావేశంతో) నీపని అంత ఎగతాళిగా ఉందా?... సర్దార్! దీని వంటిమీద బట్టలన్నీ ఊడదీసి యాభై కొరడాదెబ్బలు కొట్టు. అప్పుడుగాని దీని పొగరణగదు.

(భీమన్న సరోజినివైపు రెండడుగులు వేసి కొంచెం సంకోచిస్తాడు.)

,, (గద్దిస్తూ) చూస్తావేం? ఊఁ, ఊడదీయ్.

(భీమన్న సరోజిని పైటచెంగు బట్టుకొని చీర ఊడదీయటానికి ప్రయత్నిస్తాడు. వెడరెక్కలు విరిచి కట్టిఉన్న సరోజిని తన పైటచెంగు జారిరాకుండా పండ్లతో గట్టిగా పట్టుకొని మానాన్ని కాపాడుకోడానికి సతమతమవుతూ ఉంటుంది.

(అంతకు ముందునుంచి ఆదృశ్యాన్ని చూడలేక బాధపడుతూఉన్న శేషగిరి ఇక నిగ్రహించుకోలేక ఆవేశపరవశుడై పిచ్చివానిలాగా గజపతి దగ్గరకు పరుగెత్తుకు వస్తాడు.)

శేషగిరి: ఏమి టీఘోరం? ఇంతకంటె ఒకేసారి కాల్చేసినా నయం.

గజపతి : నీ బ్రతుక్కోసం నీకుకూడా ఒకపౌరుషం! సరే, నీ కోరికే నెరవేరుస్తా. ఇదిగో పిస్టల్. నువ్వే కాల్చేయ్.

(అంటూ ఒక పిస్టల్ శేషగిరి చేతికిచ్చి తాను మరొక పిస్టల్ తీసుకొని శేషగిరికి గురిపెట్టి ...)

,, కాల్చేయక పోయ్యావా నీ ప్రాణం ఎగిరిపోతుంది, ఖబర్దార్!

(శేషగిరి పిస్టల్ తీసుకొని విపరీతంగా మథన పడతాడు. చివరికి ఎలాగైతేం గుండె రాయి చేసుకొని చెల్లెల్ని కాల్చివేయడానికి గురి పెడతాడు. కాని కాల్చలేకపోతాడు.)

గజపతి : రెడీ! వన్......టు......

రెడీ! వన్......టు......త్రీ

(గజపతి శేషగిరిని కాల్చేస్తాడు. "అబ్బా!" అంటూ శేషగిరి కింద పడిపోతాడు. "అన్నయ్యా!" అంటూ సరోజిని రివ్వున కేక వేస్తుంది.)

గజపతి : (కిందబడి గిలగిల తన్నుకుంటూ ఉన్న శేషగిరి నుద్దేశించి) నమక్ హరామ్! నీకు తగిన శిక్ష అనుభవించావు. చావు! (అంటూ మరొకసారి కాల్చి) సర్దార్! వీడి శవాన్ని తీసికెళ్ళి ఊరిబైట ఊబిలో తొక్కించేసేయ్. నరమానవుడి కంట బడకూడదు. జాగ్రత్త!

(భీమన్న మరో ఇద్దరుభటులు శేషగిరి శవాన్ని తీసికెళ్తారు. సరోజిని దుఃఖంతో కుంగిపోతూ ఉంటుంది. గజపతి సరోజిని దగ్గరకువెళ్ళి— )

గజపతి : చూశావా, నీ అన్నగతేమయిందో! ఇప్పటికైనా చెపుతావా లేదా?

సరో : ఛీ నీచుడా! నోర్మూయ్.

(తెరలో బ్రహ్మాండమైన కోలాహలం, కాల్పులు)

గజపతి : (కంగారుపడుతూ) సర్దార్! సర్దార్! చివరకు వీడు కూడా పారిపోయ్యాడు. మనిషై పుట్టినవాణ్ణెవణ్ణీ నమ్మటానికి వీల్లేదు. (సరోజినితో) నీమూలంగానే ఇదంతా నాశన మయింది. చావు, పిశాచీ!

(అంటూ సరోజినిని కాల్చివేసి గజపతి గాబరాగా అటూ ఇటూ బెదిరి బెదిరి చూస్తూ వక్కి-వక్కి పారిపోతూ ఉంటాడు. ఇంతలో ముక్కంటి ఎదురుగా వచ్చి పారిపోతూఉన్న గజపతిని కర్రతో కొడతాడు. దెబ్బకి గజపతి గింగరాలు తిరిగి కిందపడిపోతాడు. గజపతి చేతిలోఉన్న పిస్తోలు దూరంగా పడిపోతుంది. గజపతి కిందపడికూడా పడిపోయిన పిస్తోలును అందుకోటానికి ప్రయత్నిస్తాడు. వెంటనే అది ముక్కంటి గ్రహించి పిస్టల్ అతని చేతికందకుండా లాగేసి "ఖబడ్దార్!" అంటూ గజపతిని జాపనీస్ ట్రయాంగిల్‌తో బంధిస్తాడు. ఇంతలోనే ప్రసాదు పరిగెత్తుకుంటూ వస్తాడు.)

ప్రసాదు : (ముక్కంటితో) దొరికాడన్నమాట. తీసికెళ్ళి ముందు కొట్లో పడెయ్. వీడిసంగతి తర్వాత ఆలోచిద్దాం.

(ముక్కంటి గజపతిని తీసుకెళతాడు. ప్రసాదు యింకా ముందుకు రెండడుగులువేసి సరోజినిని చూచి నిశ్చేష్టుడై - వెంటనే తేరుకొని, సరోజినిని చేతులలోకి తీసుకొని "సరోజినీ! సరోజినీ!" అని పిలుస్తాడు. ప్రసాదుమాట వినేటప్పటికి ఇంకా కొనఊపిరితో మిగిలిఉన్న సరోజనికి కొంచెం స్పృహవస్తుంది. మెల్లగా కండ్లుతెరచిచూచి ప్రసాదును గుర్తించి)

సరో : వచ్చావా బావా! మళ్ళీ నిన్ను చూశాను. అంతే చాలు. సంతోషంగా......

(అంటూ ప్రసాదు చేతుల్లోనే ప్రాణం విడుస్తుంది. ముక్కంటి గబ గబా సరోజిని దగ్గరకు వచ్చి కట్లువిప్పి నేలమీద పండుకో పెడతాడు.

ఇంతలో భద్రయ్య, వీరయ్య, నారాయణలుకూడా వస్తారు. సరోజినిని చూడగానే భద్రయ్య ఆవురుమంటాడు. ప్రసాదు సరోజిని మీదపడి ఏడుస్తూ ఉన్న భద్రయ్య చేతులు పట్టుకొని-)

ప్రసాదు : ఊరుకో మామయ్యా!

భద్రయ్య : (ఏడుస్తూనే) ఎలా ఊరుకోను నాయనా! ఉన్న ఒక కొడుకునీ వాళ్లే పొట్టన బెట్టుకున్నారు. నేను బ్రతికుండి ఈ పాపిష్టి కళ్లతో నా బిడ్డచావునుకూడా చూడాలిసొచ్చింది.

ప్రసాదు : నీ బిడ్డ చచ్చిపోలేదు మామయ్యా. నీ బిడ్డ చచ్చిపోదు. సరోజిని అమరజీవి, ఆదర్శజీవి, మన పోతుగడ్డకి తగిన బిడ్డ.

(అంతా లేచి సరోజిని శవం చుట్టూ చేతులు కట్టుకొని భక్తి పురస్సరంగా తల వంచి జోహారులర్పిస్తారు)

— తెరలోనుంచి పాట —

జోహారూ
జోహారూ
వీరులకూ జోహారూ
రణధీరులకూ జోహారూ
మెతుకు కరువై
బతుకు బరువై
గతుకులంబడి వెతలనొందీ,

చితికిపోయిన జాతికాశా
జ్యోతిచూపిన నీతిపరులకు ॥జోహారూ॥
మెడలుమెలిచీ
నడుమువిరిచీ
ఒడలు జల్లెడగాగపొడిచీ,
నరకయాతన లెన్నిబెట్టిన
మాటజారని మానధనులకు ॥జోహారూ॥

[ తెర ]

